
VICTORY

విక్టరీ

జాతిపిత

# మహాత్మగాంధీ



బయోగ్రఫీ సిరీస్

## జాతిపిత

# మహాత్మాగాంధీ

విక్టరీ అకడమిక్ యూనిట్

**విక్టరీ పబ్లిషర్స్**

డోర్. నెం. 30-17-3ఎ,  వారణాశివారి వీధి, సీతారాంపురం,

జాతిపిత **మహాత్మాగాంధీ**

© Ln. **I. Ramakumar**, PMJF
Immadisetty Akkeswara Rao
Charitable Trust, Vijayawada.

ప్రథమ ముద్రణ - 2004
చతుర్థ ముద్రణ - 2014

**వెల. రూ.**

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ - ఆంధ్రప్రదేశ్**

**శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో**
30-17-3A, వారణాశివారి వీధి,
సీతారాంపురం, విజయవాడ - 2.
ఫోన్ : **0866 - 2444156**

❖ ❖ ❖

**సాయి వెంకటేశ్వర బుక్ డిపో**
26-27-77, బాటా షోరూమ్ ఎదురు,
గాంధీనగర్, విజయవాడ-520 003.
ఫోన్ : **(0866) 2570192, 2570309**

**సోల్ డిస్ట్రిబ్యూటర్స్ - తెలంగాణ**

**శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో**
ప్లాట్ నెం. 3, 103, 2-4-1085,
సాయిలక్ష్మి నికేతన్,
రామకృష్ణా హాస్పటల్ ఎదురువీధి,
కాచిగూడ కుమార్ థియేటర్ దగ్గర,
నింబోలి అడ్డ, హైదరాబాదు-500027.
ఫోన్ : **(040) 65528228, 24653879**
(ఫాక్స్) **24745257**, సెల్ : **9346771314**

❖ ❖ ❖

**దుర్గా బుక్ డిస్ట్రిబ్యూటర్స్**
# 4-5-172, మొదటి అంతస్తు,
గోఖుల్ టవర్స్, గోఖుల్ చాట్ వెనుక,
హస్మత్‌గంజ్, కోటి,
హైదరాబాద్ - 500 095
ఫోన్ : **(040) 24752801, 64542801**

*Also available at*
**www.newshunt.com, www.kinige.com, www. rockstand.in**

**మనవి :** మాచే ప్రచురించబడిన అన్ని రకముల పుస్తకములు అన్ని ప్రముఖ బుక్ షాపులలోను, విశాలాంధ్ర మరియు ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచిలలోను లభించును. లభించని యెడల మమ్ములను నేరుగా సంప్రదించగలరు. పుస్తకాలలో ఏవైనా లోపాలు, తప్పులు ఉన్నా తెలియచేసిన తదుపరి ముద్రణలో సరిచేయగలం. ఏ విషయమైన **ramakumarimmadsetty @yahoo.com** మెయిల్‌కు తెలియజేయవచ్చును. మీకు కావలసిన పుస్తకాలకు : **SBI online A/c. No. 32987503888 సాయి వెంకటేశ్వర బుక్ డిపో, విజయవాడ** పేరున జమచేసి, మీకు దగ్గర గల ట్రాన్స్‌పోర్టు వివరాలు తెలుపవలెను.

***Published by :*** **విక్టరీ పబ్లిషర్స్, విజయవాడ**

**We have made many efforts to present this book without errors. But some errors might have crept in. We do not take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice we shall correct them in our next edition. All disputes are subject to Vijayawada Jurisdiction only.**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | బాల్యం | 1 |
| 2. | విదేశీ విద్య | 11 |
| 3. | రాముడే తోడు | 24 |
| 4. | పోరాట పటిమ | 32 |
| 5. | భారతయాత్ర | 50 |
| 6. | ఉద్యమ కెరటాలు | 64 |
| 7. | జలియన్ వాలాబాగ్ | 66 |
| 8. | సహాయనిరాకరణ | 72 |
| 9. | ఉప్పు సత్యాగ్రహం | 75 |
| 10. | క్విట్ ఇండియా | 80 |
| 11. | 1947 ఆగస్టు 15 | 82 |
| 12. | ఆత్మ బలిదానం | 85 |

# ఉపోద్ఘాతం......

మానవ వికాస చరిత్రలో, ఎందరో మహానుభావులు ఉద్భవించి, తాము జీవించిన కాలాన్ని, సమాజాన్ని ప్రభావితం చేసినవారు తరచుగా కనిపిస్తారు. తరువాత కాలంలో వారినే చరిత్ర ఆధునిక యుగానికి నాయకులుగా పరిగణించి వేనోళ్ళ కీర్తిస్తుంది. వారి వారి మహాకార్యాలను శ్లాఘించి గుర్తుంచుకొంటుంది. ఇలాంటి మహాపురుషులు తమ కాలం కంటే ముందుండి క్రియాశీలకంగా, సమాజానికి ప్రయోజనకరంగా ఉండి, భవిష్యత్తులోనికి చూడగలిగినవారిగా ఉండి, ఆ కాలంనాటికి మూసగా మారిపోయిన సాంఘిక దురాచారాలను దుర్వ్యవస్థల అంతమొందించేవారుగా నిలిచిపోతారు.

ప్రాచీన కాలంలో ఈ భారతావనిని అభ్యుదయ పథం వైపు తీసుకొని పోయిన త్యాగశీలురు, వీరులు, మేధావంతులు, సంస్కర్తలు ఎందరో ఉన్నారు. వారంతా తమ తమ రంగాలలో విశేషమైన కృషి చేసి తమ మేధతో, త్యాగంతో, వీరకార్యాలతో, సంస్కరణాభిలాషతో ఈ దేశ ప్రజలను సన్మార్గంలోకి మళ్ళించినవారే. అయితే భారతదేశం, 17వ శతాబ్దం నుంచి ఒక స్తబ్దతలోనికి జారిపోయింది. విదేశీయుల పరిపాలనలో ఈ జాతి ఆసేతు హిమాచలం ఎన్ని అరాచకాలకు దురాగతాలకు బలి అయిపోయిందో చెప్పటం కష్టం. ప్రజలంతా తమ ఖర్మం ఇంతే, తమ జీవితాలు ఇంతవరకే అని ఒకరకమైన నిర్లిప్తతకు అలవాటు పడిపోయినారు. 18వ శతాబ్దంలో ఐరోపీయులు భారతదేశంలోకి ప్రవేశించటం మొదలు అయింది. క్రమంగా వారు వ్యాపారం అయిన తమ ప్రధాన ఉద్దేశ్యాలను వదలి దానితోపాటు, రాజ్యభాగాలను ఆక్రమించటం మొదలుపెట్టారు. ఒక ప్రదేశం తరువాత ఒక ప్రదేశం క్రమంగా వారి కబంధ హస్తాలలోకి ఏలుబడి క్రిందకు వచ్చింది. 18వ శతాబ్దం చివరి నాటికి దేశంలో మూడు వంతులు ఆంగ్లేయులు పాలనలోకి రాగా మిగిలిన ప్రాంతం క్రూరులు, మూర్ఖులైన స్వదేశీ సంస్థానాధీశ్వరుల పాలనలో మిగిలింది. పేరు స్వదేశీ పాలకులదే అయినా వారు కూడా ఆంగ్లేయులకు బానిసలుగానే ఉండవలసిన స్థితి వచ్చింది. దాదాపుగా దేశ ప్రజలందరు బానిసలుగా ఆంగ్లేయుల పాలనలో మగ్గిపోతున్న సమయంలో, రంగం మీదకు ఒక మహానుభావుడు ఉద్భవించి స్వాతంత్ర్య వాయువులను పీల్చగలిగేటట్లు చేయగలిగిన వ్యక్తి యొక్క అవసరం ఏర్పడింది. సరిగా అలాంటి సమయంలో ఈ దేశ యవనిక మీద మోహనదాస్ కరంచంద్ గాంధీ ఉద్భవించాడు. ప్రపంచం అంతా ఆ మహనీయుని మహాత్మాగాంధీని ఆదరించింది. దేశ స్వాతంత్ర్యం కోసం, ఆంగ్లేయుల కబంధ హస్తాల నుంచి భారతభూమిని విడుదల చేయటం కోసం ఎటువంటి హింసకు పాల్పడకుండా శాంతిమార్గంలో ఎంతటి మహత్తర కార్యాన్నైనా

సాధింపవచ్చని నిరూపించిన ధీశాలి మహాత్మాగాంధి. ఆయన చూపిన మార్గం కేవలం భారతదేశానికే కాదు ప్రపంచం మొత్తానికి ఒక వెలుగుబాటగా నిలిచిపోయింది. అందుకే ఆయన జీవితం అందరికీ ఆదర్శం. ఆయన మార్గం అనుసరణీయం. ఆయన కార్యశీలత ప్రశంసనీయంగా కీర్తింపబడుతున్నాయి. ఆయన తరతరాల భారత ఆధ్యాత్మిక వికాసానికి, శాంతి సౌభాగ్యాలతో కూడిన జీవన విధానానికి, ధర్మయుతమైన ప్రవర్తనకు ప్రతీకగా నిలిచిపోయినాడు. అటువంటి మహానుభావుని జీవితంగురించి తెలుసుకొనటం మనకు అత్యవసరం, ఆయన పయనించిన మార్గంలో ప్రయాణం చేయటం అనుసరణీయం. భారతదేశ శాంతి సహనశీలతలకు ఆయన చిహ్నం. ధర్మం కర్తవ్యనిష్టలకు ఆయన ప్రతీక. అందుకే ఈ చిన్న ప్రయత్నం.

గాంధీ ప్రేమించిన అంశాలు సత్యం, అహింస, జీవుల యెడ దయ. ఆయన ఆ గుణాలనే తాను సర్వాత్మనా నింపుకున్నాడు. తన వలెనే ఇతరులు కూడా ఉండాలని ఆశించాడు. అదే మహాత్మాగాంధీ జీవిత సాఫల్యం.

మహా విజ్ఞానవేత్త "ఐన్‌స్టీన్" గాంధీకి సమకాలికుడే. ఆయన గాంధీని గురించి, రక్తమాంసాలు గల ఇటువంటి వ్యక్తి ఈ భూమి మీద నడిచాడని ముందు తరాల వారు నమ్మలేకపోవచ్చునని తెలిపారు. మహాత్మాగాంధీని గురించి ఈ విధంగా అభిభాషించిన వ్యక్తి కేవలం ఒక ఐన్‌స్టీన్ మాత్రమే కాదు. మహాత్మాగాంధీతో పరిచయము ఉన్న ప్రతి వ్యక్తీ ముఖ్యంగా ఆయనంటే, ఆయన భావాలంటే ఏ మాత్రం సరిపోని వ్యక్తులు కూడా గాంధీలోను ఆయన వ్యక్తిత్వంలోను ప్రత్యేకత ఉన్నదనే విషయాన్ని అంగీకరిస్తారు. ఒక ఉదాహరణకు దక్షిణాఫ్రికాలో సుదీర్ఘకాలం మహాత్మాగాంధీ ఆ దేశ పాలకుడు జనరల్ స్మట్సుతో పోరాడాడు. అలాగే వివిధ వైస్రాయిలు, రాజ ప్రతినిధులకు విరుద్ధంగా భారత దేశంలో గాంధీ మహాత్ముడు పోరాడాడు. అయినా వారందరూ కూడా గాంధీలోని విశిష్టతను గుర్తించినవారే. ఆయన తనతో విరోధం వహించి పోరాడిన వారిని కూడా ప్రేమించినవాడేనని వార అందరికీ తెలుసు. ఆయన వారిపై ద్వేషం, అసూయ, కోపాల వలన పోరాడలేదు. ఆయన వారిని ప్రేమించాడు. కాబట్టి పోట్లాడాడు. ఎందుకంటే వారు చేసే పనులు ఇతరులకే కాకుండా, తమకు తాము కూడా హాని కలిగించేవే కాబట్టి, ఆ దుష్టగుణాలను తొలిగించాలని పోరాడాడు.

ఆయనను అతి దారుణంగా హత్య చేసినవాడు కూడా ఆయన దేశీయుడే. ఆయన మతానికి చెందినవాడే. గాంధీ హత్యావార్తను విన్న వెంటనే ప్రసిద్ధ ఆంగ్లేయ నాటకకర్త. మేధవి జార్జి బెర్నార్డు షా వంటి విఖ్యాత వ్యక్తి కూడా "అతి మంచిగా ఉండటం ఎంత ప్రమాదహేతువో ఈ ఉదంతం తెలుపుతున్నది" అన్నాడు. మహాత్మాగాంధీ సంపూర్తిగా మంచితనంతో ఉండాలనుకొన్నాడు. తాను అందరియెడ మంచితనంతో ఉండి, ఇతరులు అందరియందు అలాగే ఉండాలని ఆశించారు.

# మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ

(1869-1948)

## 1. బాల్యం

అది 1869వ సంవత్సరం, అక్టోబరు నెల రెండవతేదీ.

గుజరాతు రాష్ట్రములోని కథియవాడ ప్రాంతములోని పోరుబందరు పట్టణము.

చక్కని నియమపాలన కలిగిన ఉత్తమ్‌చంద్‌గాంధీగారి కుమారుడు కరమ్‌చంద్ గాంధీ ఇంటి వసారాలో ఆందోళనగా పచార్లు చేస్తున్నాడు.

ఉత్తమ్‌చంద్ అనబడే ఓతా గాంధీగారి కోడలు పుతలీబాయి పురుటి నొప్పులు పడుతోంది. తండ్రికి ఉన్నట్లే కరమ్‌చంద్ గాంధీకి కూడా కబాగాంధీ అనే వ్యవహార నామం ఒకటి ఉండేది. పచారి దినుసుల వ్యాపారం చేసే గాంధీ కుటుంబంలోని వారయినా ఆ తండ్రీ కొడుకులు విలక్షణమయిన రీతిలో జీవికను వెళ్ళదీస్తున్నారు.

ఉత్తమ్‌చంద్ ఉరఫ్ ఓతా గాంధీగారు ఉద్ధండపిండమే! ఆయన కథియవాడ సంస్థానంలో మంత్రిగా పనిచేశాడు.

ఆయన రాజుగారికి ఎడమచేతితో సలాము చేశాడట! అదేమని రాజుగారు ప్రశ్నిస్తే కుడిచేయి ఇంతకు మునుపే పోరుబందరుకు అంకితమయిందని సగర్వంగా విన్నవించాడట.

ఫలితంగా ఉద్యోగానికి ఉద్వాసన చెప్పాల్సి వచ్చింది. ప్రేమించిన పోరుబందరుకు తిరిగి వచ్చారు. అంతటి ఉద్ధండుని కుమారుడు కరమ్‌చంద్ గాంధీ.

ఆయన ఇప్పుడు కంగారుపడుతున్న కారణం మరేమిటో కాదు. తన నాలుగవ అర్ధాంగి నొప్పులు పడుతోంది. తాతగారి దర్పానికి ధీటయిన మనవడు పుట్టాలని ఆయన కోరిక.

ఇంతలో "మగబిడ్డ... మగబిడ్డ" అని లోపల ఆడవాళ్ళు చెప్పుకోవడం వసారాలోనికి విన్పిస్తూనే ఉంది. కరమ్‌చంద్ గాంధీ హాయిగా నిట్టూర్చాడు.

ఆ కుటుంబంలో మరొక గాంధీ పుట్టాడు.

ఆతడు యావద్భారతావనికే కాక మొత్తం ప్రపంచమంతా గుర్తించే ఏకైక నేత అవుతాడని ఎవరూ కలగనలేదు. అతని వాలకం చూస్తే కనీసం బ్రతికి బట్టకడతాడని కూడా ఊహించలేక పోయారు. దుర్బలుడయిన శిశువు.

భవిష్యత్తులో మొత్తం జాతిని ఒకే త్రాటి మీద నడిపించగల నేత అవుతాడని ఎలా తెలుస్తుంది? కబాగాంధీ పోరుబందరు ప్రధానమంత్రి పదవి తరువాత కోర్టులో పనిచేశాడు.

ఆ తరువాత రాజకోట దివానుగిరీ చేశాడు. బికనేరు దివాన్‌గా కూడా చేశాడు. జీవితాంతం రాజకోట నుంచి పింఛను తీసుకున్నాడు. చిన్నభార్య పుతలీబాయికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు కలిగిన తదనంతరం ఇది నాలుగవ కాన్పు. మగబిడ్డ అయినా దృఢంగా లేదు.

మోహన్‌దాస్ అని పేరు పెట్టుకున్నారు. తండ్రి పేరు చివర కలియగా అతడు మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ అయ్యాడు.

కబాగాంధీ తండ్రికి తగినవాడే! న్యాయానికి దర్పణంలాంటివాడు. పై అధికారులు తప్పు చేస్తే తప్పకుండా ఎదిరించేవాడు. ఎన్ని శిక్షలయినా అనుభవించేవాడు. కాని తప్పుకు తలవంచేవాడు కాదు.

ఆయన అర్ధాంగి పుతలీబాయి పరమసాధ్వి. వ్యవహార జ్ఞానం కలిగిన ఇంటి ఇల్లాలు. ఆ దంపతులు మోహన్‌దాస్‌ను గారాబంగా పెంచారు. తల్లి అతనిని అక్కున చేర్చుకుని అద్భుతమయిన కథలెన్నో చెప్పి వినిపించేది.

శుక్లనామ సంవత్సరంలో, భాద్రపద మాసం బహుళ ద్వాదశినాడు శనివారం వచ్చింది. ఆ రోజే కరమ్‌చంద్ జన్మదినం. తండ్రి మంచి ఖర్చుదారుడు. తల్లి సాంప్ర దాయాల పట్ల తపన కలిగి ఉండేది. వ్రతాలు, పూజలు ఆచరించేది. అన్నింటికన్న ఉత్తమమయిన చాంద్రాయణ వ్రతం కూడా చేసేదావిడ. దేవాలయ సందర్శనం ఎక్కువగా

ఉండేది గాంధీ బాల్యంలో. ఇంటిలో అందరూ విద్యావంతులు కావటం వలన చక్కగా సంస్కృత శ్లోకాలు చెవిన పడుతుండేవి.

చాంద్రాయణ వ్రతం చేస్తున్నప్పుడు సూర్యదర్శనం చేసిన తరువాత కాని భోజనం చేయకూడదు. అలాంటి సమయాల్లో మోహనదాస్ తల్లి పట్ల ఎంతో ఆసక్తిగా పరిశీలిస్తుండేవాడు. సూర్యుడు రాగానే పరుగెత్తుకు వెళ్ళి తల్లితో చెప్పేవాడు.

దురదృష్టవశాత్తు ఎప్పుడయినా సూర్యోదయం వేళకు మబ్బులు పట్టి సూర్యుడు కనిపించకపోతే తల్లి పరిస్థితికి నిట్టూర్చేవాడు. "ఈ రోజు నేను భుజించటం దైవానికి ఇష్టం లేదు" అని తల్లి అనేది. ఆ మాటలు సరిగా అర్థం కాకపోయినా అతని మనసు ఎంతగానో బాధించేది.

పోరుబందరుకు సుధామపురి అనే మరో పేరు ఉండేది. దాన్ని పాలించే రాజుల రాణి వాసంలో పుతలీబాయి నియమనిష్టలు, అనుష్టానం పట్ల ఎంతో భక్తి భావం ఉండేది. పోరుబందరులోనే మోహన్‌దాసుని బడిలో వేశారు. ఉపాధ్యాయుడు పాఠం రాని పెద్ద తరగతి విద్యార్థుల్ని తిట్టటం, కొట్టడం చిత్రంగా పరిశీలించేవాడు. అయితే ఇప్పట్లో తనకి ఆ తంటా లేదు. పై తరగతులకు వెళ్ళినప్పుడు కదా!

ఎక్కాలు వల్లించడం మహా కష్టంగా ఉండేది.

అప్పుడు తోటి విద్యార్థులతో కలసి తిన్న దెబ్బలు తాను మందబుద్ధి అనే అభిప్రాయాన్ని కలిగించేవి. ఈ విషయాన్ని మహాత్ముడు జీవితమంతా జ్ఞాపకం పెట్టుకున్నాడు. అరేబియా సముద్ర తీరంలో ఉన్న కథియవాడ ప్రాంతాలలో మహాపురుషులు ఎందరో పుట్టారు. స్వామి దయానంద సరస్వతి, మహ్మదాలి జిన్నా, రంజిత్‌సింగ్, వారిలో పీలగా, బలహీనంగా ఉండే మోహనదాసు తలమానికం అవుతాడని ఎవరూ ఊహించలేదు.

గాంధీ తండ్రి కరంచంద్ గాంధీ పోరుబందరు వదలి రాజకోట కోర్టులో పని చేయడానికి బదిలీ అయ్యాడు. అక్కడే మోహనదాస్‌ను ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. తోటి విద్యార్థులతో కలిసి హుషారుగా తిరగడం, అల్లరి చేయడం అలవాటు లేదు. పుస్తకాలు, పాఠాలు, వేళకు బడికి పోవడం, బోధనా సమయం పూర్తి కాగానే ఇంటికి పరిగెత్తడం, ఇవే నిత్య కార్యక్రమాలు, అబద్ధాలాడటం అలవాటు లేదు. సిగ్గరిగా ఉండేవాడు.

ఒకసారి "జైల్స్" అనే ఆయన పర్యవేక్షకుడుగా పాఠశాలకు వచ్చాడు. పిల్లల భాషాజ్ఞానం పరిశీలించే నిమిత్తం పరీక్షలు నిర్వహించాడు. అయిదు మాటలు ఇచ్చి తప్పు లేకుండా వ్రాయమన్నాడు. 'కెటిల్' అనే మాట ఎలా వ్రాయాలో మన గాంధీకి అర్థం

కాలేదు. తప్పుగా వ్రాశాడు. తరగతి ఉపాధ్యాయుడు ఇది గమనించి తప్పు దిద్దుకోమని రహస్యంగా సైగ చేశాడు. అలా చేయడం గాంధీకి సమ్మతం కాలేదు.

ముందు కూర్చుని వున్న బాలుని పలకలో చూచి కాపీ కొట్టడం తప్పనిపించింది. అలా చేయకుండా ఉండాలనే ఉపాధ్యాయులు కాపు కాస్తుంటారు.

మిగిలిన పిల్లలు ఆయన సంకేతాలను అందుకొని కాపీ చేశారు. ఈ సంఘటన జరిగిన తర్వాత ఆ ఉపాధ్యాయుడు ఇంచుమించు పగబట్టాడనే అనుకోవాలి. గాంధీని అదొకలా చూడటం మొదలుపెట్టాడు. అడపాదడపా కారణం లేకుండానే శిక్షలు వేస్తుండేవాడు.

పెద్దవారి తప్పులకు తలవంచడమే మోహనదాస్‌కు ఇష్టంగా ఉండేది. కాని మోసం చేయాలనే అభిప్రాయం మాత్రం కలగలేదు. శిక్ష తప్పించుకోవడానికి బాగా పాఠాల మీద శ్రద్ధ నిలిపాడు. ఆ విధంగా పుస్తకలే అతని ప్రపంచంగా మారాయి.

తరగతి పుస్తకాలే కాకుండా ఇతర గ్రంథాలను కూడా చదవటం అలవాటయింది. ఒకసారి కరంచంద్ గాంధీ తీసికొని వచ్చిన ఒక పుస్తకాన్ని మోహన్‌దాస్ గాంధీకి అందుబాటులో ఉంచాడు. పాఠశాలలో పంతులుగారి వల్ల, అశాంతికి లోనైన మోహనదాస్ ఆ పుస్తకాన్ని ఇంటి దగ్గరే చదివాడు. దానిలో శ్రవణ కుమారుడు తల్లిదండ్రుల పట్ల చూపిన శ్రద్ధ మనసుని ఎంతగానో ఆకర్షించింది. పితృభక్తి అనేది జీవిత పరమార్థంగా తోచింది.

తల్లిదండ్రులను కావడిలో కూర్చుండబెట్టుకుని తీర్థయాత్రలకు తీసుకొనిపోతాడు శ్రవణ కుమారుడు. ఆ శ్రవణ పితృభక్తి చూచి గాంధీ హృదయం ద్రవించింది. అప్పుడు వినిపించిన కరుణరసం, జాలువారే గీతం, గుండెల మీద చెరగని ముద్ర వేసింది. శ్రవణ కుమారుడు చనిపోయిన ఘట్టంలో గాంధీ నిజంగానే కన్నీరు పెట్టుకున్నాడు. ఆ గీతాన్ని తాను కూడా పాడాలని ప్రయత్నించాడు.

పాట పాడటం కుదరలేదు కాని, శ్రవణ కుమారుని వలె పితృభక్తిని కలిగి ఉండాలనే కోరిక మనసులో నిలిచిపోయింది.

విచిత్రమైన సంఘటనలు ఊహించకుండా జరుగుతుంటాయి. అవే మామూలు మనుషులను మహాత్ములుగా మార్చుతుంటాయి. శ్రవణ కుమారుని పితృభక్తి నాటకం చదివిన జ్ఞాపకాలు మనసు మీద ముద్రపడి చెరిగిపోలేదు. ఆ సమయంలోనే మరొక సంఘటన కూడా జరిగింది.

ఆ రోజుల్లో ఊరూరా తిరిగే నాటక సమాజం వారు ఉండేవారు. చెక్కపెట్టెలు, అద్దాలు అమర్చి బొమ్మలు చూపిస్తూ తిరిగేవారు కొందరు. అలాంటి చిత్రం ఒకటి గాంధీ చూడడం జరిగింది. ఒకసారి వారు ప్రదర్శించే నాటకం చూసే అవకాశం గాంధీకి దొరికింది.

సమాజం వారు ప్రదర్శించిన నాటకం పేరు "సత్యహరిశ్చంద్ర". ఇది కూడా అతని మనసు మీద శాశ్వత ముద్రలను రచించింది. హరిశ్చంద్రుడు అన్నమాట నిలబెట్టుకోవడానికి అడవులలో తిరగడం, అర్ధాంగిని వేలంపాట పెట్టడం, కొడుకును చితిలో కాల్చడం, భార్య తల నరకాలని ప్రయత్నించడం, చూచిన గాంధీకి సత్యసంధత ఎంత గొప్పదో ఆ వయసులోనే అర్థమయింది.

కలలో కూడా సత్యదర్శనమే. హరిశ్చంద్రుడు కనిపించేవాడు. అతను పడిన కష్టాలు తలచుకొని బావురుమని ఏడ్చేసేవాడు. హరిశ్చంద్రుడు, శ్రవణుడు, పురాణపురుషుల్లాగా భావించడం మానేశాడు. నిజమైన మనుషులు ఇప్పటికి ఆ కష్టాలు పడుతున్నట్లే తలపోశాడు.

ఈ కథలు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా కన్నులు చమరించడమనేది గాంధీగారికి జీవితమంతా ఉంది. అతనికి ఇటువంటి స్థితిలో చేదుమాత్రలు మింగినట్లు ఒక విషయం జరిగింది. అప్పటికి గాంధీ వయసు పదమూడు సంవత్సరాలు. తన ఈడువారంతా స్వేచ్ఛగానే ఉన్నారు. కాని అతనికి ప్రధానం జరిగిపోయింది. ఇలా అతి చిన్న వయసులో వివాహ ప్రతిపాదనలు జరగడమనేది కథియవాడ ప్రాంతంలో అతిసాధారణమైన ఆచారంగా ఉండేది.

ధనం దండిగా లేకపోయినా తప్పనిసరి అయినట్లుగా కరంచంద్ ఆడంబరం చేశాడు. పితృభక్తి కలవాడు కాబట్టి మోహన్‌దాస్ తలవంచాడు. పెండ్లి అయిన తరువాత మాత్రమే ఖర్చుని గూర్చి తండ్రిని విమర్శించాడు.

భార్యాభర్తలను ఏడడుగులు వేయించారు. గోధుమరవ్వ, పంచదార, కిస్మిస్ పళ్ళు, ఎండు ద్రాక్షలతో జావ తయారు చేయించి భార్యాభర్తల చేత త్రాగించారు. అభం శుభం తెలియని పిల్లలు మొదటి రాత్రి సంసారసాగరంలోకి అడుగుపెట్టారు. ఇవన్నీ వదినగారే గాంధీకి బోధించారు. క్రమంగా భార్యాభర్తలిద్దరూ మొగమాటం మరిచిపోయారు. ఇద్దరు సమవయస్కులే. అయినా గాంధీ భర్తగా అధికార దర్పంతో ఉండేవాడు. భార్యను కూడా ఎన్నడూ మోసగించలేదు.

సత్యము అనేదానికి నిబద్ధుడు గాంధీ. తాను ఏకపత్నీవ్రతుడుగా ఉండి భార్య పతివ్రతగా ఉండాలని కోరుకున్నాడు. అయితే మగవాడుగా, పెత్తనం చెలాయించాలనే ఆలోచన కొంత ఇబ్బంది పెట్టింది. ఆమె తనతో మాత్రమే మాట్లాడాలని కోరడంలో ఉన్న తప్పేమిటో, పెద్ద అయ్యాక గాని అర్థం కాలేదు.

భార్య మీద మెండయిన అభిమానం ఉండేది. ఒకవేళ ఎడబాటు కలిగితే తిరిగి త్వరగా కలుసుకోవాలని తహతహ ఉండేది. మోహన్‌దాస్ అర్థాంగి కస్తూరిబా చదువులేని ఆడపిల్ల. ఆమెకు రాత్రిపూట చదువు చెప్పాలని ప్రయత్నించాడు మహాత్ముడు.

ఉపాధ్యాయులను పెట్టించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఫలితంగా కస్తూరిబా విద్యాగంధము అంతంతమాత్రమే అయింది. ఆమెకు భర్త మీద వున్న ప్రీతి చదువు మీద లేదు. పెళ్ళి అయినా చదువు మామూలుగానే సాగించాడు మోహనదాస్. సౌరాష్ట్రంలో తెలివితేటలు కలిగిన విద్యార్థులకు లభించే ఉపకారవేతనం పది రూపాయలు సంపాదించాడు. బహుమతులు కూడా వస్తుండేవి. దండనబాధలు అనివార్యం. అవి ఎవరికైనా తప్పవు.

ప్రధానోపాధ్యాయుడు క్రమశిక్షణ కలిగిన ఆదర్శవాది. ఆయన చెప్పిన విధంగా గాంధీ ఆటలలో పాల్గొనలేదు. ఆ తరువాత విద్యార్థులకు వ్యాయామం ఎంత అవసరమో గ్రహించాడు. ఆటలకు వెళ్ళనందుకు శిక్ష కూడా అనుభవించాడు. వ్యాయమం అలవాటు లేదు గాని, షికారుకు వెళ్ళే అలవాటు ఉండేది.

చేతివ్రాత వంకరటింకరగా ఉండేది. అందమైన అక్షరాలు వ్రాయగలిగిన వాళ్ళను చూసి అసూయపడేవాడు. ముందు బొమ్మలు వేయడం నేర్చి, ఆ తరువాత అక్షరాలు నేర్వాలనే ఆలోచన ఆ విధంగా గాంధీగారికి కలిగింది.

గణితంలో పాఠశాల ప్రవేశం సంపాదించాడు. కృష్ణశంకర పాండ్యా అనే ఉపాధ్యాయుడు నేర్పిన సంస్కృతం, ఆ తరువాత భగవద్గీత పఠనానికి పురిగొల్పింది. ఈ దశలో ఒక మిత్రుడు కలిశాడు. అతనితో గాంధీ స్నేహం చేయడం ఇంటిలో వారెవ్వరికీ నచ్చలేదు. స్నేహం అనగానే ప్రాణం అర్పించేవాడు గాంధీ. అతడే మిత్రుని చేత మాంసం తినిపించాలని ప్రయత్నించాడు. మాంసాహారం బలాన్ని ఇస్తుందని, జబ్బులు రావని, గాంధీలాంటి బక్కపలచని మనుషులు బలవంతులుగా మారిపోతారని నమ్మించాడు. బాగా ప్రోత్సహించాడు.

మోహన్‌దాస్‌కు దొంగలభయం ఎక్కువ. చీకటిలో దయ్యాలు వచ్చి మింగేస్తాయని బిక్కుబిక్కుమంటూ ఉండే తత్త్వం. ఇక విషజంతువుల మాట సరేసరి. గదిలో

నిదురించాలన్నా తోడుగా భార్య వున్నా, దీపం వెలుగుతూ ఉండాల్సిందే. ఈ పిరికితనాన్నే మిత్రుడు ఎగతాళి చేసేవాడు. నాలాగా ధైర్యవంతుడివి కావాలంటే మాంసాహారాన్ని తినాల్సిందే అని తీర్మానించాడు.

వైష్ణవ సాంప్రదాయంలో పుట్టి పెరిగాడు గాంధీ. తల్లిదండ్రులు పరమ వైష్ణవులు. ప్రతిదినము ఆలయంలో స్వామిదర్శనం చేసే అలవాటు కలిగిన కుటుంబం. గాంధీ తల్లి దండ్రుల మీద ప్రత్యేకమైన భక్తిభావం కలవాడు. మిత్రుని మాటల ప్రభావంతో బలము, ధైర్యము వస్తాయనే దురూహతో మాంసం తినేందుకు ఒప్పుకున్నాడు.

తెల్లవాళ్ళను తరిమికొట్టే ధైర్యాని పొందగలుగుతాను అనే అపోహతో ఒకరోజు రహస్యంగా మాంసపు ముక్కను రొట్టెతో రుచి చూశాడు. తోలు నములుతున్న అనుభవం కలిగింది. గొంతు దాటకుండానే కక్కు వచ్చింది.

ఆ రాత్రి నిద్రపోతున్నప్పుడు కడుపులో మేక అరచినట్లుగా అనుభూతి కలిగింది. మొత్తంమీద పట్టు వదలని విక్రమార్కుడల్లే మిత్రుడు మోహనదాస్ చేత ఆరుసార్లు మాంసం తినిపించాడు.

ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే ఎంతగా క్రుంగిపోతారో తలచుకుని అతనికి నిద్రపట్టడం మానేసింది. బాగా దిగులుపడ్డాడు. ఈ కథ ఇట్లా నడుస్తుండగానే అతడు మరో తప్పిదానికి దారి తీయించాడు.

ఒకనాడు తనే డబ్బు కట్టి ఒక వేశ్య ఇంటికి తీసుకుపోయాడు. చీకటి గదిలో నిశ్చేష్టుడై కూర్చున్న మోహన్‌దాస్‌ను భగవంతుడే రక్షించాడు. పతనం కాకుండా అనుగ్రహించాడు. ఈ స్థితిలో ఉన్న అతనిని ఆ వేశ్య చివాట్లు పెట్టి పంపించివేసింది.

ఇంత జరిగినా మోహన్‌దాస్‌కు కనువిప్పు కలుగలేదు. అతనిని మిత్రుడు చెడగొట్టేస్తున్నాడని ఇంటిలో అందరూ కనిపెట్టేశారు. కస్తూరిబా కూడా అతనిని అధిక్షేపించింది. సహధర్మచారిణి ఏ విధంగా భర్తపట్ల, అతని చర్యల పట్ల తన నిరసనను వ్యక్తం చేయాలో అలానే చేసింది. ఆమె భోజనం తినకుండా మానివేయడం ద్వారా తన అయిష్టాన్ని తెలియపరచింది.

ఈ సంఘటన జరిగాక మోహనదాస్ కళ్ళు తెరుచుకున్నాయి. తల్లిదండ్రులను వదలి తనవాడుగా నమ్మి భర్త ఇంటికి వచ్చిన స్త్రీని అక్రమ ప్రవర్తన ద్వారా శిక్షించడం తప్పని బాధపడినాడు. ఇష్టాలను ఏ విధంగా భార్యాభర్తలు చెప్పుకుంటారో, అయిష్టాలను కూడా అలాగే చెప్పుకోగల స్వేచ్ఛ స్త్రీలకు కలిగించాలని అతనికి అనిపించింది.

ఆమె ఆనాడు ప్రదర్శించిన నిరసన వ్రతదీక్ష, ఆ తరువాత గాంధీ మహాత్ముని జీవితంలోనే కాక యావద్భారతావనికి స్ఫూర్తినిచ్చింది.

ఇలాంటి మిత్రుడే ఒకసారి పొగ త్రాగమని ఉసికొల్పాడు. కొంతకాలం దేశవాళి సిగరెట్లు కొని త్రాగారు అందుకోసం నౌకరు వద్ద డబ్బులు దొంగిలించాడు మోహన్‌దాస్. ఈ విషయంలో వెంటనే పశ్చాత్తాపపడి తప్పు ఒప్పుకుని శిక్షించమని తండ్రిని ప్రార్థించాడు. నేరుగా చెప్పే ధైర్యంలేక ఒక చీటీ వ్రాసి తండ్రికి అందించాడు. తండ్రి దాన్ని చదివి కన్నీరు పెట్టుకున్న తరువాత, అది చూచి మోహన్‌దాస్ పరిపూర్ణ పశ్చాత్తాపాన్ని పొందాడు.

అహింసను పాటించాలి. దాని శక్తి అమోఘం. పొగ త్రాగరాదు. నైతిక నియమాలు గల జీవితం మనిషికి చాలా విలువ నిస్తుంది అని గ్రహించాడు.

రాచకురుపుతో మంచమెక్కిన తండ్రికి ఎన్నో సపర్యలు చేశాడు మోహన్‌దాస్. శస్త్రచికిత్స చేయించాలనే ప్రయత్నంలో ఉండగా బొంబాయి వెళ్ళకుండానే ఆయన అంతిమ ఘడియలు సమీపించాయి. 'ఇక ఏర్పాట్లు చేయండి' అని కాగితం మీద వ్రాసి కబాగాంధీ కన్ను మూశారు.

గాంధీకి పుట్టిన బిడ్డ చనిపోవడంతో తాను గతంలో చేసిన తప్పులకు శిక్షపడినట్లే భావించుకున్నాడు. రాజకోటలో మత సాంప్రదాయాలు కలసికట్టుగానే నెరవేర్చుకుంటు న్నారు. రాజకోట నుంచి అహమ్మదాబాదు వెళ్ళి 1887లో మోహన్‌దాస్ మెట్రిక్యులేషన్ పరీక్షలు వ్రాసి ఫలితం సాధించాడు.

భావనగర్‌లో ఖర్చులు తక్కువగా ఉంటాయని 'శ్యామల దాస్' కాలేజిలో చేరాడు. అక్కడ విద్యాబోధన చాలా కష్టతరమైన పద్ధతులలో జరుగుతుండేది. అయిష్టంగానే చదవు కొనసాగించి ఆరునెలల తరువాత రాజకోట వచ్చాడు మోహన్‌దాస్.

ఆ కుటుంబానికి తండ్రి కాలం నుంచి మిత్రుడైన 'దూబే'గారు పలకరించేందుకు వచ్చారు. అప్పటికి అన్నగారి పెత్తనంలో కుటుంబ ఆర్థిక పరిస్థితులు చిక్కుపడి ఉన్నాయి.

"మీ నాన్నగారిలాగా దివాన్ పదవి సంపాదించాలంటే కనీసం డిగ్రీ పూర్తి చేయాలి. అందుకు ఇంకా నాలుగు సంవత్సరాల కాలం పడుతుంది. అప్పుడైనా మీ నాన్నగారికిచ్చిన దివాను పదవి నీకిస్తారనే నమ్మకంలేదు. కొద్దిపాటి వేతనం మీద మరో ఉద్యోగంలో చేరమనవచ్చు. దివాన్‌గిరియే కావాలంటే తప్పనిసరిగా 'లా' చదవాలి. నువ్వు లాయర్ అయ్యే నాటికి చాలా కాలం పడుతుంది. ఖర్చుకూడా అధికంగానే అవుతుంది" అంటూ దూబేగారు ఒక సమస్యను లేవనెత్తారు.

"ఈ కుర్రవాడు చదివి వచ్చేనాటికి దివాన్ పదవికోసం, చాలామంది పోటీ పడుతుంటారు. అంతకన్నా ఇంగ్లాండు వెళ్ళి బారిష్టరు కావడం తేలిక" అని కూడా 'దూబే'గారు ప్రతిపాదించారు.

ఇంతసేపు మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ ఏమీ మాట్లాడలేదు. ఆయన మరొక మాట జతపరిచాడు. "ఈ బక్కపలచని కుర్రాడు భావనగర్ కాలేజీ ఉపాధ్యాయుల కఠిన శిక్షణకు తట్టుకోలేడు".

దూబేగారు ఎప్పుడైతే ఈ మాట అన్నారో వెంటనే మోహన్‌దాస్ ప్రతిస్పందించాడు.

"వీలైనంత త్వరగా నన్ను ఇంగ్లాండు పంపండి" అని కోరాడు. "నేను న్యాయ శాస్త్రాన్ని చదవలేను. వైద్యశాస్త్రం చదువుతాను" అని కూడా అన్నాడు.

వైద్యం చదివినందువల్ల దివానుల పదవి దక్కదని అక్కడ కూర్చున్న పెద్దలు నిర్ణయించారు. అందువల్ల మోహన్‌దాస్ ఇంగ్లాండు వెళ్ళి బారిష్టరు చదవడమే మంచిదని తీర్మానించారు.

ఈ విషయమై పోరుబందరు వెళ్లి పినతండ్రితో సంప్రదించి వారి ఆశీస్సులు తీసుకొని రమ్మని మోహన్‌దాస్ తల్లి పుతలీబాయి ప్రతిపాదించింది.

మోహన్‌దాస్‌కు విదేశాలు వెళ్ళాలనే పట్టుదల ఎక్కువ అయింది. తల్లిని ఒప్పించే ప్రయత్నంచేశాడు. భార్యనగలు అమ్మయినా సరే లండన్ వెళ్ళి చదవాలి. అక్కడ మాంసము, మద్యము తీసుకుంటారు. సదాచార వైష్ణవ కుటుంబం. సాటివారిలో భ్రష్టాచార కుటుంబం అని పేరుపడుతుంది. కొన్ని తరాలుగా దివాన్‌గిరీ చేస్తూ తెచ్చుకున్న మంచి పేరు మంటకలుస్తుంది అని గాంధి కుటుంబంలోని వారంతా ఆలోచనలో పడిపోయారు. తల్లి పుతలీబాయికి ఒక జైనగురువు ఉపదేశాలు చేస్తూ ఉండేవాడు. ఆయన బేచర్జీస్వామి. సాటికులస్తుడే! జైన సాధువు అయ్యాడు.

విదేశాలకు వెడితే కులాచారాలు మంటకలుస్తాయి, వెలివేస్తారు అని భయ పడిందామె. "నన్ను నమ్మలేవా! అవేవీ నేను ముట్టను, కావాలంటే ప్రమాణం చేస్తాను. అమ్మా! నీతో అబద్ధం చెప్పనుకదా!" అంటూ తల్లిని ఒప్పంచాలని ప్రయత్నించాడు. "నాయనా! నీ మీద నాకు పూర్తిగా నమ్మకం ఉన్నది. కాని దేశంకాని దేశంలో పరిస్థితులు ఎలా ఉంటాయో అని భయపడుతున్నాను" అంది పుతలీబాయి. చివరకు వారిద్దరూ ఆమె గురువుగారైన జైన సాధువు చెప్పినట్లుగా వినాలని నిర్ణయించుకున్నారు.

మోహన్‌దాస్‌చేత మద్యమాంసాలు ముట్టను అని ప్రమాణం చేయించి విదేశాలకు పంపవచ్చును అని ఆయన సలహా ఇచ్చాడు. అన్నగారు డబ్బు సమకూర్చేందుకు

ఒప్పుకున్నారు. ఎలాగైతేనేం గాంధీని విదేశాలకు పంపాలన్న వాదన నెగ్గింది. ప్రయాణ సన్నాహం మొదలయింది.

మద్యం, మాంసము, మహిళ ముట్టనని జైన్ సాధువు 'మోడ్' గారి సమక్షంలో ప్రమాణంచేసి పాఠశాలలో వీడ్కోలు పుచ్చుకున్నాడు. చిన్నవయసులో ఉన్న మోహన్‌దాస్ విదేశ ప్రయాణం చేయడమనేది రాజకోటలో సంచలనాత్మకమైన వార్త. వీడ్కోలు సభలో నాలుగు మాటలు మాట్లాడడం పూర్తిగా చేసేసరికి గాంధీకికి ముచ్చెమటలు పోశాయి. వీడ్కోలు సభలో సమాధానం పూర్తి అయ్యేసరికి శరీరం వణికింది. పెద్దలందరు దీవించగా బొంబాయికి బయలుదేరాడు.

ఎంతో ప్రేమించిన తల్లి పుతలీబాయిని, అనురాగం వర్షించిన అర్ధాంగి కస్తూరిబాని, పసివాడిని వదలిపెట్టి వెళుతున్నా ఉత్సాహంగానే అనిపించింది. ప్రక్కన తోడుగా అన్నగారు ఉన్నారు. జూన్, జులై నెలల్లో హిందూమహాసముద్రంలో ఉప్పెనలు వస్తుంటాయి. ఓడలు మునిగిపోతుంటాయి. తుఫానువల్ల ఈ మధ్యకాలంలో స్టీమర్ ఒకటి మునిగి పోయిందని చెప్పి అన్నగారిని స్నేహితులు కలవరపెట్టారు.

బొంబాయిలో మోహన్‌దాస్ కొంతకాలం ఆగవల్సి వచ్చింది. ఇదిలా ఉండగా 'మోడ్' వంశీకులైన వైశ్యులు గాంధీని కులం నుంచి వెలివేస్తామని బెదిరించడం మొదలుపెట్టారు. తండ్రి స్నేహితుడైన పెద్దాయన విదేశాలలో అనాచారం గురించి బాగా భయపెట్టాడు.

"అమ్మకిచ్చిన వాగ్దానమే నాకు రక్ష" అని మంకుపట్టు పట్టాడు మోహన్‌దాస్. కులం పెద్దలు విధించిన నిషేధాన్ని అమలుపరచినందుకు మోహన్‌దాస్‌ను కులంనుంచి వెలివేశారు. అతనిని సాగనంపేందుకు హార్బరుకు ఎవరైనా వెళితే రూపాయి పావలా జరిమానా కట్టి ఒక సాలిగ్రామాన్ని దానం ఇచ్చి ఆ పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలని కూడా ప్రకటించారు. ఈ వత్తిడుల వల్ల అన్నగారి మనసు మారుతుందేమోనని గాంధీ భయపడ్డాడు.

ఈ సమయంలోనే 'జునాగడ్' వకీలుగారు ఒకాయన సహాయం చేశాడు. అన్నగారు ఇచ్చివెళ్ళిన డబ్బు కులంనుంచి వెలి కారణంగా చేతికి అందలేదు. వకీలుగారే అతనిని ప్రోత్సహించి ఓడ టిక్కెట్టు ఏర్పాటు చేయించాడు. విదేశాలకు వెళ్ళే దుస్తులు తయారయి నాయి. నెక్ టై ధరించడం మోహన్‌దాస్‌కు ఇబ్బందిగా ఉంది. పొట్టి చొక్కా వేసుకోవడానికి సిగ్గుగా ఉంది. విదేశయానం చేయాలనే ఉత్సాహం ముందు ఈ ఇబ్బందులన్నీ అధిగమించ దగినవిగానే భావించాడు. ఏర్పాట్లు పూర్తయినాయి. 'జునాగ వకీలుగారి పేరు త్రయంబకరావ్ మజుందార్. ఆయన కాబిన్‌లోనే గాంధీకి ఒక బెర్త్ లభించింది. అప్పటికి

మోహన్‌దాస్ వయసు పద్దెనిమిది సంవత్సరాలే. 1888 సెప్టెంబర్ 4వ తేదీ ప్రయాణం ప్రారంభమైనది. చదువుమీద ఉత్సాహం వల్లనో ఏమోకాని సముద్ర యానం క్రొత్తగా చేసేవారికి కలిగే అనారోగ్యం గాంధీకి కలుగలేదు.

ఆ మనుషుల మధ్య అంతా కొత్తగా అనిపించింది. ముజుందార్ తప్ప సెలూన్‌లోని మిగిలిన వారందరూ ఇంగ్లీషువారు. ఆంగ్ల భాష మాట్లాడడం ధారాళంగా రాదు. మాటలు కూడబలుక్కుంటూ ఒంటరిగా పండ్లు, చిరుతిళ్ళు తింటూ ఓడ ప్రయాణం సాగించాడు.

మోహన్‌దాస్ ఓడలోని వారందరితో కలిసి కూర్చుని ఒక్కసారి కూడా భోజనం చేయలేదు. అంతా రహస్యంగా ఆచారబద్ధంగా చేసుకుంటూ ఉండేవాడు.

ప్రయాణాలలో రోజులు గడుస్తున్న కొద్దీ మోహన్‌దాస్ చుట్టూవున్న మనుషుల వల్ల తన ప్రపంచం మారిపోతున్నట్లు గుర్తించాడు. రాజకోట, పోరుబందరు సరిహద్దులను మానసికంగా కూడా దాటేస్తున్నాడు. ఎన్నడూ వీడని సిగ్గు, సంకోచం, భయం వలన ఒంటరిగా కాలక్షేపం చేస్తున్నా, మనోమయ ప్రపంచం మారుతోంది. అందరూ స్టీమరులో సందడిగా తిరుగుతుంటే తను మాత్రం ఒంటరిగా సెలూన్‌లో కూర్చుని ఏదో ఆలోచిస్తుండేవాడు.

రోజులు గడుస్తున్నాయి. ఓడ ముందుకు సాగుతోంది.

# 2. విదేశీ విద్య

మోహన్‌దాస్ ఎవరితోను కలివిడిగా ఉండకపోయినా, వాళ్ళే వచ్చి పలకరించి పరిచయాలు పెంచుకుంటున్నారు. బిడియం వల్ల బిగిసిపోతున్నా సిగ్గుపడవద్దని చెప్పి హెచ్చరిస్తున్నారు. ఒక మిత్రుడు ఎక్కువగా మాట్లాడలేని వారు లాయర్లు కాలేరని హెచ్చరించాడు. ఈ మాటవిన్న తరువాత బిడియం విడిచి గల గలా మాట్లాడడం అలవాటు చేసుకోవాలని భావించాడు మోహన్‌దాస్.

ఇంగ్లీషు పదాలు వేగంగా దొర్లడం లేదు. పది మాట్లాడాలన్నా ముందుగా మనసులో పదాలను కూడదీసుకోవాల్సి వచ్చేది. తప్పు మాట్లాడితే కొంపలేమీ అంటుకోవని దడ దడ మాట్లాడేయడం వలన అనర్గళంగా ఇంగ్లీషు మాట్లాడే అలవాటు పెరుగుతుందని ఒక మిత్రుడు బోధించాడు. కావాలని మాటల్లోకి దింపి అలవాటు చేశాడు. ముందు చిన్న చిన్న వాక్యాలు నేర్పించాడు.

ఆ ఆంగ్లేయ మిత్రుడే ఒక విధంగా గురువు అనుకోవాలి. మాంసం తినకూడదను కున్న గాంధీ పట్టుదల అతనికి విచిత్రంగా అనిపించేది. శాఖాహారం అలవాటు మార్చు కోమని చెప్పాడు కాని, ఈ విషయంలో మిత్రుడిమాటను తిరస్కరించాడు మోహన్‌దాస్. అతని సలహాలకు ధన్యవాదాలు చెప్పాడు. మాంసం తినకుండా బ్రతికే అవకాశం లేకపోతే చదువు మానేస్తానని కూడా ధృవపరిచాడు.

ఓడ ఎర్రసముద్రం నుంచి 'డిస్కే' సముద్రంలోకి ప్రవేశించింది. అక్కడ మద్య, మాంసాలు ఆచారం తక్కువగా ఉంది. శాఖాహారిగా ఒక ధృవపత్రం సంపాదించి ప్రయాణం ముగించి వారు సౌతాంప్టన్ చేరారు. తెల్లసూటు ధరించాడు మోహన్‌దాస్. "గ్రిండ్లే" కంపెనీ వారికి సామాను అప్పగించి ఓడ దిగాడు మోహన్‌దాస్.

తెలిసినవారు ఇంగ్లాండ్‌లో ఉన్న పెద్దలకు వ్రాసిచ్చిన సిఫారసు పత్రాలు దగ్గరే ఉన్నాయి. తెల్లసూటు ఇబ్బందికరంగానే ఉంది. మరునాడు ఆదివారం కావడం వలన

'గ్రిండ్లే' కంపెనీ నుంచి సామాను రాలేదు. అక్కడ గాంధీని కలిసిన మొదటి వ్యక్తి మోహతాగారు. ఆయన ధరించిన టోపీ అద్భుతంగా అనిపించింది. అడగకుండా చేతిలోకి తీసుకుని వేళ్ళతో నిమిరి దాన్ని పరిశీలిస్తున్న మోహన్‌దాస్‌ను చివాట్లు పెట్టి దులిపేశాడాయన. ఇంగ్లాండులో మసలుకోవలసిన తీరుతెన్నులు వివరించాడు.

అనుమతి లేకుండా ఇతరుల వస్తువులను తాకరాదనే సత్యాన్ని గ్రహించాడు మోహన్‌దాస్. 'సర్' అనే పదాన్ని కూడా భారతదేశంలో లాగ వాడకూడదు. అలా వాడితే యజమాని నౌకర్ని చూసినట్లు చూస్తారు.

హోటల్ ఖర్చులు పేదవారు భరించగలిగేవి కాదు. హోటల్ జోలికి వెళ్ళకుండానే బొంబాయి నుంచి తెచ్చుకున్న తినుబండారాలతో సర్దుకోవలసి వచ్చింది. డబ్బు అంతంత మాత్రం. శాఖాహారమే తీసుకోవాలి. మాంసాహారం ముట్టకూడదు. మోహన్‌దాస్ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిగా తయారయింది. ఈ స్థితిలో అతడు మొట్టమొదటి సారి అంతర్వాణిని ఆశ్రయించాడు. అంతరాత్మ ప్రబోధం ప్రకారం విద్య పూర్తి అయ్యేంత వరకు అక్కడే ఉండాలని తీర్మానించుకున్నాడు.

విక్టోరియా హోటల్లో తామర వదిలించుకోవడానికి ఉప్పునీళ్ళ స్నానం సబ్బు లేకుండా చేస్తే చాలదు. మోహతాగారు ఇచ్చిన యాసిడ్‌తో ఆ బాధ వదిలించుకున్నాడు.

ఇక్కడి పరిస్థితులు అర్థం చేసుకునేందుకు ఒక కుటుంబంతో కలిసి ఉండమని సలహా ఇచ్చాడు. తనే ఒకర్ని పరిచయం కూడా చేశాడు. ఇతరులతో కలిసి ఉండటమంటే మసాలా, మాంసాహారం లేని తిండి దొరకడం సమస్యగా మారింది. కేవలం రెండు రొట్టె ముక్కలతో సర్దుకోవాల్సి వచ్చింది. ఆ ఇంటివారు శాఖాహారిగా ఉన్నందుకు చివాట్లు పెట్టినా పట్టుదల విడిచిపెట్టలేదు.

కాని వారు హితైషులని మేలుకోరి పదే పదే చెబుతున్నారనే విషయం గ్రహించాడు. ప్రతిజ్ఞ విడిచి పెట్టలేదు కాని, వారి ప్రేమను గుర్తించాడు. విసిగిపోయి వారే పట్టుదలను విడిచిపెట్టారు. మద్యం, మాంసం తినమని బలవంతపెట్టడం మానేశారు. కాని ఒక ఆంగ్లో ఇండియన్ కుటుంబంతో కలిసి ఉండే ఏర్పాటు చేశారు. ఆ ఇంటి ఇల్లాలు, ఆచారవంతుడు, బిడియస్తుడు అయిన మోహన్‌దాస్‌ను బాగా చూస్తానని శుక్లాగార్కి, మెహతాగార్కి వాగ్దానం చేసింది. ముందుగానే మద్యం, మాంసం, మగువ అనే అంశాలమీద తాను చేసిన ప్రమాణాన్ని ఆమెకు తెలియపరిచాడు గాంధీ. ఆ వితంతువు వడ్డించే తినుబండారాలు వింతగా అనిపించేవి, గొంతు దిగేవికావు. కటిక ఉపవాసాలను ఆశ్రయించాల్సి వచ్చింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారు పెట్టే రొట్టెముక్కలతో కొంతకాలానికి నిలకడ దొరికింది.

చదువు ప్రారంభించలేదు కాని పత్రికలు చదవడం మొదలైంది. పాల్‌మాల్ గెజిల్, 'డైలీ న్యూస్, డైలీ టెలిగ్రాఫ్ ఆసాంతం చదవడానికి ఒక గంట సమయం పట్టేది. మాంసం లేని హోటళ్ళ కోసం పది, పన్నెండు మైళ్ళు తిరిగి ఒక చౌక దుకాణం పట్టుకున్నాడు.

ఫారింగ్‌డన్ బజారులో ఒక స్టాల్ కనిపెట్టి, పసిపిల్లవాడిలా కేరింతలు కొట్టాడు. మొట్టమొదటిసారి ఇంగ్లాండ్‌లో కడుపునిండా భోజనం చేశాడు. దేవుడే ఆకలి తీర్చాడని సంతోషపడి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. అక్కడే శాకాహారం ప్రాధాన్యతను వివరించే ఒక పుస్తకం సంపాదించాడు. దాని ఖరీదు ఒక షిల్లింగ్. దానిని చదివిన తర్వాత పైథాగరస్, జీసస్‌లాంటి ప్రబోధకులు శాకాహారమే తినేవారని తెలుసుకున్నాడు.

మాంసాహారాన్ని ముట్టకపోవడమనేది ఆరోగ్యానికి ఎంతో మేలు అని గుర్తించి, ఆ అభిప్రాయం మీదే జీవితాంతం స్థిరపడిపోయాడు.

పుస్తకాలు చదవడం బాగా అలవాటయింది. శాకాహార సంఘాలతో పరిచయాలు కూడా జరిగాయి. భాషతో పాటు వేషం కూడా మారింది. ఆర్మీ అండ్ నేవీ స్టోర్సులో ఆంగ్లేయ దుస్తులు తయారయ్యాయి టై కట్టుకోవడం, బంగారు గొలుసు వేలాడు తీసుకోవడం, కరుకు వెంట్రుకల్ని క్రాఫ్ దువ్వి టోపీ ధరించడం అలవాటయింది. వారితో బాగా కలిసిపోవడానికి ఉపన్యాసాలు చెప్పడం, ఫిడేలు వాయించడం నేర్చుకున్నాడు.

ఆలోచనలు, డాన్స్ నేర్చుకోవాలనేంతవరకు వచ్చాయి. వీటి అన్నింటి వల్ల పటాటోపం పెరిగింది. మూడు నెలల తరువాత విద్యార్థి కర్తవ్యాన్ని స్మరించి మిగిలినవన్నీ వదిలిపెట్టేశాడు. కుటుంబాలతో కలసి కాకుండా స్వయంగా గది అద్దెకు తీసుకుని ఉండగల పరిస్థితి వచ్చేసింది. ఖర్చులు తగ్గించుకునేందుకు వేరేగది తీసుకున్నాడు. కాలినడక పెంచడం ద్వారా ఆదాయం, ఆరోగ్యం పెరిగాయి. లాటిన్‌లో డిగ్రీకోసం చదువు మొదలు పెట్టాడు. కానీ ఆ పరీక్షపోయింది. రెండో పర్యాయం పరీక్ష పాసయ్యాడు. సాదాసీదా జీవితం వల్ల ఆత్మ సంతృప్తి కలిగింది.

1888 నవంబరులో ఇన్నర్ టెంపుల్‌లో 'లా' అధ్యయనం ప్రారంభించి కఠోర పరిశ్రమ చేశాడు. మిగిలిన విద్యార్థులవలె ప్రశ్నా పత్రాలకు సంబంధించిన సమాచారం మాత్రమే కాకుండా, విషయాన్ని ఆసాంతం చదివి అర్థం చేసుకుని న్యాయ శాస్త్రంలో మంచిపట్టు సంపాదించాడు.

1891లో బార్ సభ్యత్వం దొరికింది. ఈ సమయంలోనే ద్వేషాన్ని ప్రేమతో జయించడం తెలిసింది. అప్పుడు ఆంగ్లదేశంలో హిందూ విద్యార్థుల సంఖ్య చాలా తక్కువ. వివాహితులైన విద్యార్థులు కూడా అక్కడ బ్రహ్మచారులమని చెప్పుకునే వారు.

ఇంగ్లాండులో బాల్య వివాహాల గురించి వారికేమీ తెలియదు. పెళ్ళి అయిన వారు కన్యలతో కలసి మెలసి తిరుగకూడదు. గాంధీకి పెండ్లి అయింది. పిల్లలున్నారు. అయినా ఇంగ్లాండులో బ్రహ్మచారిగానే ఉండాల్సి వచ్చింది. నటన నిండిన ఈ పరిస్థితులు అతనికి సంతోషాన్ని కలిగించలేదు. సిగ్గరిగా, బిడియస్తుడుగా, బిగుసుకు కూర్చుంటే ఏ యువతి పలకరిస్తుంది? ఇంటి యజమాని కూతురు ఒకసారి దగ్గరలో ఉన్న కొండమీదకు షికారు తీసుకు వెళ్ళింది.

ఆమె ఎత్తు మడమల బూట్లతోనే వడివడిగా అతనికన్నా ముందు దిగేసింది. క్రమంగా ఇంగ్లాండులో అనుభవాలు పెరుగుతున్నాయి. పరిచయాలు కూడ పెరిగాయి.

తన ఆలోచనలే తనవి తప్ప ఇతరుల గురించి ఆలోచించటానికి మోహన్‌దాస్ ఇంకా అలవాటు పడలేదు.

అసత్యానికి సరయిన శిక్ష నిజం చెప్పేయటమే! పాపానికి పరిష్కారం పదిమంది ముందు ఒప్పుకొనటమే! ఈ భావాలు అతనిలో ఆనాడు స్థిరపడ్డాయి.

ఆ తరువాతి కాలంలో సత్యసంశోధకుడు కావటానికి బాగా ఉపకరించాయి. నైతిక విలువలు కలిగిన జీవితం మనిషికి సాఫల్యం కలిగిస్తుందని గ్రహించాడు. మోహన్‌దాస్ కరంచంద్ గాంధీలోంచి ఒక మహాత్ముడు రూపుదిద్దుకోవడం ప్రారంభమయిన రోజులు అవి. మిత్రులతో మాత్రమే కాకుండా గాంధీకి మతాలతో పరిచయం కావటం ప్రారంభ మయింది. ఇంగ్లాండులో చదువు కొనసాగిస్తున్న రెండవ సంవత్సరంలో దివ్యజ్ఞాన సమాజంతో పరిచయం ఏర్పడింది. భగవద్గీతని చదవమని వారు సలహాయిచ్చారు.

కాని సంస్కృతంలో భగవద్గీత దొరకలేదు. ఆంగ్లంలో ఒక ప్రతిని సంపాదించాడు గాంధీ.

సర్ ఎడ్విన్ ఆర్నాల్డు అనే పండితుడు వ్రాసిన ప్రతి ముందుగా చదవడం జరిగింది. అతనికి అప్పటికి సంస్కృతం రాదు. సంస్కృతంలో చదవలేకపోవడం సిగ్గుపడాల్సిన విషయంగా అనిపించింది. అయితే ఈ విషయాన్ని దాచిపెట్టకుండా మిత్రులతో చెప్పాడు. వారితో కలిసి గీత చదవడం ప్రారంభించాడు.

గాంధీ మొత్తం ఆలోచనా ప్రపంచం మీద గీత ప్రభావం అత్యధికం "సంస్కృత భాష చదవటం రాకపోతే ఈ రోజే ప్రారంభించండి. ఒకే ఒక్క గీతా గ్రంథం చదివి అర్థం చేసుకొనడానికైనా సంస్కృతం నేర్చుకుని తీరాలి! భగవద్గీత చదవకపోతే వెంటనే ఒక సొంతకాపీ కొని చదవటం ప్రారంభించండి! గీతలో వివరించిన నైతిక నియమాలు ప్రపంచంలో ఎక్కడా లేవు" అని చెప్పారు గాంధీ తరువాత కాలంలో.....

అంతగా గీతను ఆరాధించడానికి ఆ మొదటిసారి చదివినప్పుడే పునాదులు ఏర్పడినాయి. సాంఖ్యయోగంలో అంటే రెండవ అధ్యాయంలోని అరవైరెండు, అరవైమూడు శ్లోకాలు అతనికి బాగా నచ్చాయి. వాటి అర్థం అతని ఆలోచనా ప్రపంచాన్ని ప్రభావితం చేసింది. "గాంధీ" మహాత్ముడు కావటానికి, నైతికత వికసించటానికి పునాదిగా నిలిచిన శ్లోకాలు ఇవి.

**రెండవ అధ్యాయం : సాంఖ్య యోగం : 62వ శ్లోకం :**

**శ్లో ॥ ధ్యాయతో విషయం కపుంసః। సంగస్తే ఘూ పజాయతే ॥**
**సంగాత్సంతే జాయతే కామః। కామాత్ కోధ్రోపి జాయతే ॥**

**రెండవ అధ్యాయం : సాంఖ్యయోగం : 63వ శ్లోకం.**

**శ్లో ॥ కోధ్రాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః ॥**
**స్మృతి భ్రంశాత్ బుద్ధినాశో ! బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥**

ఈ శ్లోకాలకు అర్థం అంటే అది జీవిత పరమార్థమే అని గ్రహించాడు మోహన్‌దాస్.

ఈ శ్లోకాలకు అర్థం మనం కూడా తెలిసికోవాలి. మనిషి ఆలోచనా ప్రపంచం ఏదో ఒక అంశాన్ని తర్కించడమనేది చాలా సహజమైన విషయం. అలా ఒక అంశం మీద మనిషికి మనసు లగ్నం కావాలి. అంటే ఏకాగ్రత కావాలి. ప్రపంచ విషయాలను మననం చేస్తూ ఉన్నప్పుడు మనిషికి ఆ విషయాల మీద ఆకర్షణ కలగడం సహజం. దీనినే "సంగం" అని పిలుస్తారు. ఈ ఆకర్షణ నుండే కామనలు అనగా కోరికలు పుట్టుకొస్తాయి.

కోరికలు తీరినా, తీరకపోయినా వాటికి పర్యవసానము కోపమే. కోపంలో నుండి మనిషిని అవివేకము అనేది ఆవహిస్తుంది. అవివేకం వలన మతిభ్రమణ కలుగుతుంది. క్రమంగా మనిషికి విచక్షణా జ్ఞానం నశిస్తుంది. అంటే బుద్ధిహీనుడు అవుతాడన్నమాట. బుద్ధి అనేది నశించిన తరువాత మనిషికి మిగిలేదేమి ఉండదు. అన్ని విధాల నశింపు జరుగుతుంది.

అమూల్యమైన అర్థం కలిగిన ఈ శ్లోకాలు రెండూ గాంధీ మనసుని పెద్దయెత్తున ఆకర్షించాయి. ఇలాంటివే మరెన్నో అద్భుత విషయాలను చెప్పిన భగవద్గీత అతనిని అమితంగా ఆకట్టుకుంది.

భగవద్గీతకు పరమ విశ్వాసిగా మారిపోయాడు. దానితో సమానమైన జ్ఞానం కలిగించే గ్రంథాలు ప్రపంచంలో ఎక్కడా లేవని తీర్మానించుకున్నాడు. మొత్తం భగవద్గీతకు

ఆర్నాల్డ్‌గారి అనువాదాలను ఏకబిగిన చదివేశాడు. అకుంఠితమైన విశ్వాసంతో మహాత్ముడైన తరువాత కూడా దానిపట్ల గాఢమైన నమ్మకం కలిగి ఉండేవాడు. ఆయన జీవితంలో ఈ సంఘటన జరిగిన తరువాత ఆమరణాంతము గీత చదవని రోజు ఒక్కటి కూడా లేదు.

ఇందుకు విరుద్ధమైన బౌద్ధమత సాంప్రదాయాలను ఆలోచనారీతులను అర్థం చేసుకున్నాడు. రెండు విభిన్న ఆలోచనా రీతులను వేటికవిగానే అర్థం చేసుకున్నాడు. ఈ సమయంలోనే అనిబిసెంట్ సతీమణిగారితో పరిచయమైంది. దివ్యజ్ఞాన సమాజంలో చేరమని ఆమె గాంధీని ఆహ్వానించింది.

నా మతం గురించి నాకు తెలియకుండా ఇతరుల మతంలో చేరటం ఎలా? అని ఆమె ఆహ్వానాన్ని మృదువుగా తిరస్కరించాడు.

హిందూ మతం మీద అచంచలమైన నమ్మకం కుదిరింది. ఆ మతంలోని మూఢ నమ్మకాల మీద తిరస్కార భావం కూడా కలిగింది. మాంచెష్టర్‌లో ఉండగా ఒక క్రైస్తవ గురువుతో మోహన్‌దాస్‌కు పరిచయం ఏర్పడింది. బైబిలు గురించి, క్రిస్టియన్ల నమ్మకాల గురించి ఆయన చర్చించేవాడు. రాజకోటలో క్రైస్తవ పాదచారుల బోధనలను ఇంతకు పూర్వమే విని ఉన్నాడు గాంధీ. ఆ మాటలు మాంచెష్టర్ క్రైస్తవుని మాటలతో సరిపోలవు.

ఆ మతగురువు తాను శాఖాహారినని, మద్యము త్రాగనని – అలా చేయమని బైబిలు చెప్పలేదని వివరించాడు. ఒకవేళ అటువంటి పనులు ఎవరైనా చేస్తే మతరీత్యా దీనిని సమర్థించేందుకు వీలుకాదని వివరించాడు. ఒక బైబిలు గ్రంథాన్ని గాంధీకి బహూకరించాడు. అది ఓల్డ్ టెస్ట్‌మెంట్ పాతనిబంధన గ్రంథము. సృష్టి వికాసం గురించిన అధ్యాయాలు విసుగ్గా అనిపించాయి. సంఖ్యలు చెప్పే విభాగంలో వివరాలు చదువుతూ ఉంటే గాంధీగారికి నిద్రముంచు కొచ్చేసింది.

క్రొత్త నిబంధన గ్రంథమైతే చాలా బాగుందనిపిస్తుంది. (శర్మన్ ఆన్ ది మౌంట్) భగవద్గీతతో సరిపోల్చదగిన అధ్యాయమనే అభిప్రాయం ఆయనకు కలిగింది. గిరి ప్రబోధము అని అర్థం వచ్చే ఈ అధ్యాయంలో ఉన్న నైతిక సూత్రాలు మహాత్ముని మనసులో ముద్రపడ్డాయి.

ఎవరు ఎలాంటి పనిని చేస్తారో అలాంటి ఫలితాన్ని అనుభవిస్తారని ఈ అధ్యాయంలో చెప్పబడింది. “అవశ్యం అనుభోక్తవ్యం కృతం కర్మశుభాశుభం’ అని గీతలో చెప్పిన మాటలకు ఈ అధ్యాయం అనువాదమే అనిపించింది.

మరొక విషయం కూడా మహాత్ముని మనసు పట్టి లాగింది. ప్రపంచంలో ఎన్నో మోసాలు, అన్యాయాలు జరుగుతూ ఉంటాయి. ఎవరూ మోసాన్ని మోసంతోకాని, అన్యా

యాన్ని అన్యాయంతో కాని ఎదిరించలేదు. జయించలేరు, పోరాడలేరు. దైవికశక్తులు, అసుర శక్తుల మధ్య పోరాటం అనివార్యం. అన్యాయాన్ని న్యాయంతో ఎదిరించాలి. కోపాన్ని, తాపాన్ని కరుణతో సహించాలి.

ఎవరైనా నీ చెంపమీద ఒక దెబ్బకొడితే రెండవ చెంప కూడ చూపించాలి. భుజం మీద ఉత్తరీయాన్ని ఎవరైనా లాగేస్తే వారికి నీ హృదయాన్ని కూడా సమర్పించు. కరుణతో లోకాలను జయించు. ఇలాంటివే ఎన్నో నైతిక సూత్రాలు క్రొత్త నిబంధన గ్రంథంలో చదివి ప్రభావితుడైనాడు గాంధీ. భగవద్గీత, బౌద్ధపీటకాలు, బైబిలు మూడూ కలిసి అతని మనసులో ఒక నైతిక గమ్యాన్ని నిర్ధారించాయి.

**స్వార్థం కన్నా త్యాగం గొప్పది**
**కోపం కన్నా శాంతమే మహనీయమైనది**
**శిక్షకన్నా క్షమం అమోఘమైనది**

ప్రపంచంలో ఎన్ని మతాలున్నా వాటిలో ఉన్న అంతః సూత్రం మానవత. మతానికి అర్థం మమత, మానవత, నైతికత, మహనీయత అని గాంధీ గుర్తించాడు. పరీక్షలు దగ్గర పడుతూ ఉండిన కారణంగా ఇతర వ్యాపకాలు తగ్గించేశాడు. కాని పనిలో పనిగా "హీరోస్ అండ్ హీరో వర్షిప్" అనే గ్రంథాన్ని కూడా చదివాడు. దీనిని రచించిన వాడు కార్లయిల్. మహమ్మదు జీవితం అతని మహనీయత, వీరత్వం, తపోబలం అన్ని ఆకళించుకున్నాడు. మతాల అర్థాలన్నీ మానవతా సూత్రంగా మారి మోహన్‌దాస్ మనసుని కట్టిపడేశాయి.

పరీక్షలలో నెగ్గేందుకు ఏకాగ్రతలోకి వచ్చాడు. బ్రాడ్లే పండితుడు చనిపోయాడు.

ఆయన అంత్యక్రియలు ఓకింగ్ సెమెట్రిలో జరిగాయి. మొత్తం భారతీయులే కాక నాస్తికులు కూడా ఈ సంతాప కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒక నాస్తికుడు చిన్న తమాషా చేశాడు. ఫాదరీని ఏడ్పించాలని దేవుడున్నాడు? అని ప్రశ్నించాడు.

ఫాదరీ అవునని తలవూగించాడు.

భూమి వున్నది కదా అని ప్రశ్నించాడు నాస్తికుడు.

అవునని తల ఊగించాడు ఫాదరీ.

భూమి చుట్టుకొలత 78,000 మైళ్ళు అని మీరు ఒప్పుకుంటారు కదా!

ఫాదరీ అందుకు ఒప్పుకున్నాడు.

అయితే దేవుని చుట్టుకొలత ఎంతో చెప్పమన్నాడు నాస్తికుడు.

నీ హృదయానికి  చుట్టుకొలత ఎంత? మన ఇద్దరి హృదయాలలోను దేవుడున్నాడు. దేవుడు లేడని నీవు అంటున్నావు.

నీ హృదయంలో ఉన్నవాడు దేవుడే అని ఫాదరీ బదులిచ్చాడు.

ఈ మాటలు నమ్మడానికి నేనింకా పసివాడిని కాను అంటూ ఎగతాళి చేశాడు నాస్తికుడు.

నీ అభిప్రాయం పట్ల, నీ పట్ల నేను ఎంతో వినమ్రతతో ఉంటాను. నా విశ్వాసాలను మాత్రం మార్చుకోను అని ఫాదరీ బదులు చెప్పాడు. వారి సంభాషణను శ్రద్ధగా విన్నాడు గాంధీ. జాగ్రత్తగా గుర్తు పెట్టుకున్నాడు. ఇంటి దగ్గర ఒంటరి వేళలో ఆ మాటలను మననం చేసికొని విశ్లేషించుకున్నాడు. చక్కగా తర్కించుకున్నాడు. వినమ్రతా భావం విద్యకు, పదవులకు, వ్యక్తిత్వానికి, మానవత్వానికి శోభను సమకూర్చుతుందని అతనికి అనిపించింది.

ఆలోచనలు వేరుగా ఉండవచ్చు. విశ్వాసం అనేది అందరి హృదయాలను శాసించే జీవధాతువు. చెక్కుచెదరి, మొక్కవోని విశ్వాసమే మానవుని మహనీయుడుగా మలుచుతుందని మహాత్ముడు ఆనాడే కనిపెట్టేశాడు. పరీక్షలు దగ్గర పడ్డాయి. అది 1890వ సంవత్సరం. సుమత్ రేవులో చిన్న సహోదరి ఉండెను. నావికులు, వారి అవసరాలను తీర్చే అతివలు అక్కడ చేరారు. మోహన్‌దాస్‌కు కూడా ఆహ్వానం వచ్చింది.

క్రొత్తవారికి ఉండతగిన చోటు ఏదో, ఏదికాదో తెలిసికోవటం చాలా కష్టం. గృహిణులు కూడా అతిథులతో అర్ధరాత్రి పేకాటలు మొదలుపెట్టారు. మాటల దొంతరలలో మంచి, చెడు వెతుక్కోవడం కష్టమనిపించింది. అదే బీభత్స దృశ్యం. గాంధీ కూడా వారితో కలసి ఆటలోకి దిగాడు. మాటల పోటీ పెరిగింది. పరిస్థితి గూర్చి గాంధీ సిగ్గుపడవలసి వచ్చింది.

గాంధీని కన్నతల్లి పుతలీబాయికి చేసిన ప్రతిజ్ఞని, ఆ ప్రవాహంలో పడి కొట్టుకుపోకుండా భగవంతుడు మిత్రుడై రక్షించాడు. అతని మనసులో దూరి గాంధీకి పాపకూపము నుండి విముక్తి కలిగించాడు. ఈ ఘోరకలిలో, పాపాల దొంతరల మధ్య నీవెందుకు? లేచివెళ్ళు. ఇది నీలాంటి అమాయకులు అంటే మంచివాళ్ళు ఉండదగిన చోటు కాదు, వెళ్ళిపొమ్మని రెక్క పట్టుకొని మరీ లేపాడు.

అమ్మకు ఇచ్చిన ప్రతిజ్ఞ ఆంతర్యంలోంచి మేల్కొంది. వేటగాడి బాణం నుండి తప్పుకుపోతున్న లేడికూనలా గజగజ వణకుచు బయటకు పరుగుతీశాడు. పరాయి స్త్రీకి

మరొక పర్యాయపదాన్ని వెతకాలని ప్రయత్నించిన ఆ కొద్ది క్షణాల మనోలోకాన్ని మలిన పరచిన విషఘడియలని భావించాడు.

ఆ రాత్రి ఇక నిద్రపట్టలేదు. ఇల్లు విడచి వెళ్ళాలా, ఊరు విడచి వెళ్ళాలా, దేశాన్ని వదిలి పారిపోవాలా?

అదేమి అక్కర్లేదు. ఈరేవు పట్టణం నుండి అవతలకు పోతే అంతేచాలని నిర్ణయించుకొన్నాడు. విహారాలు, విందులు ఆనందం కోసమే కాని అవధులు దాటేందుకు కాదని గుర్తించాడు.

మనిషికి అనుభవాలు ఎదురువుతాయి. వాటిలో కొట్టుకుపోకుండా తనను తాను గుర్తించినవాడే 'మనీషి'.

మనసుని అదుపు చేసుకోవడం, మనచుట్టూ ఉన్న అనేక ఆకర్షణల నుంచి వ్యక్తిత్వాన్ని రక్షించుకోవడం అనేవి చాలా గొప్ప సమస్యల్లా, చిక్కుముడుల్లా కనిపిస్తాయి. కాని వాస్తవానికి అటువంటి విషఘడియలు ఎదురైతే దాటిపోవడం సులభమే. ఈ సముద్రాన్ని ఒడ్డుకు సులభంగా చేర్చగల నావ ఒక్కటే.

ఆ నావ పేరు దైవ ప్రార్థన. ప్రార్థన అనేదానికి ఎంత శక్తి ఉన్నదో, పాపాల నుంచి తనను తాను పునరుద్ధరించుకోవడానికి ఎంత బలాన్ని ఇవ్వగలదో గాంధీ గుర్తించాడు.

ఇక్కడే మరొక జీవిత రహస్య అర్థాన్ని కూడా గాంధీ వంటపట్టించుకున్నాడు. రుచి అనే దానిని గ్రహించేది నాలుక కాదు, స్పర్శసుఖాన్ని చవి చూచేది శరీరమూ కాదు. అందాన్ని కొలిచేవి కన్నులు కాదు, సంగీతాన్ని వినేది చెవులూ కాదు. ఈ అనుభవాల న్నింటినీ జీర్ణించుకునేది, అనుభవించేది మనిషి మనసు. మనసున్న మనిషిగా జీవించాలే కాని శరీర సుఖాలను అపార్థం చేసికొని పశువుగా భాసించకూడదు. ఇది మనిషి మనసు కథ.

దీనిని చక్కగా అర్థం చేసుకున్నాడు మోహన్‌దాస్.

ప్రార్థన చేసేటప్పుడు అహంకారాన్ని విడిచిపెట్టి వినమ్రతాభావాన్ని పొందగలగాలి. అప్పుడే ప్రార్థనలు ఫలిస్తాయి. ఉనికి మరచిపోతేనే ఉపాసన సఫలమవుతుంది.

మొత్తం మీద రేవు పట్టణంలో గాంధీకి ఎదురైన అనుభవం చక్కని ఆలోచనలను నడిపించింది. పట్టణం నుంచి పారిపోయాడు కాని అనుభవాలను మాత్రం జార విడుచుకోలేదు.

ఈ సమయంలోనే నారాయణ హేమచంద్రుడనే ఒక విచిత్రమనే వ్యక్తితో మోహన దాస్‌కు స్నేహం కలిసింది. అతడు కూడా మంచి ఆలోచనాపరుడు. ఆంగ్లభాష రాదు.

కాని దేశీయ భాషలు అనేకం వచ్చు. బెంగాలి నుంచి గుజరాతీలోకి మంచి మంచి గ్రంథాలను అనువదించాడు. రచయితగా పేరొందాడు. దానిని అడ్డం పెట్టుకొని ఇంగ్లాండు చేరి అస్తవ్యస్తపు వేషభాషలతో అందరిని కలుస్తున్నాడు. ఆ వరుసలోనే గాంధీకి కూడా అతనితో పరిచయమైంది.

హేమచంద్రుడు విచిత్రమైన తత్త్వం కలవాడు. నెక్ టై కాని, కాలర్స్ కాని లేకుండా పాంటు, షర్టు ధరించాడు. అవి నలిగి ముడుతలు పడి జిడ్డుకారుతున్నాయి. కుచ్చు కలిగిన టోపీని ధరించాడు. అడ్డదిడ్డంగా తలవెంట్రుకలతో పాటు గడ్డం కూడా పెంచేశాడు. మాటిమాటికి గడ్డాన్ని చేత్తో సవరించుకోవడం అతనికో సరదా.

నీ రచనలు నేను చదివానని చెప్పాడు గాంధీ. మీ పాదధూళి మా ఇంటిలో పెట్టి పావనం చేయమని ప్రార్థించాడు. అందుకు ఒప్పుకొని ఇంగ్లీషు మాట్లాడటం నేర్పించమని అర్థించాడు నారాయణ హేమచంద్రుడు. స్టోరు వీధిలో ఉంటున్న గాంధీ దగ్గరకు వచ్చి విచిత్రమైన భాష మాట్లాడేవాడు. వ్యాకరణ మనేది ఒకటి ఉంటుందని హేమచంద్రునికి తెలియదు.

మహర్షి దేవేంద్రనాథ ఠాకూర్ రచనలు గుజరాతీలోకి అనువదించినట్లు చెప్పాడు. 'గుర్రం వేగంగా పరుగుతీసింది' అనే మాటలో కర్త, కర్మ, క్రియ ఆయనకు తెలియవు. గుర్రమనేది కర్మ అనుకునేవాడు. వ్యాకరణంలో ఇంత వెనుకబడ్డవాడు రచనలు ఎలా చేస్తాడా? అని గాంధీగారికి ఒక అనుమానం పట్టుకుంది. పైగా మరాఠీ, హిందీ, బెంగాలీ కూడా వచ్చునంటున్నాడు.

వీలైతే జర్మనీ వెళ్ళాలంటున్నాడు. ఫ్రెంచి భాష నేర్చుకుని ఆ గ్రంథాలను అను వదించాలనే ఊపులో ఉన్నట్టుగా కనబడ్డాడు. అనువాదం చేయాలంటే శబ్దాల పట్టిక చాలు. వ్యాకరణంతో పనిలేదని అతను గాంధీకి బోధించాడు. అమెరికా వెళ్ళడం తన యాత్రలో ఆఖరి మజిలీ అని కూడా వివరించాడు.

"అయితే మీరు అమెరికా కూడా వెళ్ళాలనుకుంటున్నారా" అని అమాయకంగా ప్రశ్నించాడు మోహన్‌దాస్. అమెరికా చూడకుండా ఇంటికెలా వెళతానన్నాడు హేమ చంద్రుడు. డబ్బు గురించి ప్రశ్నించాడు మోహనదాస్. నాకు డబ్బుతో పని లేదు. పుస్తకాలు, స్నేహితులుంటే చాలన్నాడు హేమచంద్రుడు.

అమెరికా దాకా ఆకాశం కనిపించేలా డెక్ మీద కూర్చొని ప్రయాణం చేయాలని అనుకుంటున్నాడు. వంటలు వండడంలో చాలా నేర్పరి. కార్డినల్ మానింగ్ దొరగారిని తను కలుసుకోవాలని కోరగానే దర్శనానికి ఏర్పాటు చేయించాడు మోహన్‌దాస్. ఆయనతో

మాట్లాడుతున్నప్పుడు సునిశితంగా పరిశీలించాడు గాంధీ. అంత గొప్ప వాక్చాతుర్యం కలవాడుగా అనిపించలేదు. కానింగ్ దొర ఒకే ఒక్కమాట మాత్రం మాట్లాడి వెళ్ళిపోయాడు. తనుకూడ గ్రంథాలు రచించాడని చెప్పాలనుకున్నాడు హేమచంద్రుడు. కాని ఆయన ఖాతరు చేయలేదు. అయినా కృంగిపోలేదు రచయిత.

ఒకరోజు షర్టు తొడుక్కుని, ధోవతి కట్టుకొని బజారువెంట బయలుదేరాడు. గాంధీ గారి మిత్రుడు హేమచంద్రుడు. వీధుల్లో ఆకతాయి పిల్లలు రాళ్ళు వెయ్యాలని అల్లరి చేయాలని వెంటపడ్డారు. వాళ్ళవంక కన్నెత్తి చూస్తే ఏమి ప్రమాదం జరుగుతుందోనని హడావిడిగా గాంధీ నివసించే ఇంటివైపు పరిగెత్తుకొచ్చాడు. ఇంగ్లాండులో ధోవతి కట్టుకొని, చొక్కా తొడుక్కోవడం పిచ్చివాలకం క్రిందికే వస్తుంది. పైగా ఇంటి తలుపులు దడదడమని కొట్టాడు. ఆ ఇంటి ఇల్లాలు ఏదో ప్రమాదం జరిగిందని పరుగెత్తుకొచ్చి తలుపులు తీసింది. హఠాత్తుగా విచిత్రమైన వేషధారణలో ఉన్న హేమచంద్రుని చూచి నివ్వెరపోయింది.

కంగారుతోపాటు ఆమెకు కొంత భయం కూడా కలిగింది. పరుగెత్తుకుంటూ గాంధీ దగ్గరకు వచ్చి, ఎవరో పిచ్చివాడు నీ కోసం వచ్చినట్టున్నాడు అని చెప్పి ఇంటి లోపలకు వెళ్ళిపోయింది. గాంధీ వీధి వాకిలి దగ్గరకు వచ్చి అతనిని చూపి నవ్వాపుకోలేకపోయాడు. కొంతకాలం గాంధీ అతనికి ఆంగ్లం నేర్పాడు. ఆ తరువాత హేమచంద్రుడు పారిస్ వెళ్ళిపోయాడు.

ఫ్రెంచి భాష నేర్చుకొని గ్రంథాలను అనువాదం చేయడం మొదలుపెట్టాడు. ఇది అనువాదం కాదని, వారంటే భావార్థాలు వ్రాశాను పొమ్మన్నాడు. అమెరికా వెళ్ళాలనే కోరిక కూడా తీరింది. డెక్ మీద కూర్చుని అమెరికా దాకా ప్రయాణించాడు. తీరా ఓడ దిగాక అతనిని అమెరికన్లు అరెస్టు చేసి ప్రాసిక్యూట్ చేశారు. ధోవతి కట్టుకోవడం ఆ దేశంలో అసభ్యతకు చిహ్నం. శిక్ష అనుభవించి నింపాదిగా భారతదేశం తిరిగి వచ్చాడు.

ఆఖరు సంవత్సరం 1890లో పారిస్ నగరం చూడాలనే కోరికతో బయలుదేరాడు గాంధీ. ఖర్చు తక్కువతో వెళ్ళి రావడానికి చక్కని పథకం రూపొందించుకున్నాడు. పారిస్‌లో ఎగ్జిబిషన్ ఒకటి జరుగుతుంది. ఈఫిల్ టవర్ మీద మొదటి అంతస్థులో భోజనం చెయ్యాలనే కోరిక తీర్చుకోవడానికి ఏడు షిల్లింగులు తగలేశాడు గాంధీ. ఈఫిల్ టవర్ నిర్జీవ ప్రతిమ. భారతీయ శిల్ప సాంప్రదాయంలోంచి చూస్తే దానికి ఘనత ఉన్నది గాని జీవకళ లేనట్లుగా కనిపించింది.

దానికన్నా మోటార్‌డామ్ కట్టడపు పనులే బాగున్నట్లు అనిపించాయి. పారిస్ నగరమంటే భోగవిలాసాలు విలసిల్లిన స్వర్గం. దైవభక్తి కలిగిన ప్రజలు. మాదకద్రవ్యాలు

అన్నింటిలోకి ప్రమాదకరమైనది పొగాకు. త్రాగుబోతులు మాత్రమే ఈఫిల్ టవర్‌ను నిర్మిస్తారన్నాడు టాల్‌స్టాయ్. శిల్పం లేని కట్టడం సజీవం కాదు. చిన్నపిల్లలకు బొమ్మల మీద మోహం ఉంటుంది. కాని పరిపక్వత చెందిన వాళ్ళకు వ్యామోహం ఉండదు.

ఈఫిల్ టవర్ గాంధీ మనసుని ఆకట్టుకొనలేకపోయింది. పారిస్ మహానగరంలో విలసిల్లుతున్న భోగవిలాసాలతో అతనికి నిమిత్తమే లేదు. తిరిగి వచ్చేశాడు.

బారిష్టరు పట్టా తీసుకోవడానికి సిద్ధపడి ఉన్నాడు. పట్టా తీసుకొనడానికి రెండు నియమాలున్నాయి. సమయాన్ని తప్పక ఆలకించటం ఒకటి. పరీక్షల్లో నెగ్గడం మరొకటి. పన్నెండు భాగాల సమయపాలన విందులలో విధిగా పాల్గొనాలి. విందులో పాల్గొనడమంటే తినడం కాదు. హాజరు కావడమే. రుచికరమైన విందు, కోరిన మద్యం లభిస్తాయి. చెల్లించవలసిన మొత్తం తక్కువే. త్రాగుడుకు డబ్బు తగలేయడానికి గాంధీ వ్యతిరేకం.

రొట్టె, బంగాళాదుంపలు, కాబేజి అతని ఆహారం, శాఖాహారమే తీసుకునేవాడు. గాంధీ మద్యం త్రాగనందువల్ల తన కోటా దక్కించుకోవడానికి విద్యార్థులు పోటీపడి అతనిని పిలిచేవారు. తను తప్పనిసరిగా డబ్బు చెల్లించినా షాంపైన్, షెర్రి, వైన్, ఉచితంగా ఇస్తాడని వారి ఆశ. ఈ భోజనం రాత్రులనే "గ్రాండ్ నైట్స్" అనే బ్రహ్మాండమైన పేరుతో పిలుస్తారు.

బారిష్టరు అంటే డిన్నరు బారిష్టరు అని పేరు. తిండిబోతు బారిష్టరని అర్థం. పరీక్షలు నామమాత్రం. రోమన్ లా, కామన్ లా పరీక్షలు రెండు వ్రాస్తే డిగ్రీ సులభం. దీనికి రెండు వారాల చదువు చాలు. రోమన్ లా పరీక్షలో 99% విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేవారు. పరీక్ష తప్పినా కూడా సంవత్సరం వృథా పోతుందన్న భయం లేదు. సంవత్సరానికి 4 సార్లు పరీక్షలు నిర్వహిస్తారు. కాని గాంధీ ఈ పద్ధతిలో కాకుండా మొత్తం సిలబస్ క్షుణ్ణంగా  కష్టపడి చదివాడు. అది తరువాత ఆఫ్రికాలో అతనికి ఉపయోగపడింది.

ఒక్క కామన్‌లా మీద మనసు పెట్టి తీవ్రంగా రాత్రింబవళ్ళు చదివితే 9 నెలలు పట్టింది. "ఈక్విటీ, లీడింగ్‌కేసెస్, రియల్ ప్రాపర్టి, పర్సనల్ ప్రాపర్టి" వీటితో పాటుగా "హిందూ లా"ని ఎంతో ఆసక్తిగా చదివాడు. పరీక్ష పాసయ్యాడు. ఆశయం నెరవేరింది. 1891 జూన్ 10వ తేదీన పట్టాచేతికి వచ్చింది. రెండున్నర షిల్లింగులు ఖర్చు పెట్టి 11వ తేదీన హైకోర్టులో పేరు నమోదు చేయించుకున్నాడు.

ఆలస్యం లేకుండా 12వ తేదీనే ఇంటికి బయలుదేరాడు. ఇదంతా అయిన తరువాత కోర్టుకు వెళితే నోరు పెగలదేమో అని భయపడ్డాడు. పట్టా రావడం తేలికే గాని పట్టిన

కేసులు గెలిపించడం చాలా కష్టం. ఫిరోజ్‌షా మెహతాగారు కోర్టుల్లో సింహంలాగా గర్జిస్తాడని పేరు. ఆయనతో పాటు దాదాభాయి నౌరోజి గారి సలహాలు కూడా తీసుకోవలసి వచ్చింది.

విద్యార్థుల కోసం నౌరోజి ఒకసంఘాన్ని స్థాపించాడు. గాంధీకి ఇష్టం వచ్చినపుడు కలిసే విధంగా అనుమతి ఇచ్చాడు. ఫ్రెడరిక్ పినకట్ అనే ఆయన కూడా గాంధీని ప్రోత్సహించాడు. వారు ప్రాక్టీసు గురించి గాంధీ మనసులో ఉన్న భయం పోగొట్టడానికి ఎన్నో సలహాలు ఇచ్చారు. షేక్స్పియర్ రచించిన కొన్ని గ్రంథాలు చదివాడు గాంధీ. ఈ అనుభవాలన్ని నెమరు వేసుకుంటూ అల్లకల్లోలంగా ఉన్న జూన్ మాసపు సముద్రంలో ప్రయాణం చేస్తూ తుఫానుల మధ్య గంజి త్రాగుతూ ఒడ్డుకు చేరాడు.

ఎన్నో చిక్కులు ఎదురుచూస్తున్నాయి. పెదనాన్నగారు డాక్టరు మెహతాగారితో వచ్చారు. ఇంగ్లాండులో ఏర్పడిన వాళ్ళ పరిచయం ఇంకా వృద్ధి అయింది. వారి కుటుంబాల మధ్య గాఢమైన మైత్రి ఏర్పడింది. తుఫానులో, చలిలో ప్రాక్టీసు భయంతో వణికిపోతూ గాంధీ తిరిగి మనుషుల మధ్య కలవడానికి ప్రయత్నించాడు.

# 3. రాముడే తోడు

విదేశీ విద్య పూర్తి అయింది. స్వదేశీయ జీవితం ప్రారంభమైంది.

సముద్రం మీద ప్రయాణం చేసిన కారణంగా గాంధీని వెలివేయాలన్న పెద్దల ఆలోచనలో మార్పు లేదు. వారు ముఠాలుగా విడిపోయారు. కుల కట్టుబాట్ల పేరుతో గాంధీ మీద ఛాందసదాడులు ప్రారంభించారు. ఓడ దిగి ఇంటికి వెళ్ళాక తల్లి పుతలీబాయి మరణించిందనే విషయం గాంధీకి తెలిసింది. అన్నగారి సూచన మేరకు నాసిక్ వెళ్ళి పవిత్ర స్నానం చేశాడు. అది ప్రాయశ్చిత్తం.

ఆ తరువాత కులస్థులందరికి విందు ఏర్పాటు చేశాడు. ఇదంతా గాంధీ మనసులో నిరసన భావాన్ని రేకెత్తించింది. తల్లి మరణం అపరిమితమైన దుఃఖాన్ని కలిగించింది. పెద్ద పెట్టున ఏడ్చేశాడు. తండ్రి చనిపోయినప్పటి కన్నా తల్లి చనిపోయిన వార్త విన్నప్పుడే ఎక్కువ వ్యథ కలిగింది. ఎప్పటికప్పుడు కోరికలు అందకుండా పోతున్నాసర్దుకు పోవడం నేర్చుకున్నాడు. డా॥ మెహతా ఓదార్చి గాంధీని ప్రాక్టీసులో పెట్టాలని ప్రయత్నం మొదలు పెట్టాడు. రామచంద్, దేహశంకర్, జగజ్జీవన్ మొదలైనవారితో పరిచయాలు ఏర్పడ్డాయి. గుప్తానందుడు రచించిన గీతాలు చదవడం తటస్థించింది. పనిలో దైవాన్ని చూడాలనే సిద్ధాంతం ఆయనది. ఈ తపన గాంధీని కూడా పట్టుకొంది.

జగజ్జీవన్‌గారికి రత్నాలు, వజ్రాల వ్యాపారం ఉంది. పనిపాటులు లేని బారిష్టరుగా గాంధీ కొంత అనుభవాన్ని సంపాదించాడు. రామచంద్ భాయ్ ఉపదేశాలు బాగా ప్రభావితం చేశాయి.

బారిష్టరు తరువాత గాంధీ సంపాదించి ఉద్ధరిస్తాడని అన్నగారు ఆశలు పెంచుకున్నాడు. ఎదుటివారి దోషాలను క్షమించే ఉదారుడు అన్నగారు. తమ్ముడి ప్రాక్టీసు కోసం చాలా ప్రయత్నాలు చేశాడు. కులకట్టుబాట్లకు భయపడి బంధువుల ఇళ్ళకు వెళ్ళడం

మానివేశాడు. గాంధీని వెలివేసిన వారిలో కూడా కొంతమంది అతని వ్యక్తిత్వాన్ని ప్రేమించేవారు.

కుటుంబ సమస్యలు అలాగే ఉన్నాయి. గాంధీకి కస్తూరిబా చేత చదివించాలని, తనే చదువు స్వయంగా చెప్పాలని ఎంతో ఆశగా ఉండేది. పిల్లల చేత వ్యాయామం చేయించి వారు బలవంతులుగా ఉండడం చూడాలనిపించేది. పిల్లలతో కలిసి ఆడుకోవడ మంటే గాంధీకి చాలా ఇష్టం. వారికి చక్కగా తర్ఫీదు ఇచ్చేవాడు. తెల్ల ఏనుగు ఎత్తు పడిపోయినట్లుగా ఉన్నది కుటుంబ పరిస్థితి. రాజకోటలో వృత్తి ప్రారంభించడం గాంధీకి అంత సమ్మతంగా లేదు. బొంబాయి వెళ్ళాలనిపించింది. మిత్రుల సలహాలు కూడా తీసుకొని గాంధీ బొంబాయి బయలుదేరాడు.

బొంబాయిలో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని వంటవాడిని కుదుర్చుకొన్నాడు. వంట చేసే మనిషి పేరు రవిశంకర్. బ్రాహ్మణీకం చదువులు కూడా లేనివాడు. వంటపని చేతగాకపోయినా రెండు మంత్రం ముక్కలు కూడా రాకపోతే ఎలాగని గాంధీ ప్రశ్నించాడు. నాకు సంధ్యావందనం ఎందుకు? పలుగు, పార ఉంటే చాలు. మీ అనుగ్రహం ఉంటే వంట చేస్తూ ఉంటా. లేకపోతే నా పలుగు, పార మళ్ళీ పుచ్చుకొంటా అని సమాధానం చెప్పాడు.

కళేబరం మీద నీళ్ళు దిమ్మరించడం తప్ప శుభ్రంగా తోముకోవడం, ఉతికిన బట్టలు ధరించడం అతనికి అలవాటు లేదు. బొంబాయిలో హిందూ లా చదివాడు గాంధీ. సివిల్ ప్రొసీజర్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్ చదివాడు. వీరచంద్ అనే మిత్రుడు చాలా కేసుల గురించి చెప్పాడు. నెల నెలా ఇంటి ఖర్చులు పెరుగుతున్నాయి. బొంబాయిలో ఆహార పదార్థాల ధరల పెరిగాయి.

ఎట్టకేలకు ఒక అమాయకురాలు వచ్చి గాంధీకి తన కేసు అప్పగించింది. స్మాల్‌కాజ్ కోర్టులో హరి ఓం అంటూ ప్రతివాది పక్షం మొదలెట్టాడు. సాక్షుల్ని క్రాస్ చేయాల్సిన సమయం వచ్చింది. కోటు సవరించుకుని లేచి నిలబడ్డాడు. గుండె దడదడలాడింది. కోర్టు హాలంతా గిర్రున తిరిగిపోతున్నట్లనిపించింది. ప్రశ్నలు మనసులో మొదలవుతున్నాయి. కాని పెదవులు మీదికి రాలేదు.

కేసు తెచ్చిన మధ్యవర్తిని పిలిచి ఈ కేసు వాదించడం నా వల్ల కాదు. ఫీజు కింద యిచ్చిన 30 రూ॥లు తిరిగి ఇచ్చేస్తాను. మరొక వకీలుని పెట్టుకొని వాదించుకొనండి అని చెప్పాడు. వారు అలాగే చేశారు. ఇంతా జరిగాక ఇంటికి పోతూ సిగ్గుపడ్డాడు గాంధీ. మరికొంత కాలం గడిచాక మరో కేసు వచ్చింది. అది అర్జీ వ్రాయడం. నాన్నగారి

మిత్రుడు గనుక కేసు ఒప్పుకున్నాడు. దానికి అయ్యే ఖర్చులు తానే భరించాడు. చిత్తు వ్రాసి మిత్రులకు వినిపించితే బ్రహ్మాండంగా ఉందని పొగిడాడు. ఇక అర్జీలు వ్రాయడమే ప్లీడరుగారి పని అయింది.

ఇల్లు గడవాలి కనుక ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్ళాలనిపించింది. ఒక గంట సేపు ఇంగ్లీషు పాఠాలు చెపితే నెలకు రూ. 75 జీతం ఇస్తారని ఒక పత్రికలో ప్రకటన వెలువడింది. గాంధీ వెళ్ళాడు. గ్రాడ్యుయేషన్ కోర్సు చేయలేదు కాబట్టి బారిష్టరు డిగ్రీకి ఆ ఉద్యోగం రాదు పొమ్మన్నారు. ఆ విధంగా ఆ ఉద్యోగం చేజారిపోయింది. అప్పటికి బొంబాయిలో జీవితం 6 నెలలు గడిచింది.

ప్రతిరోజు హైకోర్టుకు వెళ్ళి కుర్చీలో కూర్చుంటే హాయిగా నిద్రపట్టేది. తనలాగే పనిలేని వకీళ్ళు చాలా మంది నిద్రపోతున్నారు. కనుక బాధపడాలనిపించలేదు. 45 ని॥ల నడక అలవాటు చేసికొని ప్రయాణఖర్చు తగ్గించాడు. ఇప్పుడు ఈ నడక అలవాటు గాంధీకి తరువాత చాలా ఉపయోగించింది. బొంబాయి వదలిపెట్టి రాజకోటకు చేరాడు. సొంతగా ఆఫీసు పెట్టుకుంటే యిక్కడ వ్యవహారం బాగానే నడిచింది. నెలకు 300రూ॥ ఆదాయం. అన్నగారు బాగా ప్రాక్టీసు ఉన్న పెద్ద బారిష్టరును పట్టుకొని ఆయనకు అక్కరలేని కేసులన్నీ గాంధీకి ఇప్పించేవాడు. ఆ విధంగా ఆదాయం పెరిగింది.

పెద్ద వకీలుతో భాగస్వామ్యం కుదుర్చుకొన్నట్లు కూడా అయింది. దళారులకు సొమ్ము చెల్లిస్తే కేసులు దొరికే విధానం ఒకటుంది. ఆ పద్ధతి అమలు చేయమని అన్నయ్య వత్తిడి పెట్టేవాడు. ప్రాక్టీసు కొద్దిగా ముందుకు సాగింది. కాని మరో గట్టి అనుభవం ఎదురైంది. తెల్లవారి దాష్టీకం బాగా సాగుతున్న రోజులవి. పోరుబందరు రాణాగారు అన్నయ్య సలహాలు పొందేవాడు. ఆయన మంత్రిగా పనిచేశాడు. రాణాగారికి సలహాలు ఇచ్చే విషయంలో గాంధీగారి అన్నయ్య కుట్రచేశాడని ఒక అభియోగం మోపబడింది. ఇది కుటుంబానికే పెద్ద ఎదురుదెబ్బ.

ఈ విషయంలో గాంధీ అన్నగారి మీద కక్షదారులు కొందరు తయారయ్యారు. వారిలో ఒక ముఖ్యుడు గాంధీకి ఇంగ్లాండులో పరిచయస్థుడు. ఈ పరిచయాన్ని ఉపయోగించి రాజీ చేయమని అన్నగారు తమ్ముని కోరారు. పరిచయాన్ని ఇలా స్వార్థానికి ఉపయోగించే పద్ధతి మోహన్‌దాస్‌కు గిట్టదు. రాజబాటగా అర్జీ పెట్టుకోమంటే అన్నగారు వినలేదు. ఈ కథియవాడ రాజకీయాలు వేరు. తెల్లదొరను ఒప్పించి శిక్షను తగ్గించడం నీ ధర్మం అని అన్న బలవంతపెట్టాడు. ఇక తప్పనిసరిగా గాంధీ బయలుదేరాడు. పరి చయాన్ని పరామర్శిస్తే ఫర్వాలేదనిపించింది.

కేసు విషయం ఎత్తగానే కరుకుదనం చూపించాడు. స్నేహాన్ని స్వలాభానికి ఉపయోగించుకుంటారే అన్నట్లు చూచాడు. మీ అన్న విషయంలో నువ్వేం చెప్పినా నేను వినను. మీ అన్నయ్య కుట్రదారుడు. చెప్పుకునేది ఏమైనా ఉంటే అతనినే వచ్చి చెప్పుకోమను. ఇక వెళ్ళు అని కసిరాడు.కాని గాంధీ ఇంకా ఏదో చెప్పాలని ప్రయత్నించాడు. లండన్ మిత్రుడు నౌకరును పిలిచి ఇతనికి ఇంటికి వెళ్లేదారి చూపించమన్నాడు. నౌకరు గాంధీని రెండు భుజాలు పట్టుకుని బయటకు నెట్టేశాడు. తెల్లదొర కూడా నిర్లక్ష్యంగా లోనికి వెళ్ళిపోయాడు.

ఈ అవమానం భరించలేక గాంధీ నన్ను అవమానించినందుకు పరువు నష్టం దావా వేస్తానని ఉత్తరం వ్రాశాడు. అసభ్యంగా ప్రవర్తించినందువల్ల అలా చేయడం తప్పని సరి అయినదని, సమాధానం పంపించాడు. ఈ భారం నెత్తిన వేసికొని గాంధీ రాజకోట తిరిగి వచ్చాడు. జరిగిందంతా విని అన్నగారు చాలా బాధపడ్డాడు. తమ్ముడిని ఓదార్చాలని ప్రయత్నించాడు. ఈ విషయమై చాలామందిని సలహా అడిగాడు. ఆ సమయానికి సర్ఫిరోజ్ వచ్చాడు. ఆయనకొక అర్జీ పెట్టుకొని సలహా కోసం మెహతాని ఆశ్రయించారు.

ఇదంతా మామూలు వ్యవహారమే అన్నాడాయన. క్రొత్తగా ఇంగ్లాండు నుంచి తిరిగి వచ్చిన వకీలుకు ఆ మాత్రం వేడి పాలు ఉండటం సహజమేనని కొట్టి పారేశాడు. ఆంగ్లేయులు భారతదేశంలో సాగిస్తున్న దురంతాలు అన్ని తెలుసుకుంటే ఇదొక లెక్కకాదు పొమ్మన్నాడు. పాలకులైన తెల్లవారితో తగవులు పెట్టుకుటే నష్టమే కాని లాభం ఉండదని ఖండితంగా తేల్చి చెప్పాడు. పరిచయాన్ని సొంతానికి ఉపయోగించుకోవాలనుకుంటే ఇలాంటి అనుభవాలు తప్పవన్నాడు.

గాంధీకి ఇంకా చాలినంత లోకజ్ఞానం లేదంటూ తేల్చేశాడు. విషప్రాయంగా ఉన్న ఈ సలహాను గాంధీ వినక తప్పలేదు. శివుడు గరళాన్ని కంఠంలో దాచినట్లుగా ఈ అనుభవాన్ని గాంధీ దాచిపెట్టుకున్నాడు. భవిష్యత్తులో ఇంకెప్పుడు పరిచయాన్ని స్వార్థానికి ఉపయోగించరాదని తెలుసుకున్నాడు. ఈ నిర్ణయాన్ని జీవితాంతం నిక్కచ్చిగా పాటించాడు. దీని వలన ఆయన జీతంలో ఎన్నో అద్భుతాలు జరిగాయి. ఎన్నో మార్పులు జరిగాయి. అవన్నీ అనుభవాలుగానే మిగుల్చుకున్నాడు.

ఈ అధికార దర్పం గొప్ప అనుభవాన్ని ఇచ్చింది. ఆ అధికారి అవకాశం వచ్చినపుడు అందరిని అలాగే చేస్తుంటాడని ఆ తరువాత తెలుసుకున్నాడు. చిన్న చిన్న తప్పిదాలకు కూడా ఎగిరిపడుతుంటాడు. అతనెంత గొప్పవాడైనా మాన నష్టం దావా వేయాలన్న అభిప్రాయాన్ని గాంధీ ఉపసంహరించుకోలేదు. గుజరాత్ రాష్ట్రంలో రాజకీయాలు కొన్ని

గాంధీకి తెలియవచ్చాయి. సంస్థానాధిపతులు చెవులు కొరికేవారి మాటలే వింటారు. ఉద్యోగులు కుట్రలు చేస్తుంటారు. తెల్లవారి అధికార దర్పం హద్దు మీరింది. దొరగారి దుబాసీలు కూడా రాజుల్ని శాసిస్తున్నారు.

చిరస్తాదారు అదేదో మహాపదవిలా దాష్టీకం వెలిగిస్తుంటాడు. తెల్లవారిని ఆశ్ర యించిన ఉద్యోగులందరు వారి ఆదాయాల కన్న ఎక్కువగా ఖర్చులు పెట్టు కొంటున్నారు. ఈ రకమైన స్థితి విషవాయువులా గుజరాత్ రాష్ట్రమంతా వ్యాపించి ఉంది. ఒక గుజరాత్‌లో మాత్రమే కాదు. ఆంగ్లేయుల అధికార దర్పం ఈ దేశాన్ని పిశాచంలా పట్టి పీడిస్తోంది. ఈ దేశంలో మనిషికి తప్పనిసరిగా ఉండవలసిన స్వేచ్ఛను అనుభవిస్తూ జీవించడం సాధ్యమేనా! ఉద్యోగుల దురాశలు ఒక వంక దేశాన్ని క్రమ్ముకుంటే, మరో వంక తెల్లవారి విషపుకోరలు అమాయకుల ధన, మాన ప్రాణాలతో చెరలాడుకుంటున్నాయి. ఈ దేశం, ఈ ప్రజల ఈ దుస్థితిని ఇంకెంతకాలం సహించాలి? భరించాలి? నోరు కట్టుకొని పడి వుండాలి. అన్యాయం జరిగినా ఆక్రోశించేందుకు వీల్లేదా? పెదవి కదిపేందుకు అవకాశం కాదా?

గాంధీ మనోగతాలు మంటల్లా చెలరేగాయి. పేదవాని కోపం కడుపుకు చేటని గుర్తుకు వచ్చి అప్పటికి ఈ చెలరేగిన బాధా తరంగాలు తాత్కాలికంగా ఉపశమించాయి. తప్పు చేయకుండా మంచి జరగడమనేది ఊహకు అందకుండా పోయింది. దొరలతో వైరమంటే మాటలు కాదు. పదవిలో లేకుండా ఆ దొరతో పోరాడటం సాధ్యపడదు. పోరుబందరు సంస్థానంలో ఒక ఉద్యోగం ఖాళీగా ఉన్నట్లు తెలుసుకున్నాడు గాంధీ. మేరులు అనే జాతివారికి పన్నును తగ్గించడానికి రాష్ట్ర ఉన్నతాధికారిని కలిసే పని కూడా ఒకటుంది.

అతడు స్వదేశీయుడే కాని దురహంకారం వల్ల తెల్లదొరలను మించిపోయినవాడు. మేరులకు న్యాయం జరగలేదు. పోరుబందరు సంస్థానాధిపతికి కొన్ని అధికారాలు సంపాదించి పెట్టగలిగాడు. మేరుల విషయంలో న్యాయశాస్త్రాన్ని నిశితంగా పరిశీలించి చూచాడు గాంధీ. కొన్ని సెక్షన్‌లు క్షుణ్ణంగా చదివాక దొరగారి మాటే చట్టంగా చెలామణి అవుతుందని అర్థం చేసికొన్నాడు. ఈ దురన్యాయమేమిటి? నోటిమాటలు శాసనాలుగా చెలామణి కావడం ఏమిటి? ఆలోచనలు పొడిగించాక ఆవేశంతో ఉక్కిరి బిక్కిరి కావడం తప్పమరోదారి కనిపించలేదు.

ఇలా ఉయ్యాటన పడుతున్న సమయంలో గాంధీ అన్నగారికి పోరుబందరులో ఉన్న మెమన్ దుకాణందారుల నుంచి ఒక ఉత్తరం వచ్చింది. వారిది చాలా పెద్ద వ్యాపారం

వారికి దక్షిణాఫ్రికాలో కూడా పెద్ద వ్యాపారాలున్నాయి. అక్కడి కోర్టులో వ్యాజ్యం ఒకటి నడుస్తోంది. 40,000 పౌండ్ల ధనానికి సంబంధించిన దావా అది. వారు ఇంతకు మునుపే వకీళ్ళను, బారిష్టర్లను పెట్టుకున్నారు. గాంధీని కూడా అడిగితే ఉపయోగపడతాడని ఆశిస్తూ వారు ఉత్తరం వ్రాశారు.

క్రొత్త దేశంలో క్రొత్త అనుభవాలు సంపాదించుకోవడం అవసరమేనని అన్నగారు భావించారు. అక్కడకు వెళ్ళిన తరువాత ఏ పని చేయాలో గాంధీకి సరిగా తెలియదు. వెళ్ళాలనే కోరిక మాత్రం కలిగింది. దాదా అబ్దుల్లా అండ్ కో లో భాగస్తుడైన సేట్ అబ్దుల్ కరీం జావేరి గారితో పరిచయమైంది. ఆయనకు దక్షిణాఫ్రికా తెల్లవారితో స్నేహ సంబంధాలున్నాయి. అక్కడ జరిగే లావాదేవీలు వ్యవహారాలు అన్ని ఆంగ్లంలోనే జరుగుతాయి. కాబట్టి సర్దుకుపోగలుగుతావని కరీంజావేరి సలహా ఇచ్చాడు.

అక్కడ ఉన్నంతకాలం నీవు నా అతిథిగా ఉండేందుకు వీలు కలిగిస్తాను. నీకు ఖర్చు కూడా ఏమీ ఉండదు. ఒక సంవత్సరం ఉంటే చాలు. ఫస్ట్ క్లాస్ ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేయిస్తాం. 105 పౌన్ల సొమ్ము కూడా ముట్టచెపుతాం అని నచ్చచెప్పాడు. ఇంత కొద్దిమొత్తానికి ఒక బారిష్టరు దక్షిణాఫ్రికా వరకు వెళ్ళడం సరికాదనిపించింది. అంతేగాక కాంట్రాక్టు పనులు ఒప్పుకున్న తర్వాత పని ఎక్కువ చేయాలి. ఇంచుమించు ఊడిగం చేయాలి. క్రొత్త దేశాన్ని సందర్శించడం, క్రొత్త అనుభవాలు సంపాదించడం మినహా ఇందులో ప్రత్యేకమైన లాభాలు ఏమీ ఉండవు అని అర్థమైంది. కాని అన్నగారు 105 పౌన్లు కుటుంబానికి ఉపయోగపడతాయనే ఆశతో వెళ్ళి రమ్మని ప్రోత్సహించారు. గాంధీ తప్పనిసరియై ఒప్పుకున్నాడు. ఇంగ్లాండుకు వెళుతున్నప్పుడు కలిగిన బాధ ఎప్పుడూ కలుగలేదు. అప్పుడు కస్తూరిబా ఒడిలో పిల్లాడితో బితుకు బితుకుమంటోంది. తల్లిదండ్రులు కూడా వున్నారపుడు.

ఇపుడు వారు లేరు. ఇంతకు పూర్వమే సముద్రయానం చేయడంలో చక్కని అనుభవాలు ఉన్నాయి. అపుడు లోకానుభవం లేదు. ఇప్పుడు ఎన్నో అనుభవాలతో రాటుదేలి ఉన్నాడు. ఇంగ్లాండు నుంచి తిరిగి వచ్చిన తరువాత కస్తూరిబాకు చదువు చెప్పాలని ప్రయత్నించాడు. కాని చదువు కొనసాగలేదు. 3 సం॥ల వియోగం తరువాత ఆమెకు మరోసారి కడుపు పండింది. విద్యావతిని చేసే ప్రయత్నం సాగలేదు. సంతానవతిని మాత్రమే చేయగలిగాడు. ఇప్పుడు ఇద్దరు పిల్లలు. గాంధీ అంతరాత్మ ప్రబోధాలను వింటున్నాడిపుడు. తన నడవడికను సునిశితంగా పరిశీలించుకుంటున్నాడు.

కామవాంఛ నుండి బయటపడలేకపోయిన విషయం లోచూపుతో తెలుసుకున్నాడు. ఆమెకు ఉపాధ్యాయుడుగా మారి కొన్ని సంస్కారాలను పొందడంలో శిక్షణ ఇచ్చాడు. ఇంకా ఆమెకు ఎంతో చెప్పాలని ఏదో నేర్పాలని తహ తహ ఉంది. కాని దక్షిణాఫ్రికా వెళ్ళే ప్రయత్నంలో ఆ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశాడు. భార్యావియోగం ఈసారి గాంధీని ఎక్కువగా బాధించలేదు.

ఇంగ్లాండు వెళుతున్నపుడు భర్తృ వియోగమంటే ఏమిటో తెలియని పసివయసులో ఉన్నది కస్తూరి బా. ఇపుడామె ఈ వియోగాన్ని భరించలేక కన్నీరుమున్నీరుగా విలపించింది. ఒక సంవత్సరం తరువాత తిరిగి కలుసుకొనే అవకాశాలను గుర్తు చేసి ఆ ఉత్తమ ఇల్లాలిని ఊరడించాడు గాంధీ.

రాజకోట నుండి బొంబాయికి బయలుదేరాడు. అబ్దుల్లా కంపెనీ వారు టిక్కెట్టు పంపలేదు. మొదటి తరగతి టిక్కెట్టు కోసం ప్రయత్నించినా దొరకలేదు. వెళ్ళదలచుకుంటే ఓడ మీదనే ప్రయాణించాలి. ఫస్ట్ క్లాస్‌లో ప్రయాణం చేయాలన్న కోరికను వదలుకోలేక గాంధీ ఓడలోకి వెళ్ళి ఉన్నతాధికారిని కలిశాడు. మరో ఓడ కోసం ఎదురుచూడాలంటే నెల రోజులు బొంబాయిలోనే ఉండిపోవాలి. అధికారితో ఎలాగైనా ఫస్ట్‌క్లాస్ బెర్తు ఏర్పాటు చేయమని గాంధీ గట్టిగా కోరాడు.

ఆ ఓడలో మొజాంబిక్ గవర్నరు కూడా ప్రయాణం చేస్తున్నాడు. బెర్తులన్ని ఆయనకు ఇచ్చివేశారు. అయినా గాంధీగారి పట్టుదల నుంచి ఓడ అధికారి సంతసించాడు. నా కాబిన్‌లో రెండు బెర్తులు ఉన్నాయి. ఒకటి నాకు, మరొకటి నీకు, అభ్యంతరం లేకపోతే నాతో కలిసి నీవు కూడా రావచ్చు. ఇది ప్రయాణీకులకు ఇచ్చే బెర్తుకాదు. నీ కోసం నేను ఇచ్చిన అవకాశం, కావాలంటే ఉపయోగించుకో అని చెప్పాడు అధికారి.

అది 1893 ఏప్రియల్ నెల. మొట్టమొదటి రేవు పట్టణమైన లాముచేరుకొనడానికి 13రోజులు పట్టింది. దారిలో గాంధీ, కెప్టెన్ కలసి ప్రయాణిస్తున్నందు వల్ల మంచి మిత్రులైపోయారు. కెప్టెన్‌కు చదరంగం అంటే చాలా ఇష్టం. గాంధీకి ఆట చేతగాకపోయినా ఆహ్వానించాడు. తనే నేర్పి అతనితో తీరిక వేళలో ఆడుకోవడం కెప్టెన్‌కు సరదాగా అనిపించింది. ప్రతి రోజు ఓడిపోవడం గాంధీకి తప్పనిసరి. ఈ ఓటమి వలన కెప్టెన్‌కు ఆట మీద ఉత్సాహం పెరిగింది. అతని మాటల వలన గాంధీకి ఆట మీద అభిరుచి పెరిగింది. లాము తీరంలో 3,4 గంటలు ఆగుతుంది ఓడ. అక్కడి సముద్రంలో తుఫానులు సుడులు తిరుగుతుంటాయి. అల్లకల్లోలం ఎక్కువ. రేవు కూడా చాలా చిన్నది. హిందువులు కొందరు అక్కడ పనిచేస్తున్నారు. వారితో సంభాషించి సంతోషించాడు గాంధీ. డెక్

మీద ప్రయాణించేవారు కూడా రేవులో దిగడం వలన వారితో పరిచయం ఏర్పడింది. చిన్న నావ మీద షికారు చేస్తూ వుంటే అది తుఫానులో చిక్కింది.

దానిని ముందుకు కదిలించడం అసాధ్యమైంది. సరిగే అదేసమయంలో ఓడ బయలుదేరుతున్నట్లుగా మొదటి కూత వినిపించింది. ఎంత ప్రయత్నించినా ఎదురుగాలి వల్ల చిన్న నావ ముందుకు కదలలేదు. పెద్ద పడవ ఒకటి అటుగా వెళ్తుంటే చిన్న నావలోని వారు సైగలు చేసి పిలిచారు. పది రూపాయలు సమర్పించుకుని దానిలో చోటు సంపాదించుకున్నాడు. పడవవాడు గాంధీని బలవంతంగా నావలోంచి లాక్కున్నాడు. వారు వచ్చేసరికి ఓడపైకి వెళ్ళే నిచ్చెన తొలగించారు. ఒక మోపు పట్టుకొని పాకుతూ వెళ్ళి ఓడలోకి చేరాడు గాంధీ.

వెంటనే మరల ప్రయాణం ప్రారంభమైంది. గాంధీతో పాటుగా షికారు వెళ్ళిన డెక్ మీది ప్రయాణీకులు అక్కడే చిక్కుబడిపోయారు. ఆ తరువాత 10 రోజుల వరకు ఓడ లేదు. గాంధీ ఒక్కడే అదృష్టాన్ని దక్కించుకొని ప్రయాణాన్ని ముందుకు కొనసాగించాడు. కెప్టెన్‌కు గాంధీ మీద స్నేహభావం. మరొక తెల్లవాడితో కలిసి కెప్టెన్ గాంధీని నీగ్రోలు నివసించే ఒక పేటకు తీసుకుపోయాడు. ఈ వ్యవహారంలో గాంధీ ఎంత నిర్లిప్తుడో అతనికి తెలియదు. వారు ముగ్గురికి మూడు గదులు చూపించారు. గాంధీ వెళ్ళిన గదిలో ఉన్న అమ్మాయిని చూచి సిగ్గుతో  ముడుచుకుపోయాడు. పాపం ఆ అమ్మాయి మనసులో ఏముందో పరమాత్ముడికి ఎరుక. కొంతసేపు వారలా బిగుసుకుపోయి కూర్చున్న తరువాత కెప్టెన్ గాంధీని పిలిచాడు. ఎలా లోనికి వెళ్ళాడో చెక్కుచెదరకుండా అలాగే వెలుపలికి వచ్చాడు గాంధీ. అతడు సిగపువ్వు వాడకుండా తిరిగొచ్చాడని అనుభవజ్ఞుడైన కెప్టెన్ కనిపెట్టేశాడు. నీవేం చేశావని గద్దించి అడిగాడు.

నన్ను కాపాడమని దైవాన్ని ప్రార్థిస్తూ కూర్చున్నాను. అంతకన్నా మరేమీ చేయలేదని బదులు ఇచ్చాడు గాంధీ. కెప్టెన్ ఈ మాటలు విని  పెద్దపెట్టున నవ్వాడు. గదిలోకి వెళ్ళటం కూడా పాపంగానే పరిగణించి ప్రాయశ్చిత్తం చేసుకున్నాడు గాంధీ. మూడవసారి నైతిక పరీక్షలో అతడు పరిపూర్ణమైన విజయాన్ని సాధించాడు. మూడవ పురుషార్థమంటే వ్యభిచరించడం కాదని భగవంతుడే అతనికి బోధించినట్లుగా నమ్మకం కుదుర్చుకున్నాడు.

ఈ సంఘటన తరువాత తాను నైతిక సూత్రాలను గట్టిగా పాటించగలనని అతనిలో ఆత్మ విశ్వాసం పెరిగింది. ఆ రేవులో వారు 7 రోజులు బస చేశారు. గాంధీ ఓడ దిగి వెళ్ళి పట్టణాన్ని సందర్శించి వచ్చాడు. మలబారులో ఉన్నట్లుగా చెట్లతో నిండి ఉంది. ఆ వృక్షాలను, ఆ కొమ్మలకు కాచిన కాయల నిగారింపును చూచి ముగ్ధుడయ్యాడు గాంధీ. జాంజిబార్ చెట్ల వరుసలు అతని మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగించాయి.

బొంబాయి హైస్కూల్‌లో ఉపాధ్యాయ పదవిని తిరస్కరించినది మొదలు పోరు బందరులోని అవమానాల వరకు అన్నింటినీ, ఈ ప్రకృతిని చూచిన సంతోషంలో అతడు మరచిపోయాడు. అతనిలో మరొక మార్పు కూడా వచ్చింది. ఇప్పుడు కేవలం జీవనోపాధికి వెంపర్లాడుతున్న ఒక సాధారణ బారిష్టరు మాత్రమే కాదు. గాంధీ అంతరంగంలో నేత్రాలు విశాలంగా తెరచుకున్నాయి. నైతిక జీవితం తాలుకు ఆలోచనలు అతనిని పూర్తిగా మార్చివేశాయి.

ఒక మహాత్ముడు అతనిలో రూపుదిద్దుకుంటున్నాడు. అప్పటికి ఈ విషయాలేవి బయటి ప్రపంచంలో వారికి, మిత్రులకు, బంధువులకు తెలియవు. పైకి అందరిలాగే వృత్తిలో రాణించాలని ప్రయత్నించి ఒక బారిష్టరు మాత్రమే కనిపిస్తున్నాడు. ఆ తరువాత మజిలీ మొజాంబిక్‌లో, మే నెల ముగియనుంది. ఆ సమయంలో నేటాలు దేశానికి రాజధానియైన డర్బన్ చేరుకున్నారు. దక్షిణాఫ్రికా గాంధీకి  స్వాగతం చెప్పింది.

# 4. పోరాటపటిమ

భారతదేశంలో జన్మించిన మామూలు మనిషిని మహాత్ముడుగా తీర్చిదిద్దిన చోటు దక్షిణాఫ్రికా. సామాన్యుడిని అసమాన్యుడిగా తీర్చిదిద్దినది అక్కడి పరిస్థితులే. పోర్టునేటాల్ నుండి గాంధీని తీసుకు వెళ్ళేందుకు అబ్దుల్లా సేట్‌గారు వచ్చారు.

నేటాల్‌లో చాలామంది తమవారిని వెంటపెట్టుకుపోయేందుకు వచ్చారు. హిందూ దేశస్థులు అంటే అక్కడివారికి చిన్న చూపు. గాంధీ ఆంగ్లభాష ధారాళంగా మాట్లాడగలిగిన స్థితిలో ఉన్నాడు.

అబ్దుల్లాగార్కి ఆంగ్లభాష సరిగా రాదు. గాంధీని చూచి అతని శక్తి సామర్థ్యాలను, యోగ్యతని ఎక్కువగా అంచనా వేశాడు. ఆయన కేసు తాలూకు ప్రతివాదులు ప్రిటోరియావాసులు. గాంధీ కూడా అక్కడే ఉంటే తమ వైపు తిప్పుకుంటారని అబ్దుల్లా సేట్‌కి అనుమానం. ఆయనకు చదువు రాదు. కాని వ్యవహారంలో దిట్ట. అతని వ్యాపారం అక్కడ భారతీయులు చేస్తున్న వ్యాపారాలన్నింటిలోకి పెద్దది.

అబ్దుల్లా సాహచర్యంతో గాంధీ ఇస్లాంమత ప్రమాణాలను తెలుసుకున్నాడు. తన మిత్రులందరినీ ఆయన పరిచయం చేశాడు. కోర్టులో తలపాగా పెట్టుకుని వాదించాలని ప్రయత్నించాడు గాంధీ. జడ్జిగారు అగ్గి మీద గుగ్గిలంలా మండిపడి తలపాగా తీసివేయమని ఆదేశించాడు. ఆ ప్రతిపాదనను తిరస్కరించి కోర్టు నుంచి బయటకు వచ్చాడు గాంధీ. భారతీయులైన మహమ్మదీయులు తలపాగాలు పెట్టుకోవచ్చు. హిందువులు ఎందుకు పెట్టుకోరాదని ప్రశ్నించాడు.

అబ్దుల్లా పరిస్థితిని వివరించాడు. నీచార్థకంతో 'సామి' అనే శబ్దం వాడబడుతుంది. భారతీయుల విషయాలు పట్టించుకునేసరికి గాంధీకి కూలివాళ్ళ బారిష్టరు అనే పేరుబడింది. భారతీయులంటే కూలివాళ్ళనే పేరుంది. పరిస్థితులు చికాకు కలిగించాయి.

తలపాగా పెట్టుకోకూడదు. భారతీయులు టోపీ ధరిస్తూ ఇంగ్లీషువారి దగ్గర పనిచేసే కూలీ అనుకుంటారు. అడుగడుగునా భారతీయులకు అవమానాలే.

హోటళ్ళలోకి వెళ్ళే అర్హత లేదు. ఈ విషయాలను పత్రికలలో వ్యాసాలుగా రచించి రగడ సృష్టించాడు గాంధీ. కొందరు తిట్టారు. కొందరు పొగిడారు. మొత్తం మీద సంచలనం రేగింది.

తలపాగా తీయకుండా తిరుగుతూ ఉండడంతో పొగరుబోతు అనే పేరు కూడా పడింది. భారతీయులలో, కోర్టులలో దుబాసీగా పని చేస్తున్న 'పాల్'గారు రోమన్ కాథలిక్. అతనితోను మరికొందరు ప్రొటెస్టెంట్స్‌తోను, పారశీ రుస్తుంగారితోను, మియాఖాన్‌తోను పరిచయం ఏర్పడింది. పరిచితుల సంఖ్య పెరిగిపోయింది.

అబ్దుల్లాగారి నుండి ప్రిటోరియా వెళ్ళమనే సందేశం వచ్చింది. గాంధీ జాంజిబార్ వెళ్ళి కొద్ది రోజుల అక్కడ ఉన్నాడు. తరువాత ప్రిటోరియా ప్రయాణమయ్యాడు. ఏర్పాట్లన్నీ బాగానే జరిగాయి. ప్రతివాదులతో కలిసి ఉండడమే మంచిదని అబ్దుల్లాగారిని ఒప్పించాడు. రాజీద్వారా కోర్టు బయట వివాదాన్ని పరిష్కరించాలని గాంధీ అభిప్రాయం. ఈ విషయంలో పొరపాటు పడనని అబ్దుల్లాగార్కి చెప్పి ఒప్పించగలిగాడు. మొదటి తరగతిలో ప్రయాణానికి ఏర్పాటు అయింది. మరీ పిసినిగొట్టుగా ఉండవలసిన పని లేదని అల్లా దయ వల్ల ఖర్చు పెట్టే శక్తి ఉన్నదని అబ్దుల్లాగారే గాంధీకి చెప్పాడు. ప్రిటోరియాలో తన మనుషులందరికీ గాంధీ రాకను తంతి ద్వారా తెలియపరిచాడు. రైల్లో ప్రయాణం చేస్తున్న గాంధీకి చాలా చేదు అనుభవం ఒకటి ఎదురయింది.

గాంధీ ఎక్కిన తర్వాత అదే బోగీలోకి మరొక ప్రయాణీకుడు కూడా ఎక్కాడు. ఒక నల్లవాడు తనతోపాటుగా ప్రయాణం చేయడం సహించలేక ఇద్దరిని తోడు తెచ్చుకున్నాడు. ఒక ఉద్యోగి వచ్చి నీవు ఈ పెట్టెలో ప్రయాణించకూడదు. లేచి వెళ్ళి వెనుక పెట్టెలోకి కూర్చోమని గద్దించాడు. గాంధీ తన వద్దనున్న మొదటి తరగతి టిక్కెట్టు తీసి చూపించాడు. పోలీసును పిలిచి గాంధీని బలవంతంగా రైలులోంచి దించారు. వెనుక పెట్టెలో వెళ్లేందుకు నిరాకరించి గాంధీ విశ్రాంతి గదిలోకి వెళ్ళాడు. తెల్లవారు విసిరికొట్టిన సామాను ప్లాట్‌ఫారం మీదనే చిందరవందరగా పడి ఉంది. రైల్వే పోలీసులు కనిపెట్టే ఉన్నారు. అది పర్వత ప్రాంతం. శీతాకాలం చలి వణికిస్తుంది. ఓవర్‌కోటు తొడుక్కోవాలంటే అది పెట్టెలో ఉండిపోయింది. ఇక్కడ నోరు మూసుకుపోవాలా! పోరాట పటిమ చూపించాలా! అని ఆలోచనలో పడ్డాడు.

ఇతర హిందువులు అక్కడ పడుతున్న కష్టాలు తలచుకుంటే ఇవి చాలా చిన్నవే అనిపించింది. మొత్తం రోగాన్ని తగ్గించడానికి కృషి చేయాలనిపించింది. తర్వాత రైలులో

ప్రిటోరియా వెళ్ళడానికి నిర్ణయించాడు. అబ్దుల్లాగారి ద్వారా సాయం అందింది. అతడు పంపిన మనుషులు వచ్చి గాంధీకి సాయం చేశారు. అలాంటి కథలు, అవమానాలు హిందువులకు నిత్యకృత్యమేనని తేల్చి చెప్పారు. అవమానాలు పడేందుకు సిద్ధంగా ఉంటేనే దక్షిణాఫ్రికాలో ఉనికి. చార్లెస్‌టౌన్‌లో దిగి జోహాన్స్‌బర్గ్‌కు గుర్రపు బండిమీద బయలుదేరాడు. బండిలో కూడా తెల్లవారితో పాటు స్థానం దొరకలేదు. అవమానాలు, అన్యాయాలు సహించి, భరించి, దిగమ్రింగి మాత్రమే భారతీయులు బ్రతుకగలరు.

బండిలో ప్రయాణిస్తుండగా బండి అధికారికి సిగరెట్టు కాల్చుకోవాలనిపించింది. గాంధీని బండితోలేవాడి కాలి వద్ద కూర్చోమన్నాడు. లోపలకు వెళ్ళి అతను ఖాళీ చేసిన సీట్లో కూర్చునేందుకు గాంధీ వొప్పుకున్నాడు. ఎప్పుడైతే తెల్లవాడి సీట్లో కూర్చుంటానని నల్లగాంధి అన్నాడో వెంటనే తెల్లవాడు గాంధీగారి చెంపమీద దెబ్బకొట్టాడు. గాంధీ చెయ్యి పట్టుకొని క్రిందికి తోసేశాడు. గాంధీ శారీరకంగా దుర్బలుడు, అతడేమో బలవంతుడు. క్రిందికి తోసివేసినా చువ్వలు పట్టుకొని వేలాడాలని నిశ్చయించుకున్నాడు. తెల్లవాడు నానా దుర్భాషలాడాడు. చూచే ప్రయాణీకులకు మనసు కరిగించిన దృశ్యమిది. అతని సేవకుడిని గోనెసంచి మీద కూర్చుండబెట్టి ఆ స్థానంలో గాంధీని కూర్చోమన్నారు. అక్కడ కూర్చొని సాయం అందించమని దేవుడిని ప్రార్థించాడు గాంధీ. "స్టాండర్టన్"లో హిందూ ముఖాలు కనిపించిన తర్వాత గుండెదడ కొద్దిగా తగ్గింది. వారు అబ్దుల్లా పంపించిన మనుషులే.

బండిలో జరిగిన కథ విని వారి కష్టాలను ఏకరువు పెట్టడం ప్రారంభించారు. అక్కడ నుండి మరో బండిలో ప్రయాణానికి ఏర్పాటు జరిగింది. సేఠ్‌గారి నౌకరు వచ్చి మంచి సీట్లో కూర్చుండబెట్టి వెళ్ళాడు. ఎట్టకేలకు రాత్రి సమయానికి 'జోహాన్స్‌బర్గ్' చేరుకున్నాడు గాంధీ.

కమరుద్దీన్ స్వాగతం పలికాడు. నేషనల్ హోటల్‌లో దిగేందుకు గది ఇవ్వడానికి తిరస్కరించారు. కమరుద్దీన్‌గారి దుకాణంలోనే మర్యాద ఆదరణ లభించాయి. హోటల్ ప్రవేశం దొరుకుతుందని ఆశించిన గాంధీ అమాయకత్వానికి వారంతా నవ్వుకున్నారు.

గతిలేనివాళ్ళు తప్ప భారతీయులెవరూ దక్షిణాఫ్రికాలో ఉండరని వారు తీర్మానించి చెప్పారు. మొదటి తరగతిలో ప్రయాణం చేయాలనే పట్టుదల గాంధీలో బలీయమైంది. జోహాన్స్‌బర్గ్ నుండి ప్రిటోరియాకు మొదటి తరగతి టిక్కెట్ల కోసం బారిష్టరు వేషంలో తయారై రైల్వేస్టేషన్‌కు వెళ్ళాడు. ఈసారి స్టేషను మాస్టర్ దారిలో ఎవరైనా దిగిపొమ్మంటే తన బాధ్యత లేదని షరతు పెట్టి టిక్కెట్టు ఇచ్చాడు. ఇదొక విజయమే. అందరికీ ఆశ్చర్యంగానే

ఉంది. గార్డు కాకపోయినా తెల్లజాతి ప్రయాణీకులు సగంలో దింపేస్తారనే అనుమానం కూడా ఉంది.

అనుకున్నట్లుగానే గార్డు మండిపడ్డాడు. మూడవ తరగతిలోకి వెళ్ళి కూర్చోమని వేలుచూసి గద్దించాడు. ఈసారి మరో తెల్లవాడు మద్దతుగా నిలిచాడు. ఆయన బారిష్టరు, ఎందుకు ఇబ్బంది పెట్టడం అన్నాడు. తన ప్రక్కనే కూర్చుంటాడని తనకు అభ్యంతరం లేదని ఆ పెద్దమనిషి చెప్పాడు.

కూలివాడితో కలిసి కూర్చునేందకు నీకు ఇబ్బంది లేకపోతే నాకేమిటి బాధ అనుకుంటూ గార్డు వెళ్ళిపోయాడు. ఆ రాత్రికి చీకటి పడి ప్రిటోరియా చేరుకున్నాడు.

ఆదివారం కావడం వల్ల దీపాలు మసకగా ఉన్నాయి. హోటల్ బస దొరకదు. ఈ పరిస్థితిని వివరిస్తూ ఉండగా స్టేషన్ మాస్టర్ నిస్సహాయతను తెలియజేశాడు. అది విన్న ఒక నీగ్రో యువకుడు అమెరికా జాతీయుని ఆధ్వర్యంలో నడుస్తున్న ఒక హోటల్లో బస కల్పిస్తానని హామీ ఇచ్చాడు.

'జాన్స్టన్' హోటల్లో అంతంత మాత్రపు బస దొరికింది. ముందు అందరితో కలిసి భోజనం చేసేందుకు అభ్యంతరం చెప్పినా, ఆ తర్వాత కథ సుఖాంతమయింది. అందరి మధ్య కూర్చొని తృప్తిగా భోజనం చేశాడు. మరునాడు ఉదయమే లేచి కార్యరంగం లోకి దిగాడు. అబ్దుల్లాగారి వకీలు పేరు బెకర్ మహాశయుడు. గాంధీకి మంచి ఉన్నతమైన మర్యాదలు చేశాడు. సేఠ్‌గారి కేసు విషయంలో చేయవలసినది అంతా ఇంతకు పూర్వమే నియమించిన వకీళ్లు చేస్తున్నారని చెప్పాడు. ఇతర కేసుల విషయంలో అవకాశం కల్పించాడు. రొట్టెలు అమ్ముకుంటూ బ్రతికే ఒక పేదరాలికి ఆశ్రయం కల్పించాడు. ముప్పయి అయిదు షిల్లింగులు తీసుకొని వారంపాటు భోజనం ఏర్పాటు చేయడానికి ఆమె ఒప్పుకుంది. బెకర్ మహాశయుడు మతబోధ కూడాచేస్తాడు. బాగా ఆర్జించుకున్న సంపన్నుడు. పుట్టుక చేత అతడు హిందువేగానీ హిందూమతం గురించి ఏమీ తెలియనివాడు. ఇతర మతాలను గురించి అసలే తెలియదు.

రంగు తెగులు అతనికి లేదు. కోర్టు విషయాలే కాక ప్రతిరోజూ ఒక గంటసేపు అతనితో మతపరమైన చర్చలు చేసేవాడు గాంధీ. ఇద్దరూ కలిసి ప్రార్థనలు చేసేవారు.

అబ్దుల్లాగారి స్నేహితుడు మరొకడు భారతీయుల కష్టాలను వివరించి అండగా నిలుస్తానని వాగ్దానం చేశాడు. తరువాత గాంధీగారికి మరికొంతమంది క్రైస్తవులతో పరిచయాలు అయ్యాయి. 'హారీస్', 'గాబ్' అనే స్నేహితులు గాంధీని ఒకరోజు సాయంత్రం

టీకి పిల్చారు. వారిద్దరూ ప్రౌఢ వనితలు. 'కీట్స్' అనే మరొక సహృదయునితో కూడా స్నేహము, షికార్లు చేస్తుండేవాడు.

గాంధీగారి మెడలో ఉన్న తులసిమాలను తెంచి పారేయమని ఒకసారి అర్థించాడు.

"ఇది మా అమ్మగారిచ్చిన వరదానం" అంటూ తప్పుకున్నాడు గాంధీ. కీట్స్ పాపభీతి కలవాడు. నిర్మలమైన మనిషి, సాధన వల్ల హృదయం పరిశుద్ధమవుతుందని అతని నమ్మకం. చాలామంది మిత్రులను గాంధీకి పరిచయం చేసి ప్రోత్సహించడమే కాకుండా అండగా నిలిచాడు.

ప్రిటోరియాలో భారతీయులందరితో పరిచయాలు పెంచుకోవాలని ఉత్సాహపడ్డాడు గాంధీజీ. హాజీఖాన్ పరిచయం సంపాదించాడు. మేమన్ వర్తకులు ఏర్పాటు చేసిన సభలో మొట్టమొదటిసారి బిడియాన్ని విడిచిపెట్టి ఉపన్యాసం చెప్పాడు గాంధీ.

ముందుగా వ్రాసి తయారు చేసుకున్న ఆ ఉపన్యాసంలో సమస్య యొక్క పరిధులు దాటి నైతిక అంశాల జోలికి వెళ్ళడం కూడా జరిగింది. అందరూ అతనికి తమ కష్టాలు చెప్పుకున్నారు. వారికి ఉచితంగా ఇంగ్లీషు నేర్పుతానని హామీ ఇచ్చాడు గాంధీ.

ఈ సభ వల్ల చాలా ఉపయోగం జరిగింది. ప్రిటోరియా పరిసర ప్రాంతాలలో ప్రతి భారతీయునితోను పరిచయం ఏర్పడింది. రైల్వే పనివారి విషయమై, అధికారులతో చర్చించాడు. సాంఘిక, రాజకీయ రంగాలలో అక్కడి భారతీయుల సమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకున్నాడు.

బానిస వృత్తులు, సేవక వృత్తులకు తప్ప భారతీయులు ఎందుకూ పనికిరాని స్థితిలో ఆ దేశంలో బ్రతుకులను వెళ్లదీస్తున్నారు.

ట్రాన్స్‌వాల్‌లో ప్రవేశించాలంటే భారతీయులు సుంకం చెల్లించాలి. భూములు సంపాదించినా వాటిమీద హక్కు ఉండదు. రాత్రి 9 గం॥ల తర్వాత భారతీయులు బయట తిరుగకూడదు.

రోడ్డు మీద పగలైనా నడవకూడదు. అలా వెళ్ళాలంటే భారతీయులు అరబ్బులమని చెప్పుకోవాలి. డాక్టర్ క్రౌజ్‌గారితో గాంధీకి పరిచయం ఏర్పడింది. ఆయన సోదరుడుకు ఒక కేసులో ఏడు సంవత్సరాల కారాగార వాస శిక్ష పడింది.

ప్రిటోరియా ప్రెసిడెంట్ 'క్రోగర్' దొరగారు. పోలీసులు ఆ ఇంటిని కాపలా కాస్తుంటారు. వారి ప్రక్క నుంచే దగ్గరలో వున్న మైదానానికి షికారుకు వెళ్తున్నాడు గాంధీ. ఒకరోజు ఒక పోలీసు హఠాత్తుగా అతని మీదకు దుమికి కొట్టి, తిట్టి, నెట్టివేశాడు.

గుర్రం మీద అటుగా వస్తున్న కీట్స్ దొర ఇది చూచి, అతని మీద కేసు పెట్టమన్నాడు. అందుకు గాంధీ తిరస్కరించాడు. ఇది విని పోలీసు వచ్చి డచ్చి భాషలో స్వచ్ఛందంగా క్షమాపణలు కోరాడు.

దెబ్బలకు భయపడి ఆ తరువాత గాంధీ అటువైపుగా షికారుకు వెళ్ళడం మానేశాడు. భారతీయుల దుస్థితి గురించి కూలంకషంగా ఆలోచించడం మొదలుపెట్టాడు. మొత్తం సమస్యను పరిష్కరించడానికి, ఆత్మగౌరవం నిలుపుకోవడానికి ఒక పెద్ద వ్యాజ్యం నిర్వహించాలని ఆలోచించాడు. వెంటనే కార్యరంగంలోకి ఉరికాడు. ఈ వ్యాజ్యం అయిపోగానే ఇంటికి వెళ్ళాలని కోరిక!

కాని విధి నిర్ణయం మరొకలాగా ఉంది.

ప్రిటోరియాలో గాంధీ పూర్తిగా ఒక సంవత్సరం ఉన్నాడు. అక్కడి పరిస్థితులు, భారతీయుల కష్టాలు చూచి ప్రజాసేవ చేయాలనే ఆలోచన మొదటిసారిగా కలిగింది. ప్లీడరు వృత్తిలో ఉండే కిటుకులు అక్కడే అతనికి అర్థమయినాయి. అతని జీవితంలో ఆ సంవత్సరం అమూల్యమయినది.

అబ్దుల్లా సేఠ్‌గారి దావా చాలా పెద్దది. నలభై వేల పౌండ్లు అంటే ఇంచుమించుగా ఆరు లక్షల రూపాయలు. ఎన్నో చిక్కు సమస్యలు ముడిపడి ఉన్నాయి. గాంధీకి సరిపడని లెక్కల గొడవలు ఉన్నాయి. వాది ప్రతివాది ఇద్దరూ ఉద్దండులే! ఇద్దరికి సామర్థ్యం కలిగిన వకీళ్ళు ఉన్నారు. ఈ కేసులో కీలకమయిన స్థానం గాంధీకి ఇవ్వబడింది.

వాది మాట్లాడవలసినది అంతా సిద్ధపరిచేవాడు. దానిని సంబంధిత అధికారులకు అందించేవాడు. ఇంతేకాకుండా వాదికి అనుకూలంగా ఉపయోగపడే కేసు రహస్యాలను పరిశోధించే పని కూడ గాంధీకి అప్పగించబడింది.

ఈ విషయ పరిశీలనలో ఉండగానే అతని కన్నులు విచ్చుకున్నాయి. అతడు సేకరించిన విషయాలతో సొలిసిటరు, బారిష్టరు బాగా సంపాదించుకుంటున్నారు. సంపాదన సంగతి ఎలా ఉన్నా కేసుల విషయంలో పనికొచ్చే అంశాలను సంపాదించగలను అతని అతనికి అర్థమయింది. భవిష్యత్తు మీద ఆశ ఏర్పడింది.

ఈ ప్రోత్సహకరమయిన మలుపు వల్ల అతనికి వకీలు వృత్తి మీద ఆసక్తి అధికమయింది. లియోనార్డు అనే పెద్ద ప్లీడరుగారితో ఒక కేసు విషయంలో పరిచయమయింది.

న్యాయానికి చట్టానికి జరిగిన పోరాటం అది.

ఆ కేసులో వాది పక్షాన ధర్మం, న్యాయం ఉన్నాయి.

అయితే చట్టం అతనికి వ్యతిరేకంగా ఉంది.

సహజంగా అప్పటికే నైతికతా సూత్రాల మీద, నైతిక జీవితం మీద అద్భుత ప్రయోగాలు చేస్తున్నాడు గాంధీ. చట్టవ్యతిరేకంగా ఉన్నా న్యాయం అతని పక్షాన ఉన్నది కాబట్టి ఈ వాదిని గెలిపించి తీరాలని మనసులో తీర్మానించుకున్నాడు.

ఈ విషయమై లియోనార్డుతో చర్చించాడు. వాస్తవాన్ని ఆయన ముందుంచాడు. అంతా విన్న తరువాత లియోనార్డు గాంధీని ప్రోత్సహించాడు న్యాయవాది తరఫున ఉన్నది.

చట్టం వ్యతిరేకంగా ఉన్నా అతడు గెలిచే అవకాశాలు ఎక్కడో ఉండే ఉంటాయి. శ్రద్ధగా పరిశీలిస్తే దొరుకుతాయి. ధర్మం జయించి తీరుతుంది. అయితే గట్టి కృషి చేయాలని అని సలహా ఇచ్చాడు. ఆయన ఇచ్చిన సలహా ప్రకారం చాలా కష్టపడి ఆ కేసును గెలిపించాడు. చట్టం ధర్మాన్ని అనుసరిస్తుంది. ధర్మం అనే దానికి అజేయమైన శక్తి ఉంటుంది అని గ్రహించాడు. మనసులో ఇంతకు మునుపే ఉన్న ధర్మదీక్ష బాగా బలపడింది. ఈ సమయంలో వ్యాజ్యాలకు సంబంధించి మరొక గొప్ప అనుభవం ఎదురు అయింది గాంధీకి! అది దాదా అబ్దుల్లా సేఠ్ కేసు. ప్రతివాది తాయబ్ సేఠ్! రాజీ మార్గంలో ఈ కేసుని పరిష్కరించితే బాగుంటుంది అని భావించాడు గాంధీ!

వాది ప్రతివాదులు ఇద్దరూ బలవంతులు. ధనవంతులు. ఈ కేసును మలుపు త్రిప్పి పరిష్కారానికి తీసుకు రాగలిగితే వృత్తిలో అద్భుతమయిన పురోగమనం దొరుకుతుంది. గాంధీ కేసు పరిష్కారం విషయమై తీవ్ర ప్రయత్నాలు చేశాడు. కోర్టు లోపలకన్నా కోర్టు వెలుపలే పరిష్కారానికి ఎక్కువ అవకాశం ఉంటుందని నమ్మాడు. ప్రతివాది తాయమ్ సేఠ్ చాలా మొండిఘటం. అతడూ గుజరాతీయుడే! లెక్కలు అన్నీ గుజరాతీలో అప్పగించేవాడు. వాటిని ఆంగ్లంలోకి అనువదించే పని గాంధీ మీద పడింది.

దాదా అబ్దుల్లా వాది. తాయబ్ సేఠ్ ప్రతివాది. వారి మధ్య వారధి గాంధీ చిత్తశుద్ధితో ఏకాగ్రత కలిగి కష్టపడి పనిచేస్తే సాధించలేనిది లేదని నమ్మేవాడు. వారిద్దరికి సమానంగా వర్తించే ఒక అంశాన్ని ముందు లేవనెత్తి ఒప్పించాడు గాంధీ. అది ఖర్చుల విషయం. కోర్టు ఫీజు రెగ్యులేషన్‌ల ప్రకారం వారుభయులు చాలా మొత్తాన్ని ఖర్చు పెడుతున్నారు. ఈ మొత్తం వారు సొలిసిటర్లు, వకీళ్లు, బారిష్టర్‌లకు చెల్లించే దానికన్నా చాలా ఎక్కువ మొత్తం కనుక కోర్టు లోపల సాక్షుల మచ్చుల నాలుకల మీద ఆధారపడి కేసుని జటిలం చేసుకోవడం అనవసరమని ఉభయులని ఒప్పించగలిగాడు గాంధీ. ఈ పురోగమనం సాగించాక కేసు చకచక ముందుకు సాగింది. పెద్ద మనుషులయిన లాయర్లే కేసులోని

అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. కోర్టులో ఏమి జరుగుతుందో సలహా చెప్పాలి. దానిని ఇరువురూ ఆచరించాలి!

అలా మధ్యవర్తుల ద్వారా కేసు పరిష్కారం కనుగొనటానికి ఉభయులను ఒప్పించ గలిగాడు. ఇందుకోసం చాలా తంటాలు పడాల్సి వచ్చింది. అయినా సంతోషంగా చేశాడు.

ఆ విధంగా మధ్యవర్తులు కేసుకి పరిష్కార మార్గాలను సూచించారు. కోర్టులో కాలయాపన, వాది ప్రతివాదుల మధ్య అపార్థాలు, విపరీత ఖర్చులు తప్పాయి వారికి. తిరిగి మధ్యవర్తుల సలహాలకు అనుకూలంగా సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

ఏ విధమయిన ఒత్తిడి లేకుండా సులభంగా తీర్పు వచ్చేసింది. గాంధీని దక్షిణ ఆఫ్రికా తీసుకు వచ్చిన దాదా అబ్దుల్లా సేఠ్ కేసులో గెలిచాడు. తాయబ్ సేఠ్ అతనికి ముప్పయి ఏడు వేల పౌండ్లు చెల్లించాలి. వ్యవహారమయితే గాంధీ వేసిన పథకంతో సులభంగా తేలిపోయింది. కాని తాయబ్ సేఠ్ అంత పెద్ద మొత్తాన్ని ఒక్కసారిగా చెల్లించలేడు. గుజరాతీ వ్యాపారులు దివాళా తీయటకం కన్నా మరణించడం మేలు అని నమ్ముతారు. అటువంటిది జరిగితే ఆ ఘోరకలి అంతా గాంధీ వల్ల జరిగినట్లే అవుతుంది. గాంధీ చాలా కలవరపడిపోయాడు. కేసు పరిష్కారము అయితే చిక్కింది. కాని గాంధీకి సమస్య జటిలమయినట్లుగా అనిపించంది. కేసు పరిష్కారానికి ఎన్ని తంటాలు పడ్డాడో ఈ పాపం జరుగకుండా చూడటానికి ఇంకా ఎక్కువ తంటాలు పడాల్సి వచ్చింది. నిద్రాహారాలు మాని చాకిరీ చెయ్యాల్సి వచ్చింది. తన కర్తవ్యాన్ని శ్రమకోర్చి హృదయపూర్తిగా నిర్వహించాడు గాంధీ. ఎట్టకేలకు సుదీర్ఘమయిన వాయిదాల పద్ధతిలో మొత్తాన్ని చెల్లించే విధంగా దాదా అబ్దుల్లాని ఒప్పించాడు. ఆత్మహత్య చేసుకోవాల్సిన స్థితి నుంచి బయటపడ్డాడు తాయబ్. ఈ విధంగా గాంధీ ఏ కేసు విషయమై దక్షిణాఫ్రికా వచ్చాడో, ఆ కేసుని పూర్తిగా సాధించాడు. అంతకు మునుపు నియమింపబడిన ఎంతోమంది సొలిసిటర్లు, బారిష్టర్లు, వకీళ్ళు చేయలేని పని అతడు చేయగలిగాడు. ఈ తీర్పుతో సత్యదర్శనం చేశాడు. గాంధీకి ఆత్మవిశ్వాసం అధికమయింది.

ఆ తరువాత రెండు దశాబ్దాలలో వందలు వేల కేసుల్ని ఖర్చులు అధికం కాకుండా, ఒత్తిడులు లేకుండా కోర్టు బయటే పరిష్కరించాడు. వాది ప్రతివాదుల మధ్య సయోధ్య నెలకొల్పాడు.

ఇలా చేయటం వల్ల వకీళ్ళకు ఆదాయం తగ్గదని చెప్పాడు. ధనమ మాత్రమే కాక అదనంగా ఆత్మతృప్తి కూడా కలుగుతుందని మిత్రులందరికీ మార్గదర్శకంగా నిరూపించాడు.

ఈ వకీలు వాది ప్రతివాదులకు మానసిక ఒత్తిడి లేకుండా కేసులు పరిష్కారం చేయగలడు. పట్టిందల్లా బంగారం చేయగలడు అనే పేరు పడిపోయింది. ప్రతిష్ట ఇనుమడించింది.

చాలామంది స్నేహితులు వెతుక్కుంటూ వచ్చి కలిశారు. క్రైస్తవ మతం పాటించే మిత్రులతో సాన్నిహిత్యం పెరిగింది. వారంతా సిద్ధాంత చర్చల్లో, నైతిక సూత్రాల విషయంలో గాంధీ ఉద్ధండుడు అని గ్రహించారు.

క్రైస్తవ మతాన్ని అర్థం చేసుకుని సిద్ధాంతాలు చదివి మిత్రులతో చర్చించిన తరువాత హిందూ మతం మీద విశ్వాసం పెరిగింది. ప్రిటోరియాలో పలుకుబడి హెచ్చింది. ఎలాగైతేనేం వచ్చిన పని పూర్తయింది. తన క్లైంట్ అబ్దుల్లా కేసు గెలిచాడు.

దక్షిణాఫ్రికా నుండి తిరిగి వెళ్ళిపోవాలనే ప్రయత్నం మొదలుపెట్టాడు గాంధీ. ఇంత సాధించిన మనిషిని ఊరికే ఎలా పంపుతారు? దాదా అబ్దుల్లా సేఠ్ వీడ్కోలు విందు, సన్మాన సభ ఏర్పాటు చేశాడు. ఆ రోజంతా భారతీయులతో కలిసి విందు వినోదాలతో కాలక్షేపం చెయ్యాలని నిర్ణయం.

ఎక్కువగా మాట్లాడటం అలవాటు లేని గాంధీ ఓ కుర్చీలో కూర్చుని పత్రికలు తిరగవేయడం ప్రారంభించాడు. విధి విచిత్రమైనది. గాంధీకి ఓ పత్రికలో ఓ వార్త కనిపించింది. అది ఆయనను బాగా ఆకర్షించింది. శీర్షిక పేరు "ఇండియన్ ఫ్రాంఛైజ్".

నేటాల్ శాసనసభలో ఒక చర్చ కొనసాగుతోంది. భారతీయులకు హక్కులు లేకుండా చేసే బిల్లు వివరాలు దానిలో ఉన్నాయి. అక్కడ చేరిన భారతీయులకు అబ్దుల్లాతో సహా ఆ బిల్లు గురించి ఏమీ తెలియదు. గాంధీ ఆ చట్టాన్ని మిగిలిన వారితో వివరించి చెప్పాడు. చాలాసేపు చర్చ కొనసాగింది.

ఇట్లాంటి వ్యవహారాలు ఇదివరలో జరిగాయి. భారతీయుల కలకలం రేపినా లాభం ఉండదు. ఎవరికి వారే ఈ విషయంలో తమ అసమర్థతను తెలియచేశారు.

ఆంగ్లేయ వకీళ్లు చెప్పినట్లు వినడమే వాళ్ళ కర్తవ్యం అని అనుకుంటున్నారు. భారతీయ క్రిష్టియన్లు ఇంగ్లీషువారితో కలిసిపోతారు. వారి దగ్గర బానిసత్వం చేస్తారు. మిగిలినవారికి ఈ చట్టం వచ్చాక అంతులేని బాధలు మొదలవుతాయి.

దక్షిణాఫ్రికాలో భారతజాతిని పూర్తిగా తుడిచిపెట్టే కుతంత్రం ఇది. గాంధీ ఈ విషయమై చాలా నొచ్చుకున్నాడు. భారతీయుల పేర్లు ఓటర్ల జాబితాలోకి చేరాలి. అంతేకాకుండా దక్షిణాఫ్రికాలో ఉన్న భారతీయులు తమ ఓటు విలువను గుర్తించాలి.

ఇలాంటివే చాలా విషయాలు అక్కడ చేరినవారికి వివరించాడు గాంధీ. వారికి శాసనాలు, చట్టాలు అర్థం చేసుకునే శక్తి లేదు.

ఒక మిత్రుడు గాంధీని ప్రయాణం మానుకోమని అడిగాడు. అందరూ అవునంటే అవునన్నారు. ఈ విషయాలేవీ తమకు తెలియవు కనుక అతడే ఉండి అన్నీ చూచుకోవాలని అర్థించాడు. గాంధీ చెప్పినట్లు నడుచుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ అంగీకారాన్ని తెలిపారు.

అతని ప్రయాణం ఆపించమని దాదా అబ్దుల్లా సేఠ్‌ను కోరారు. "గాంధీని నేను తీసుకు వచ్చిన పని ముగిసింది. ఇప్పుడు ఆయన నా ఒక్కడికే వకీలు కాదు. దక్షిణాఫ్రికాలో ఉన్న భారతీయులందరికీ వకీలు. అంతేకాకుండా ఆయన ఇక్కడ బారిష్టరీ చేయడానికి మనం ధనాన్ని కూడా సమకూర్చాలి కదా! డబ్బు కాక మనుషుల అండదండలు కూడా ఉంటే కాని, ఇలాంటి పనులు చేయజాలరు. మీరందరూ ఆయన వెనుక నిలబడతామంటే నాకేమీ అభ్యంతరం లేదు" అని చెప్పాడు సేఠ్.

గాంధీ ఈ మాటలువిని నేను చేయబోతున్నది ప్రజా సేవ కనుక నాకు ఫీజు ఇవ్వవలసిన పనిలేదు అన్నాడు. మనుషులు అండగా నిలిస్తే చాలన్నాడు. మీరందరూ సాయంగా నిలబడతాం అంటేనే ఈ ప్రయత్నం కొనసాగించగలనని చెప్పాడు. ఖర్చులకు మాత్రం డబ్బు ఇవ్వాల్సి ఉంటుందన్నాడు.

'లా' గ్రంథాలు సేకరించాల్సి వుంటుందని వివరించాడు. గాంధీ చెప్పిన మాటల న్నింటికి అక్కడివారు అంగీకరించారు. తన పోరాటపటిమను ప్రదర్శించడానికి సమయం ఆసన్నమైనది గుర్తించారు.

ఇక దక్షిణ ఆఫ్రికాలో సమరశంఖం పూరించాలి. ఆత్మగౌరవనినాదం ప్రతిధ్వనించాలి. భారతీయులు పోరాట పటిమను ప్రదర్శించాలి. ప్రయాణం వాయిదా వేసుకుంటానని గాంధీ ఒప్పుకున్నాడు. ఓటరు జాబితాలలో ఉన్న పేర్లను ముందుగా తెలుసుకున్నాడు.

1893 సం॥ హాజీ మహమ్మద్ నేటాల్ రాష్ట్రంలో నాయకుడు. ప్రజాసేవలో ప్రముఖుడు. ఆయనను పిలిచి అబ్దుల్లా సేఠ్ ఇంటిలో ఒక సభను ఏర్పాటుచేశారు. ఫ్రాంచైజ్ బిల్‌ను ప్రతిఘటించాలని ఆ సభలో తీర్మానించారు. ఇది గాంధీ ప్రప్రథమ శాసనోల్లంఘన కార్యక్రమం.

వాలంటీర్ దళాలు ఏర్పడ్డాయి. డర్బన్ కోర్టులో 'పాల్'గారు దుబాసీగా పనిచేస్తున్నాడు. అనేకమంది అధికారులు, క్రైస్తవులు వచ్చారు. వారంతా వాలంటీర్ దళాలలోచేరారు.

వ్యాపారులు కూడా చేరారు. అందరికి ఉపయుక్తమైన కార్యక్రమం పట్ల విశ్వాసంతో ఉంటామని చప్పట్లు కొట్టారు.

పార్శీలు, మహమ్మదీయులు, దక్షిణాది భారతీయులు, చాలామంది ఉన్నారు. ప్రతిఘటన ఉద్యమం నడిపించలేకపోతే బిల్లును పరోక్షంగా ఒప్పుకున్నట్లు అవుతుందని అందరూ కలిసి ప్రతిపాదించారు. వెంటనే నేటాల్ అధికారుల సాయంతో బిల్లు ఆపించమని అసెంబ్లీ ప్రెసిడెంట్‌కు తంతివార్త పంపించారు.

ప్రధానమంత్రి సర్‌జాన్‌రాబిన్సన్ గారికి కూడా తంతి ఇచ్చారు. దానికి సమాధానంగా రెండు రోజులు బిల్లు ఆపుతున్నట్లు అసెంబ్లీ అధికారుల నుంచి వార్త అందింది. శాసనసభకు పిటీషన్లు తయారు చేసి వాని నకళ్ళ మీద సంతకాలు పెట్టించి పత్రికలకు కూడా ఇచ్చారు.

అర్జీలు వెళ్ళిపోయాయి. పత్రికలు వారి అభిప్రాయాలను కలుపుతూ ఈ వార్తను ప్రకటించాయి. శాసనసభలో దాని మీద చర్చ జరిగింది. బిల్లును సమర్థించేవారు పిటీషనర్లకు సమాధానం చెప్పారు.

చర్చ తరువాత భారతీయులకు స్వప్నభంగం చేస్తూ బిల్లు నెగ్గింది. ఇటువంటి బిల్లులు గతంలో చాలా నెగ్గాయి. అసెంబ్లీలో అటువంటి చర్చ జరుగుతున్న సంగతి భారతీయులకు తెలియదు. ఇప్పుడు పరిస్థితి వేరు. బిల్లు పాసైనా, తమ అభిప్రాయాలను చెప్పగలిగినందుకు, అవి సంచలనాన్ని కలిగించినందుకు భారతీయులు సంతోషంగా ఉన్నారు.

దక్షిణాఫ్రికా భారతీయులలో ఈ సంఘటన తర్వాత కొత్త ఊపు వచ్చింది. మరికొన్ని హక్కులు సాధించాలనే తపన వారిలో ఏర్పడింది. ఇంతకు మునుపే వ్యాపారులు కొన్ని హక్కులను పొంది ఉన్నారు. ఇప్పుడు భారతీయులందరికీ హక్కులు సాధించుకోవాలనే కోరిక పెరిగింది. ఆ కాలంలో వారికి నూతన చైతన్య స్ఫూర్తి కలిగింది.

గాంధీ కొన్ని 'లా' పుస్తకాలను కొని చదివాడు. అతని నాయకత్వంలో పనిచేయడానికి స్వచ్ఛంద సేవాదళం కార్యకర్తలు ముందుకు వచ్చారు. చిన్న అర్జీ పెట్టాలన్నా, ఎంతో కష్టపడి చదివేవాడు గాంధీ.

హిందూదేశంలో లాగానే ఓటు హక్కు పొందాలి. ఓటుహక్కు ఉపయోగించుకొనే భారతీయులు తక్కువ. దాని విలువను గుర్తించే విధంగా భారతీయులకు తెలియజెప్పాలి. గాంధీ కన్నుల ముందు బృహత్తరమైన కార్యక్రమం కనబడుతుంది. ఇదంతా సాధించాలంటే

ముందుగా భారతీయులందరినీ వేరు వేరు దారులనుండి మళ్ళించి ఒకదారికి తీసుకు రావాలి. అనేకత్వంలో ఐకమత్యం సృష్టించాలి. భారతీయ ముస్లింలు, భారతీయ క్రిస్టియన్లు, భారతీయ హిందువులు అనే అంతరాలను, వేర్పాటువాదాన్ని రూపుమాపి భారతజాతిని ఐకమత్యంగా నిలబెట్టాలి. అపుడు సంఘటిత శక్తి వల్ల వారి కొన్ని సత్ఫలితాలను సాధించ గలుగుతారని ఊహించాడు గాంధీ.

భారతీయుల సమస్యలు, వాటి పరిష్కారాల పట్ల అద్వితీయమైన అవగాహన కల్గిన ఏకైక మహా నాయకుడై పోయాడు. స్వచ్ఛంద సేవాదళం సభ్యులు అర్జీలు పెట్టటంలో సంతకాలు సేకరించడంలో అతనికి సహాయంగా నిలబడ్డారు.

గాంధీ ఇక్కడ కూడా నైతిక ఆదర్శాన్ని పాటించాడు. అర్జీలో ఉన్న విషయాలను తెలుసుకోకుండా ఎవరూ సంతకం పెట్టకూడదు అని ఆదేశించాడు. దావూద్ మహమ్మద్, సేట్ రుస్తుంజీ, ఆదంజీ, ఆమోద జీవా మొదలైన సేవాదళం కార్యకర్తలు ఒక్క దమ్మిడీ పుచ్చుకోకుండా అహరహం శ్రమించి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ప్రజల మనసుల్ని తట్టిలేపే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కలసి కొనసాగించారు.

నేటాల్ కాంగ్రెసులో తలమునకలుగా పనిచేస్తూనే, సుప్రీంకోర్టు అడ్వకేట్‌గా పేరు నమోదు చేయించుకున్నాడు. దాదా అబ్దుల్లాగారి ఇల్లు 'నేటాల్' కాంగ్రెస్ వారికి కార్యాల యము, మరియు అన్నదాన సత్రము అయినది. ఈ సమయంలో గాంధీ ముందుచూపుతో మరో మెళకువను ప్రదర్శించాడు.

స్థానిక పత్రికలతో సంబంధాలుపెట్టుకొని తాము చేసే ప్రతి కార్యక్రమం, వ్రాసే ప్రతి అర్జీ వారిద్వారా ప్రచారం చేయించాడు. ఈ రాజకీయ వ్యూహాన్ని టైమ్స్ ఆఫ్ ఇండియా, లండన్ టైమ్స్ పత్రికలు కూడా ప్రశంసించాయి.

500 సంతకాలు సేకరించాలని ఉద్యమించిన నేటాల్ కాంగ్రెస్ సేవాదళం కార్యకర్తలు అవలీలగా పదివేల సంతకాలు పెట్టించి, పిటీషన్ వెయ్యి కాపీలు ముద్రించారు. నేటాల్ అసెంబ్లీకి ఈ కాపీలు పంపినా ప్రయోజనం లేకపోయింది కాని వారు నిరుత్సాహపడలేదు.

ఈ పిటీషన్ కాపీలను పత్రికలు, ప్రముఖులకు పంపడమే కాక లండన్‌కు కూడా పంపించారు. గాంధీ, దాదాభాయ్ నౌరోజీకి ఉత్తరం వ్రాసి ఉద్యమానికి ఊతం ఇవ్వమని కోరాడు.

దక్షిణాఫ్రికాలో భారతీయుల కడగండ్లు తెలియపరుస్తూ ప్రపంచ పత్రికలన్నింటికి ఉత్తరాలు వ్రాశాడు. నేటాల్ ఇండియన్ కాంగ్రెస్ మనోభావాలను ప్రపంచానికి

తెలియపరచాడు. గాంధీ ఈ ఉద్యమ నిర్మాతగా, పటిమ కల్గిన పోరాటశీలిగా, భారతీయుల ఊపిరిగా, ఆత్మగౌరవం, ఆత్మసమ్మానం మొదలైన వాటికి కీలకప్రాయమైన నాయకుడుగా మారిపోయాడు. అందువల్ల నేటాల్‌లో స్థిరపడవలసిన అవసరం ఏర్పడింది.

నేటాల్ ఇండియన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అక్కడే ఉండిపొమ్మని పట్టుపట్టారు. సొంత సంపాదన లేకుండా ప్రజాసేవ చేయడం అసాధ్యం అనిపించింది. తాను బారిష్టరు హోదా కలిగి పెద్ద ఇంటిలో ఉండకపోతే తన నాయకత్వంలోని భారతీయ సంఘానికి గౌరవం రాదని భావించాడు గాంధీ. ఇదంతా జరగాలంటే పెద్ద ఇంటిలో ఉండాలి. మందీమార్బలం సమకూర్చుకోవాలి. వచ్చేపోయే వారితో ధనవ్యయం చాలా ఎక్కువ అవుతుంది.

ఈ విషయాలు మిత్రులతో చర్చించాడు. నేటాల్ ఇండియన్ కాంగ్రెసు అతని ఖర్చులను భరించడానికి ఎంతో ఉత్సాహంతో ఎదురుచూస్తుంది. కాని గాంధీ అందుకు అంగీకరించలేదు. ప్రజాహితకార్యాలు చేస్తూ ప్రజల సొమ్మును సొంతానికి వాడుకునేవారు. పాపపంకిలమై పోతారని అభిప్రాయం. అందువల్ల పార్టీ డబ్బు ఇస్తానంటే మృదువుగానే తిరస్కరించాడు.

ఇదిపెద్ద చర్చ అయింది. అతని మీద సంపూర్ణ విశ్వాసంతో నాయకులు, సేవాదళ సభ్యులు ఎంత చెప్పినా వినలేదు. ఈ విషయంలో మంకుపట్టు పట్టాడు. ఓ కారణం వలన కూడా వ్యక్తిగతమైన పవిత్రతని, నైతికతని బలి పెట్టేందుకు సిద్ధంగా లేదు.

వేరే క్లైంటుల దగ్గర వ్యాజ్యం పుచ్చుకోకుండా తన కోసం పనిచేస్తూ ఉండడానికి పెద్ద పార్టీలు రిటైనర్‌లు చెల్లించే అలవాటు ఒకటి ఉండేది. కోర్టులలో నల్ల బారిష్టర్లకు ఆశావహమైన పరిస్థితులు లేవు. కేసు వాదించడానికి నల్ల బారిష్టరు లేచి నిలబడగానే, తెల్ల జడ్జీలు మిర్రిమిర్రి చూచేవారు. అతడు చెప్పేదానికి మనసులో వ్యతిరేకంగా ఆలోచిస్తుండేవారు.

చందాలు, సౌజన్యాలు, ధర్మనిధి వగైరాల ద్వారా అనుభవిస్తూ ప్రజాసేవ చేయడం గాంధీజీకి సుతారమూ ఇష్టం లేదు. ప్రజాసేవ ప్రతిష్ఠాకరంగా చేయాలంటే ఖర్చులు పెంచుకోవడం అనివార్యం. మరి కోర్టులో కేసులు లేకుండా ఇదంతా ఎలా సాధ్యం? చివరకు ఈ సమస్యను పరిష్కరించేందుకు వర్తకులు ముందుకు వచ్చారు. ఒకసంవత్సర కాలం పాటు రిటైనర్లు ఇచ్చి వారు గాంధీని ఆదుకున్నారు.

పక్షపాతం లేని కోర్టు గుడ్డిది. న్యాయదేవత బుద్ధిసూక్ష్మత కలిగినది. కోర్టు అంటే ఒక త్రాసు లాంటిది అనుకోవాలి. నిష్పక్షపాతంగా అందరికీ న్యాయం సమానంగా

పంచబడాలి. కాని నేటాల్ వకీళ్ళ సభ ఈ విషయాలను చూడకుండా కళ్ళు మూసుకుంది. రంగు చూచి తీర్పులు చెప్పమని పెద్ద కోర్టులను ప్రేరేపించింది.

తెల్లవారి దగ్గర ప్రమాణాలు తీసుకొని గాంధీ ప్రాక్టీసు కోసం అర్జీ పెట్టుకున్నాడు. అబ్దుల్లా సేఠ్‌గారి సాయంతో అది మంజూరయింది. కానీ తెల్లవకీళ్ళు దరఖాస్తుతోపాటు ఇంగ్లీషు సర్టిఫికెటు జత చేయలేదనే సాకు చూపించి ఒక నోటీసు పంపించారు.

వారి భావాలతో ఏకీభవించకపోయినా అఫిడవిట్ దాఖలు చేశాడు గాంధీ. అటార్నీ జనరల్ ఆక్షేపణలన్నీ త్రోసిపుచ్చాడు. అతని విద్యాపత్రాలు చూపకపోతే, లేక దొంగపత్రాలు దాఖలు పరచి ఉంటే కేసు పెట్టండి, శాసనాలకు నలుపు తెలుపు బేధం లేదు. కనుక గాంధీ దరఖాస్తును మేము మంజూరు చేస్తున్నాం. గాంధీ ప్రమాణం చేసి ప్రాక్టీసు ప్రారంభించవచ్చు అని చెప్పాడు. తీరా ప్రమాణం చేసిన తర్వాత కోర్టు నియమాలకు లోబడాలని కోర్టువారు నిర్ణయించిన వేషాన్నిధరించాలని తలపాగా తీసివేయాలని కోరాడు.

సుప్రీంకోర్టు వారి ఆదేశం మేరకు గాంధీ తలపాగా తొలగించాడు. హిందూదేశంలో జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశిస్తే తలపాగా తీసివేయడం తలవంపు అవుతుందేమో కాని నేటాల్ సుప్రీంకోర్టు నియమ నిబంధనలు అలా ఉన్నప్పుడు అక్కడ ప్రాక్టీసు కావాలనుకున్నప్పుడు తలపాగా తీసివేయడం నైతికపరంగా కూడా తప్పు కాదని భావించాడు గాంధీ.

ఒక విషయాన్ని పరిస్థితుల పరంగా అర్థం చేసికోవాలి. సత్యదీక్ష మీద అతనికి పట్టుదల ఉంది. రాజీపడటమనేది ఆస్వాదించదగిన సౌందర్యమేనని తరువాత సత్యాగ్రహంలో కూడా గాంధీ నమ్ముతూ వచ్చాడు.

సత్యమనేది ఒకప్పుడు వజ్రంలా కఠినమైనది.

సత్యమనేది మరొకప్పుడు పూరేకులా సుకుమారమైనది. అంతరాత్మ ప్రబోధాన్ని ఆశ్రయించడం తప్ప మరొక మార్గమే లేదు.

ఎంత జరిగినా గాంధీకి న్యాయవాద వృత్తి అప్రధానంగా నేటాల్ ఇండియన్ కాంగ్రెస్ కార్యకలాపాలు ప్రధానంగా ఉన్నాయి.

ఇల్లలకగానే పండుగ కాదు. అలజడి జరపడమనేది అనివార్యం. ఫ్రాంఛైజ్ బిల్లుమీద దీర్ఘకాలిక పోరాటం జరపాలి.

అందుకోసం భారతీయులందరిని ఒక త్రాటి మీదకు తీసుకురావాలి. ఆ సంస్థకు 1894 సం॥ మే నెల 22వ తేదీన "నేటాల్ ఇండియన్ కాంగ్రెస్" అనే పేరును సాధికారికంగా ధృవీకరించారు. సభ్యత్వానికి నెలకు అయిదు షిల్లింగులు చెల్లించాలని నియమం పెట్టారు.

ధనికులు సంస్థకు ఉదారంగా విరాళాలు ఇచ్చేందుకు అంగీకరించబడింది. గాంధీ తన శక్తికి మించిన విధంగా ఒక పౌండు చందా ప్రకటించాడు. దర్బన్‌లో విరాళాలు పోగుచేసే సమయంలో ఆరంభశూరత్వం, అంత్యభ్రష్టత్వం అనేవి ఎలా ఉంటాయో గాంధీకి బాగా బోధపడింది. అతడి కార్యదర్శి నాలుగు మాసాలు రోజంతా తిరిగి చందాలు వసూలు చేశాడు.

ప్రతి నెలా చందాలకు తిరగడం ఇబ్బంది కాబట్టి సంవత్సర చందాలు నిర్ణయించారు. అప్పులు, వాగ్దానాలు ఆధారంగా ఎవరూ ప్రజాహిత కార్యాలు ప్రారంభించకూడదని అతనికి అప్పుడే బోధపడింది.

ధనికులు ఉత్సాహపడి ఇంటికి పిలిచి చందాలిచ్చేవారు. ఒక పెద్ద మనిషి ఆరు పౌండ్లు ఇస్తాడనుకుంటే మూడు పౌండ్లే ఇస్తానని మొండికేశాడు. అతని వద్ద అంతే మొత్తం తీసుకుంటే మిగిలినవారు ఇంకాతక్కువ ఇస్తారని నేటాల్ కాంగ్రెస్ కార్యకర్తలు ఒప్పుకోలేదు. దాతకు వారికి మధ్య హోరాహోరి వాదోపవాదాలు జరిగాయి. పూర్తి రాత్రంతా ఈ వాదోపవాదాలతోనే గడిచిపోయింది. సూర్యోదయం అయ్యేసరికి ఆ దాత ఇక తప్పని విధి అయినట్లుగా ఆరు పౌండ్లు తెచ్చి ఇచ్చాడు.

ఇది గాంధీ ఊహించినంత మామూలు వార్త కాదు. నేటాల్ కాంగ్రెస్ కార్యకర్తలు అతని వద్ద ఆరు పౌండ్లు వసూలు చేయగలగడం 'టోంగాటా' పట్టణంలో సంచలనంగా మారు మ్రోగింది.

'స్టేంగల్ పట్టణం నుంచి 'చార్లెస్ టౌన్' వరకు దుమారంలా చెలరేగింది. పిల్లికి బిచ్చం కూడా పెట్టని ఆ పెద్దమనిషి దగ్గర ఆరుపౌండ్లు వసూలు చేయడం కాంగ్రెస్ కార్యకర్తల ఘనవిజయంగా ప్రచారమై పోయింది. ఇక ఆ తరువాత కార్యకర్తలు ప్రతిపాదించిన అంకెను సరిదిద్దాలని దాతలు ఎవరూ ప్రయత్నించలేదు.

వసూళ్ళ కార్యక్రమం సులభతరమై పోయింది. ఈ ధనాన్ని సభలు జరపడానికి వినియోగించేవారు. ఇక్కడ కూడా ప్రజల ధనాన్ని పొదుపుగా ఖర్చు పెట్టాలని గాంధీ ప్రయత్నించాడు. ప్రతి దమ్మిడీకి లెక్కలు వ్రాస్తూ రశీదులు పెట్టించాడు.

సంఘాల మనుగడకు తప్పులేని లెక్కలే ప్రాణం. సంఘాలు పరువుగా అభ్యుదయాన్ని పొందగలగాలి. అపకీర్తిపాలు కాకుండా ఉండాలంటే లెక్కలు సరిగా చూపించడం ఒక్కటే దారి. పరిశుద్ధంగా ఉన్న వాతావరణంలో పెరిగే మొక్కల్లా అవి వృద్ధి చెందుతాయి. ఇది కూడా గాంధీ జీవితమంతా పాటించిన సత్యదీక్షలో ఒక భాగమే.

గాంధీ విద్యావంతులైన భారతీయ యువకులందరినీ మేలుకొలిపేందుకు "కలోనియల్ బారన్ ఇండియన్ ఎడ్యుకేషనల్ అసోసియేషన్" అనే ఒక సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ వారు "దక్షిణాఫ్రికాలో ఆంగ్లేయులకు ఒక విన్నపం" అనే కరపత్రం ఒకటి ప్రచురించారు. "భారతీయుల ఓటుహక్కు గురించి ఒక విన్నపం" అనే మరో కరపత్రాన్ని కూడా ప్రచురించారు.

దక్షిణాది తమిళులు, ఆంధ్రులతో గాంధీకి అప్పుడే పరిచయం అయింది. బాల సుందరం అనే తమిళుడిని యజమాని కొడితే పళ్ళువూడి రక్తం కారింది. అతడు కట్టుబానిస కూలీగా కుదిరాడు.

కోర్టు ద్వారా యజమానికి సమన్లు పంపి కట్టు బానిసత్వం నుంచి విడుదల చేయించాడు గాంధీ. ఈ సంగతి దేశంలో అందరికీ తెలిసింది. కూలీల వకీలు అనే పేరు కూడా పడింది. గరిమిటియాలు గాంధీ వద్దకు అసంఖ్యాకంగా వచ్చి వారి కష్టాలను కోకొల్లలుగా చెప్పడం మొదలుపెట్టారు.

దక్షిణాది భారతీయులతో గాంధీకి సాహచర్యం పెరిగింది. బానిసలు, కట్టు బానిసలు, కూలీల కష్టాలను వారి జీవనస్థాయిని తెలుసుకొని కంట తడి పెట్టాడు.

బాలసుందరం మరికొందరు గరిమిటియాలు తన దగ్గరకు వచ్చినప్పుడు తలపాగా లను తీసివేయడం గాంధీకి చిన్నతనంగా అనిపించింది. వారిచేత తలపాగాలు చుట్టించి వారి కళ్ళలో ఆనందపు వెలుగులు, జిలుగులు చిమ్ముతుంటే చూచి పొంగిపోయాడు.

1894లోనే మరో చట్టం వచ్చింది. గరిమిటియాలు సంవత్సరానికి ఇరవై అయిదు పౌండ్లు తలపన్ను కట్టాలి. ఈ విషయాన్ని కాంగ్రెసు సమావేశంలో చర్చకు తెచ్చాడు గాంధీ. నియమిత కాలం కట్టు బానిసత్వం పూర్తి అయిపోగానే స్వదేశం వెళ్ళాలని, రెండు సంవత్సరాలకు ఒకసారి కట్టు బానిసత్వపు ఒడంబడిక తిరగవ్రాయాలని, పన్ను కట్టాలని శాసనంలోని అంశాలు.

ఈ షరతులకు ఇండియా ప్రభుత్వాన్ని ఒప్పించారు. గోఖలేగారు గతంలో ఈ విషయమై కొంత ఉద్యమం నడిపారు. గరిమిటియాలు ఈ ఉద్యమానికి ప్రాణాలను కూడా అర్పించారు. ఇది దేశ వ్యాప్త పోరాటంగా మారితే తప్ప ఫలించదని గాంధీకి అనిపించింది. అచంచలమైన ఓర్పు, విశ్వాసం, పూనిక, పట్టుదల చాలా అవసరం అనిపించాయి. జిజ్ఞాస తీవ్రతరమైనది. భారతీయుల బాధల రూపంలో సత్య సందర్శనం చేస్తున్నాడు గాంధీ.

ఇది దక్షిణాఫ్రికా భారతీయుల సమస్య కాదు. కేవలం భారతీయులందరి సమస్య కాదు. ప్రపంచ సమస్య మానవజాతి సమస్య. సత్యదీక్షకే ఒక సమస్య అని భావించాడు.

ఈ సమయంలోనే మిత్రులతో వివిధ మతాల సమస్యలు చర్చించేవాడు. ధర్మ విచారం ప్రారంభమైంది. రామచంద్, నర్మదాశంకర్, మాక్స్ ముల్లర్, ఇర్విన్, కార్లైట్ల్, టాల్‌స్టాయ్ గ్రంథాలను అవపోశనం పట్టేశాడు.

భారతదేశ హిందూ మతాన్ని గురించి మాట్లాడినందుకు ఒక ఇంటి ఇల్లాలు గాంధీని తన ఇంటికి రావద్దని చెప్పింది. ఆమె మనసు మార్చి తిరిగి ఆహ్వానం అందుకున్నాడు గాంధీ. పసివాడు మాంసము ముక్క తింటూ ఉంటే, రేగుపండు చూపించి దాని గొప్పతనం వివరించి ఒప్పించాడు.

తమ ఇంటికి వచ్చిన తమ పిల్లవానికి ఇటువంటి దుర్బోధల్ని చేయవద్దని ఆ గృహిణి హెచ్చరించింది. మాంసాహారం తినకపోతే మనుషులు చనిపోరు గాని చిక్కిశల్యమై పోతారని వాదించింది. ఆమెకు ఎన్నో విషయాలు చెప్పి ఒప్పించాడు గాంధీ. చివరకు ఆ గృహిణి చేత మీ మాటలు బాగున్నాయండనే ఒక పొగడ్తను సంపాదించాడు.

ఈ నైతిక విజయం గాంధీకి మంచి ప్రేరణ ఇచ్చింది. గాంధీకి పనివారిని పెట్టుకోవడం, శుశ్రూషలు చేయించుకోవడం తెలీదు. మిత్రుని రూపంలో వచ్చిన సహాయకుడు ఒకసారి ఇంటిలోకి వేశ్యను తీసుకు వచ్చి తలుపులు బిడాయించాడు. ఈ విషయం తెలిసిన గాంధీ ఇంటికి పరుగు దీశాడ. వేశ్యతో సహా పట్టుబడ్డాడు. ఆకాశం చిల్లులు పడేలా అరచి ఇంటి నుంచి అతనికి ఉద్వాసన పలికాడు. ఇల్లు పరిశుభ్రం చేయించి పూజాదికాలు నిర్వహించాడు. ఆ తర్వాత మరెవరికీ ఇంటిలో ఆశ్రయము ఇవ్వలేదు.

దక్షిణాఫ్రికాలో ప్రజాసేవా కార్యక్రమాలలో కాలం ఎలా గడిచిందో తెలియదు. 1896 వచ్చేసింది. ఇంటికి వెళ్ళి భార్యా పిల్లలను చూచి రావాలనే కోరిక కలిగింది. ఆరు నెలలు సెలవు పెట్టి ఆదమ్ జీ మియాఖాన్‌ను కార్యదర్శిగా నియమించి ఇండియాకు బయలుదేరాడు.

అక్కడి ప్రజల ఉదారత, 'స్నేహపాత్రత, తన మీద నిలుపుకున్న విశ్వాసం ఆయన మనస్సులో గాఢమైన ముద్రను వేశాయి. స్టీమర్‌లో కెప్టెన్‌తో మైత్రి కలిసింది. అతడు భక్తి పారవశత్వం కలిగిన క్రిస్టియన్ సోదరుడు. నీతిపట్ల చులకన భావం కలిగిన మతం ఏదైనా, అతని దృష్టిలో చెల్లనిది.

గాంధీ శాఖాహారి అనే విషయం మీద అతడు తర్కించాడు. గోమాంసం ఎందుకు తినకూడదని ప్రశ్నించాడు? కూరగాయలను, ధాన్యాన్ని సృష్టించినట్లే భగవంతుడు జంతువులను కూడా మనుషుల ఆహారం కోసం పుట్టించాడని అతని నమ్మకం. అతనికి బైబిల్‌ను అనుసరించి త్యాగం చేయడంలో నమ్మకముంది. ఇరవై నాలుగు రోజుల కాలం అతనితో సంతోషంగా గడిచిపోయింది. హుగ్లీ నదిలో అందాన్ని చూడటానికి గాంధీ కలకత్తాలో దిగాడు. రైలులో బొంబాయికి బయలుదేరాడు. ప్రయాగలో రైలు చాలాసేపు ఆగింది. మందు కోసం బయటికి వెళితే రైలు బయలుదేరే వేళ అయింది. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చాడు. స్టేషన్ మాస్టారు ఆ నిమిషం రైలును ఆపించాడు. సామాను కిందికి దింపించాడు. ఆ రాత్రి అక్కడే బస చేయాల్సి వచ్చింది. ఒక హోటల్‌లో గది తీసుకుని విశ్రాంతి కోసం ప్రయత్నించాడు. కానీ సమస్యలు అనేకం.

# 5. భారతయాత్ర

పయనీర్ పత్రిక ఉపసంపాదకుడిని కలిశాడు గాంధీ. అతడు రచించిన వ్యాసాలకు వ్యాఖ్యానం పత్రికలో వేస్తానని ఒప్పుకున్నాడు.

ప్రయాగలో త్రివేణీ సంగమాన్ని సందర్శించి బొంబాయిలో దిగకుండా తిన్నగా రాజకోట చేరుకున్నాడు. దక్షిణాఫ్రికాలో భారతీయులను గురించి ఓ పుస్తకం వ్రాశాడు. అది చాలా ప్రజాదరణ పొందింది. సంచలనం కలిగించింది. లండన్, నేటాల్ లాంటి దూరదేశాల పత్రికలు దీని మీద వ్యాసాలు వ్రాశాయి.

పుస్తకాలకు కాగితాలు చుట్టి కట్టలు కట్టి పోస్టులో పంపడం కష్టమైన పని. అందుకు ఒక ఉపాయం కనిపెట్టాడు గాంధీ. బడి పిల్లలని పిలిచి సాయం చేయమని కోరాడు. పిల్లలు ఆడుతూ, పాడుతూ ఆ పని పూర్తి చేశారు.

బొంబాయి ప్రాంతాలలో ప్లేగు వ్యాపించింది. గాంధీ స్వచ్ఛంద సేవ చేయడం మొదలుపెట్టాడు. గాంధీకి చెట్లు నాటడం ఓ సరదా. 'గాడ్ సేవ్ ది కింగ్' అనే పాటను అతను చాలాసార్లు పాడాడు. ఈ పాటను విద్యార్థులకు నేర్పించాడు. పాటలో కొన్ని భాగాలు అతనికి నచ్చలేదు.

పాలకుల పట్ల ఎంతో విశ్వాసము ఉండాలని అతని భావం. అలాగే రోగులకు సేవ చేయడమన్నా అతనికి ఆసక్తి. డాంబికంలో గాని, ఇతరులకు భయపడి గాని సేవ చేయకూడదు. అది స్వచ్ఛందంగా జరగాలి. బొంబాయిలో ఒక ఉపన్యాసం ఇవ్వవలసి వచ్చింది. ఒకరోజు ముందుగా సర్‌ఫిరోజ్‌షాగారిని కలిస్తే ఉపన్యాసం ముందుగా తయారు చేయమని అడిగాడు.

మున్షీని పిలిచి అతని వద్ద ఉపన్యాసం కాపీ తీసుకోమని చెప్పాడు. ఫిరోజ్‌షా గారి ఉపన్యాసమంటే సభలో జనం కిటకిటలాడుతారు. అంత పెద్ద సభను గాంధీ ఎప్పుడు చూడలేదు. గాంధీగారి కంఠస్వరం చాలా చిన్నది.

ఫిరోజ్‌షా ప్రోత్సహించిన కొద్ది కంఠస్వరం కుంచించుకుపోయింది. సభలో అల్లరి జరిగింది. గాంధీకి బదులుగా వాబాగారు ఉపన్యాస పాఠం చదివాడు. ఫిరోజ్‌షా మెహతాగారి ముందుచూపు బాగా పనిచేసింది.

ఉపన్యాస పాఠం విని శ్రోతలకు చక్కగా ప్రతిస్పందించారు. ఫిరోజ్‌షా మెహతా కూడా ఆ ఉపన్యాసాన్ని మెచ్చుకున్నాడు. ఈ ఉపన్యాసం చాలా మంది ప్రముఖుల ప్రశంసలను పొందేటట్లు చేసింది. పరధర్మాలను ఆచరించడం కన్నా మంచిది కాకపోయినా స్వధర్మాన్నే ఆచరించాలి. స్వధర్మంలో ఉండటమే శ్రేయస్సు. పరధర్మాన్ని స్వీకరించడం భయావహం.

గాంధీ బొంబాయి నుండి పూనా వెళ్ళాడు. లోకమాన్య బాలగంగాధర తిలక్, ప్రొఫెసర్ భండార్కర్, గోఖలేలను సందర్శించారు. గోఖలేగారు గాంధీని చిన్నపిల్లాడిలా పరీక్షించాడు. తర్వాత ఈ పెద్దలందరూ గాంధీ ఉద్యమాన్ని సమర్థించారు. ఒక సభ జరిపి గాంధీని మెచ్చుకున్నారు. సభలో బాల సుందరం కథ ఆకట్టుకుంది. రాజకోటలో ఉన్నప్పుడు పదివేల ప్రతులు వేడి వేడి రొట్టెల్లా అమ్ముడు పోయాయి.

మద్రాసులో పరమేశ్వరన్ పిళ్ళే, డా॥ సుబ్రహ్మణ్యం పత్రికలో ప్రోత్సహించడమే కాక పచ్చయప్ప కళాశాలలో ఉపన్యాసం పెట్టి గాంధీని పిలిపించారు. మద్రాసులో ఉన్నప్పుడు స్వగృహంలో ఉన్నట్లు గాంధీ చాలా సంతోషించాడు.

ప్రేమ దూరాన్ని జయించింది. అక్కడ నుండి కలకత్తా వెళ్ళి గ్రేట్ ఈస్టర్న్ హోటల్లో దిగాడు. సురేంద్రనాథ్ బెనర్జీగారు ప్రోత్సహించాడు గాంధీని. మహారాజులను, జమీందారులను కలసి మద్దతు సంపాదించుకోమని సలహా ఇచ్చాడు.

ఎన్నో పత్రికలకు పరిచయం చేశాడు. ఆఫ్రికా వెళ్ళిన తరువాత కూడా ఉత్తరాలు వ్రాస్తూ ఉండమని కూడా చెప్పాడు. కలకత్తాలో సభను జరపాలనే ప్రయత్నంలో ఉండగా దర్బన్ నుండి దక్షిణాఫ్రికా రావలసిందని టెలిగ్రాం వచ్చింది. దక్షిణాఫ్రికా వెళ్తునట్టు కలకత్తా పత్రికలలో ప్రకటించి కలకత్తాను విడిచిపెట్టాడు.

అప్పటికి దాదా అబ్దుల్లాసేఠ్ ఒక స్టీమర్ కొన్నాడు. దానిలో టిక్కెట్టు లేకుండా అతని కుటుంబమంతా ప్రయాణించడానికి అవకాశం ఏర్పడింది. స్టీమరు పేరు కుర్లాండ్.

దానిలో కస్తూరిబా, ఇద్దరు పిల్లలు, బావగారి కుమారుడుని తీసుకొని రెండవసారి దక్షిణాఫ్రికా బయలుదేరాడు.

రెండు స్టీమర్లు కలసి బయలుదేరాయి. మొత్తం ఎనిమిది వందలమంది యాత్రికులు ట్రాన్స్‌వాల్‌కు బయలుదేరారు. నాగరికత అనేది కుబుసంలాంటిది. దాన్ని మనిషి ఎప్పుడో ఒకప్పుడు విడిచి పెట్టక తప్పదు.

ఈసారి ప్రయాణం పద్దెనిమిది రోజులే. కాని మధ్యలో పెద్ద తుఫాను వచ్చింది. కారు మబ్బులు పట్టాయి. ప్రళయమారుతం వీచింది. అందరూ ప్రాణభయంతో కంగారు పడ్డారు. కష్టాలలో మనుషులు కలసి ఉంటారనే వాస్తవం అప్పుడే గాంధీకి బోధపడింది. పులి మీద పుట్రలా మళ్ళీ మరో ప్రమాదం వచ్చి పడింది. టౌయిటోలో ఓడలు రెండింటికి లంగరు వేశారు. బొంబాయిలో ప్లేగు వ్యాధి భయంకరంగా వ్యాపించి ఉన్నదని దక్షిణా ఫ్రికాలో అందరికి తెలిసింది. డాక్టర్లు వచ్చి ప్రతి ఒక్కరిని సునిశితంగా పరీక్షిస్తున్నారు. ప్లేగు క్రిములు ఇరవై మూడు రోజులు జీవించి ఉంటాయని ఆ డాక్టర్ల నమ్మకం. మిగిలిన అయిదు రోజులు యాత్రికులని క్వారంటీన్‌లో ఉంచాలని వారి ఎత్తుగడ. బొంబాయిలో బయలుదేరిన తరువాత ఇరవై నాలుగు రోజులు గడవకుండా ఓడ దిగనివ్వకూడదని కొందరి ఆలోచన. మరికొందరు తమ పలుకుబడి ఉపయోగించి ఓడలను వెనక్కు పంపాలని ఆలోచిస్తున్నారు.

యాత్రికులకు కష్టాలు మళ్ళీ మొదలయినాయి. దాదా అబ్దుల్లా యాత్రికులు అందరిని దింపి తీరాలని పలుకుబడిని ఉపయోగిస్తున్నాడు. కొందరు వచ్చి మీరు తిరిగి వెళ్ళిపోతే అయ్యే ఖర్చులు మేమిస్తాం. లేకపోతే ఓడలు ముంచివేస్తాం అని బెదిరించడం ప్రారంభి ంచారు. భయాన్ని మరచిపోవడానికి పిల్లలు, పెద్దలు ఎవరికి తగిన విధంగా వారు కాలక్షేపాలను ఏర్పాటు చేసుకున్నారు. దర్బన్‌లో జరుగుతున్న పోరాటంలో ముఖ్యకేంద్రం గాంధీయే. అతని మీద శత్రువులు రెండు ఆరోపణలు చేశారు.

**ఒకటి :** భారతదేశంలో నేటాల్ శ్వేత జాతీయుల మీద దుష్ప్రచారం చేశాడని.

**రెండు :** నేటాల్‌ను భారతీయులతో నింపడం కోసమే రెండు ఓడల జనాన్ని తీసుకువస్తున్నాడని, గాంధీ భార్యా పిల్లల్ని కూడా తీసుకురావడంతో వారిని ప్రమాదంలోకి పడవేసినట్లు అయినది.

ఓడ లోపల కూడా హింసా, అహింస అనే విషయాల మీద వాదోపవాదనలు జరిగాయి.

తెల్లవారు హింసించేవారి దగ్గర అహింసగా ఉండడం అసాధ్యం అని నమ్మారు. జనవరి 13 ఓడరేవులోకి ప్రవేశించింది. యాత్రికులు అంతా దిగుతున్నారు. గాంధీ

అతని కుటుంబ సభ్యులు వచ్చారనే వార్త తెల్లవారికి తెలిసిందని వారు ఓడ దిగితే ప్రాణాపాయము ఉన్నదని వార్తలు వినిపించాయి.

అర్థరాత్రి పూట రహస్యంగా వారిని రుస్తుంజీ ఇంటికి చేర్చేందుకు పోలీసులు ఒప్పుకున్నారని, అలా చేయమని చాలా మంది సలహా ఇచ్చారు. కాని దాదా అబ్దుల్లా సేఠ్‌గారి న్యాయవాది ఒకరు వచ్చి గాంధీని కలిశాడు.

తెల్లవారికి భయపడటం అవమానకరమని వారేమీ చేయలేరని గాంధీకి ధైర్యం చెప్పాడు. అర్థరాత్రి పోలీసుల సాయంతో రుస్తుంజీ ఇంటికి చేరడానికి ఒప్పుకున్న గాంధీ మనసు ఈ మాటలతో మారిపోయింది.

కుటుంబాన్ని ఒక బండిలో క్షేమంగా రుస్తుంజీ ఇంటికి చేర్చారు. గాంధీ మిత్రుడుతో కలసి నడక ప్రారంభించాడు. వీధుల్లో కొంత దూరం వెళ్ళాక కొందరు పిల్లలు చుట్టూ చేరి గాంధీ, గాంధీ అని అరవటం ప్రారంభించారు. కొందరు పెద్దలు వారికి అడ్డుగా వచ్చారు. వాళ్ళు కూడా గాంధీ, గాంధీ అంటున్నారు. కొంతదూరం పోయాక వాళ్ళలో ఒకడు గాంధీని నెట్టాడు. గాంధీ తూలి పడబోయి ఒక ఇంటి కిటికీ ఊచలు పట్టుకున్నాడు. చాలా దెబ్బలు తగిలాయి. ఎవడో తలపాగా లాగేశాడు. ఇంకా దెబ్బలు ఆయన శరీరానికి తగులూతూనే ఉన్నాయి. ఇంతలో ఆ దారిన వెళుతున్న పోలీసు సూపరింటెండెంట్ గారి భార్య గాంధీని చూచింది. ఆమె ధైర్యవంతురాలు. దగ్గరగా పరిగెత్తుకు వచ్చి ఎండా, వానా లేకపోయినా గొడుగు పట్టి గాంధీని కాపాడింది. గాంధీని చేతులలో చుట్టి కాపాడింది.

ఇప్పుడు గాంధీని కొట్టాలంటే పోలీసు సూపరింటెండెంట్‌గారి భార్యకు దెబ్బలు తగులుతాయి. అందువలన జనం వెనుకంజ వేశారు.

ఈ విషయం తెలుసుకొని గాంధీని రక్షించడం కోసం సూపరింటెండెంట్‌గారు కొందరు పోలీసుల్ని పంపించారు. గుంపులో కొందరి మీద కేసు పెట్టమని ప్రోత్సహించారు.

"వారి తప్పును వారే తెలుసుకుంటారు. భగవంతుడు వారికి న్యాయబుద్ధిని కలుగజేస్తాడని నమ్మకం నాకు ఉంది" అని గాంధీ చెప్పాడు.

అతని దెబ్బలకు ఓడ వైద్యులు సేవలు చేశారు. రుస్తుంజీ ఇంటి ముందు అల్లరి ప్రారంభమైంది. పెద్ద గుంపుగా గుమికూడిన తెల్లవారు గాంధీని అప్పగించమని అల్లరి మొదలుపెట్టారు.

పోలీసు సూపరింటెండెంట్ మరలా వచ్చాడు. "నీ స్నేహితుడి ధన మాన ప్రాణాలు, నీ భార్య బిడ్డలు ప్రాణాలు కాపాడుకోవాలంటే మారువేషంలో పారిపోవడం తప్ప మరోదారి లేదని" చెప్పాడు.

దానికి గాంధీ ఒప్పుకున్నాడు. తల మీద గాయాలు తగలకుండా ఇత్తడి సిచ్ఛ పెట్టుకుని, మదరాసు తలపాగా చుట్టుకుని ఇద్దరు పోలీసు గూఢచారుల మధ్య బయలుదేరాడు. దొడ్డిదారిన "ఠాణా" చేరుకున్నాడు. అక్కడకు పత్రికల వారు కూడా వచ్చారు. కేసు నమోదు చేసే విషయంలో గాంధీ తెల్లవారిని క్షమించాడు. ఈ విషయం పత్రికలు గొప్పగా వ్రాశాయి. తెల్లవారి దుడుకుతనాన్ని దుయ్యబట్టాయి.

ఈ సంఘటన వలన గాంధీకి మాత్రమే కాదు, దక్షిణాఫ్రికాలోని భారతీయులందరికీ మేలు జరిగింది. భారతీయులు పౌరుషవంతులని, వివేకవంతులని, ఆత్మనిగ్రహం కలవారని బాగా ప్రచారమయింది. గాంధీ గొప్పనేతగా అభివర్ణించబడ్డాడు. అంతా కలసి తెల్లవారు తలలు దించుకునే స్థితికి దారితీసింది.

గాంధీ గౌరవ ప్రతిష్టలు ఇబ్బడి, ముబ్బడిగా పెరిగాయి. స్నేహితుల వకాల్తాలు ఎక్కువ కావటం వలన మేలే జరిగింది. తనను కొట్టి చంపాలని ప్రయత్నించిన గుంపును దేవుడే రక్షించాలని ప్రార్థించిన గాంధీ జీసస్‌కు సాటి వస్తాడని కొన్ని పత్రికలు వ్రాశాయి.

రెండవసారి దక్షిణాఫ్రికాలో కాలు పెడుతూనే మంచి సంపాదన, గొప్ప నాయకత్వము దక్కాయి. అతని పలుకుబడితోపాటు, ఆదాయంతో పాటు, తెల్లవారికి అతని మీద ద్వేషం కూడా పెరిగింది. గాంధీ తిరిగి మామూలుగా తన పనిలో లీనమయ్యాడు. ఈ సమయంలోనే కౌన్సిల్‌లో రెండు చట్టాలు రూపొందించబడ్డాయి.

భారతీయుల వ్యాపారాన్ని, భారతీయుల వలసని నిరోధించేందుకే ఇవి నిర్దేశించ బడ్డాయి. అయితే భారతీయులకు ప్రత్యేక చట్టాలు ఉండకూడదని శాసనానికి నలుపు, తెలుపు వర్ణ వ్యత్యాసం లేదనే నిర్ణయం కూడా తయారైంది. ఈ రెండు చట్టాలు వలన గాంధీకి పని బాగా పెరిగింది. వాటిని ఆమోదించరాదని తీర్మానాలు చేసి "నేటాల్ భారతీయ కాంగ్రెస్" ఆ తీర్మానాలను లండనుకు కూడా పంపింది. కాని తీర్మానాలు అంగీకారం పొందాయి. సార్వజనీకమైన సంస్థలు చాలా నెలకొల్పి వాటికి ఊపిరి అయ్యాడు గాంధీ.

సత్యాగ్రహం అనేది స్వార్థపరుల గుండెల్లో గుబులు పుట్టిస్తూ ఆనాడు జీవం పోసుకుంది. మూకుమ్మడి దాడిని, హత్యానేరాన్ని క్షమించిన గాంధీ, మొట్టమొదటి సత్యాగ్రహి. వారి తప్పులు క్షమించాడు. వారికి శిక్షలు పడకుండా చేశాడు.

కాని వారి దుశ్చర్యలను తూర్పారబట్టడం, సామాజిక అసమానత్వాన్ని దుయ్యబట్టడం మాత్రం మానుకోలేదు.

సత్యాన్వేషకుని సత్యాగ్రహ సంగ్రహ స్వరూపం ఇది. 1897లో దర్బన్ వెళ్ళాడు. పిల్లలకు ఆంగ్ల భాషా బోధన చేయించాడు.

పెద్ద కుమారుడు అహమ్మదాబాదులో చదువుకు వెళ్ళిపోయాడు. మేనల్లుడు అల్పాయుష్కుడయ్యాడు. మిగిలిన ముగ్గురు పిల్లలు సత్యాగ్రహుల పాఠశాలలో నియమ బద్ధంగా చదువుకున్నారు.

ఈ ఉద్యమాల వలన సహజంగానే కుటుంబానికి, పిల్లలకు నష్టం జరిగింది. పిల్లలకు స్వేచ్ఛ ఇచ్చాడు గాంధీ. అందరు తల్లిదండ్రులలా కాకుండా, స్వార్థానికి దూరంగా ఉంచాడు. ఇదంతా ఎటువంటి ఫలితాలను ఇస్తుందనే విషయాన్ని భవిష్యత్కాలానికి వదలిపెట్టాడు.

రోగులకు సేవ చేయడం కోసం "డాక్టర్ బూత్"గారి దగ్గర రోజుకు రెండు గంటలు సమయం పొందాడు. సలహాలు ఇవ్వడం, దస్తావేజు నమూనాలు తయారు చేయడం, తగాదాలు వచ్చినపుడు వాది, ప్రతివాదులను రాజీపెట్టడం– ఇదే ఆయన నిర్వహించిన ప్లీడరు గిరి.

గిరిమిటియాలో అరవవారు, తెలుగువారు, ఉత్తరాదివారు కూడా కొందరుండేవారు. వారికి సేవ చేయడమంటే గాంధీకి చాలా ఇష్టం. గిరిమిటియాల కోసం తెల్లమంత్రసానులు రారు. కాన్పులలో తల్లిబిడ్డలు ప్రాణాపాయంలో పడటం సర్వసాధారణంగా జరుగుతుండేది. గిరిమిటియాలు ఖర్చుతో కూడిన చికిత్సలు చేయించుకోలేరు. నల్లమంత్రసానులు దొరకరు. అందువలన అరవ, తెలుగు, దక్షిణాది తల్లులకు పురుళ్ళు పోయడానికి కూడా గాంధీ వెనుకాడలేదు. అందుకోసం సుఖప్రసవాన్ని గురించి ఒక పుస్తకం కొని ఆ విశేషాలను కస్తూరిబాకు కూడా నేర్పించాడు.

రెండు పురుళ్ళు పోశారు. చిన్నవాడు పుట్టినప్పుడు మంత్రసాని అందుబాటులో లేకపోవడం వల్ల కస్తూరిబాకు కూడా తానే పురుడు పోశాడు గాంధీ.

నిద్ర, ఆహారం లాగా సంయోగం కూడా ఒక నిత్యావసరం అనుకోవడం గాంధీకి ఇష్టం లేదు. సంతానాన్ని పొందడం వరకే స్త్రీ, పురుషులు ఆ శక్తిని ఉపయోగించుకోవాలని గాంధీ నిశ్చితాభిప్రాయం. ఇది అతని సత్యదీక్షలో ఒక భాగం.

"గ్లాడ్‌స్టన్" అనే ఆయనగారి భార్య హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఉన్నప్పుడు కూడా తేనీరు తెచ్చి ఇస్తుండేది. ఇది చాలా గొప్ప అనుబంధం అని గాంధీగారి అభిప్రాయము. సేవకులుగాని, తల్లి లేక సోదరిగాని తేనీరు ఇవ్వడం, భార్య తేనీరు ఇవ్వడం లాంటిది కాదని గాంధీగారి అభిప్రాయము.

భార్యతో అనుబంధమనేది మోహానికి అతీతంగా ఉండాలని అతను ఆలోచించాడు. అందుకోసం బ్రహ్మచర్యం అవలంబించాడు. భార్యను సంతానం కొరకు తప్ప మిగిలిన సమయాల్లో స్నేహితురాలివలె మన్నించి గౌరవించాలని అతని అభిప్రాయము.

బోయర్ తరువాత నేటాల్‌లో జులూ తిరుగుబాటు జరిగింది. గాంధీ అప్పుడు జోహాన్స్‌బర్గ్‌లో ఉన్నాడు. భార్య పిల్లల్ని ఫినిక్స్‌లో ఉంచి గాయపడ్డ తిరుగుబాటుదార్లకు సేవ చేశాడు.

కాలక్షేపానికి సంభోగం చేయడం పాము కాటు వంటిదని, పాము కాటు వేయ బోతున్నప్పుడు, ఆలోచిస్తూ కూర్చోవడం ప్రాణాపాయం కనుక పారిపోవడమే మంచిదని గాంధీ నిశ్చయించుకున్నాడు.

ఫలితంగా 1909లో బ్రహ్మచర్య దీక్ష పూనాడు. ఒక వ్రతం చేస్తూ ఉండగా భార్యతో చెప్పి ఆమె అనుమతిని తీసుకున్నాడు. ఆత్మపరంగా బ్రహ్మచర్యవ్రతం ఎంతో స్వేచ్ఛను ప్రసాదించినట్లనిపించింది. బ్రహ్మచర్యానికి అవసరమైన నిర్వికార భావంతోపాటు దానికి అనుగుణమైన ఆహార నియమాలు కూడా అలవాటు చేసుకున్నాడు. ఉపవాసాలలో పాలు ఆహారంగా స్వీకరించడం మొదలుపెట్టాడు. గాంధీ ఇంతకుమునుపే స్వార్థాన్ని త్యాగం చేశాడు. సుఖాన్ని కూడా త్యాగం చేశాడు. ఇది నైతిక జీవితాన్ని పటిష్టం చేయడమే కాక ప్రజాసేవకు ఎక్కువ సమయాన్ని కేటాయించే అవకాశం కలిగించింది.

అంతేకాక అతని పనులలో లక్ష్యసాధనకు ఏదో అలౌకికమైన, దివ్యమైన శక్తి తోడయింది. విలువైన దుస్తులు ధరించడం మానివేయడమే కాక, ఇస్త్రీ చేసుకునే ఖర్చులు కూడా తప్పించుకోవడం మొదలుపెట్టాడు. ఉతికి, ఆరబెట్టిన శుభ్రవస్త్రాల కన్నా గొప్ప వస్త్రధారణ లేదని కనిపెట్టాడు.

ప్రిటోరియాలో తెల్ల మంగళ్ళు నల్లవారికి క్షవరం చేయరు. అందువల్ల చేతకాకపోయినా కత్తెర కొనుక్కొని తన క్షవరం తానే చేసుకున్నాడు. అతని క్రాఫ్ చూసి తల మీద ఎలుకలు తిరుగుతున్నాయా అని అడిగేవారు.

బోయరు యుద్ధంలో గాయపడిన వారికి సేవ చేయడం కోసం పదకొండు వందలమంది దళంతో యుద్ధరంగానికి వెళ్ళాడు. ఫిరంగులు, తుపాకీ గుళ్ళ మధ్య త్యాగపూరితమైన దీనజన సేవ ఎంతో తృప్తినిచ్చింది.

ఈ దళానికి రెడ్‌క్రాస్ గుర్తు ఇచ్చారు. ఈ గుర్తుకల వారిని శత్రువులు కూడా కాల్చరు. ఈ సేవను భారతీయులే కాక తెల్లవారు కూడా మెచ్చుకున్నారు. పత్రికలు ప్రశంసలు పరంపరలు గుప్పించాయి.

సేనాపతి జనరల్ బూలర్ కూడా వారికి పతకాలను ఇచ్చి ప్రశంసలు వర్షం కురిపించాడు. చులకనగా చూడబడుతున్న దక్షిణాఫ్రికా భారతీయులకు తెల్లవారి దృష్టిలో గౌరవప్రదమైన స్థానం ఏర్పడింది.

భారతీయులలో ఐకమత్యం ఏర్పడింది. హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు, అరవ, తెలుగు, గుజరాత్, సింధి, అందరూ భారతీయులన్న భావం బలపడింది.

తెల్ల సైనికులు కూడా భారతీయుల సేవా శుశ్రూషలకు కృతజ్ఞత తెలిపేవారు. రాబర్ట్స్ రాజుగారి కుమారుడు ప్రాణాంతకమైన తుపాకీ గుండు దెబ్బకు చనిపోతే ఆయన శవాన్ని మోసే అదృష్టం రెడ్‌క్రాస్ దళానికి దక్కింది. ఇది చూసిన తెల్ల సైనికులు ముందుగా భారతీయులు మంచినీరు తాగాలని కోరారు. నల్లవారి తరువాత తెల్లవారు దాహం తీర్చుకోవడమనే సంఘటన ఆ దేశంలో ఈ ఒక్కసారే జరిగింది.

ఏదైనా సరే తెల్లవారి తర్వాత నల్లవారు ఉపయోగించాలనేది నల్లవారు కూడా అంగీకరించిన సూత్రం. నల్లవారి సేవలకు మెచ్చి తెల్లవారు భారతీయులకు ఇచ్చిన ప్రత్యేక గౌరవమిది.

గాంధీ సాధించిన నైతిక విజయం ఇది. ఈ విజయాన్ని ద్వేషంతో కాకుండా ప్రేమతో, సేవాభావంతో అతను సాధించగలిగాడు. ఆ తరువాత భారతదేశంలో క్షామం వచ్చింది. 1899లో మరింత పెద్ద క్షామం వచ్చింది. నిరుపేదలైన గిరిమిటియాలు కూడా తమ కష్టార్జితంలో నుంచి క్షామనిధికి విరాళాలు ఇచ్చారు. గాంధీ రెండుసార్లు క్షామనిధులు వసూలు చేసి మాతృదేశానికి పంపాడు. సత్యం అనేది చెట్టులాంటిది. అది ఎదిగి పూచి కాచి ఫలించాలంటే సేవ అనే రెండు అక్షరాల ఎరువును దానికి సమకూర్చాలి.

సత్యసాధనలు, సత్యదీక్షలు, సత్యారాధనలూ, సత్యనిబద్ధతలూ, సత్య సంకల్పంలో ఇప్పుడు గాంధీ మరో మెట్టు పైకెక్కాడు.

భారతదేశంలో క్షామం తరువాత పరిణామాలు ఆయనను ఇంటివైపు మరలించాయి. స్వదేశంలో చేయవలసిన పని చాలా వున్నదని గ్రహించాడు. సేవ చేయడమే లక్ష్యం. విదేశాలలో ఉంటే డబ్బు సంపాదన మీద ఎక్కువ సమయం వెచ్చించాలి. తిరిగి ఏమైనా చిక్కు సమస్యలు తలెత్తితే దక్షిణాఫ్రికాకు వచ్చే షరతు మీద మిత్రులు ప్రయాణానికి ఒప్పుకున్నారు.

నేటాల్ మిత్రులు ఊరూరా అభినందన పత్రాలు, కానుకలతో పాటు ప్రేమ, అభిమానం, గౌరవం పంచి ఇచ్చారు. అభిమానులు వెండి, బంగారం, వజ్రాలు కూడా కానుకగా ఇచ్చారు. క్లైంట్స్ వేలకొద్దీ రూపాయలు విలువ చేసే పెద్దకానుకలు రెండిచ్చారు.

ఈ విషయమై భార్యాబిడ్డలతో సంప్రదించి ఆ కానుకలను తిరిగి ఇవ్వాలని ఆలోచించాడు. రేపు గురించి, బిడ్డల భవితవ్యాన్ని గురించి ఏ మాత్రం ఆలోచించని గాంధీ ఎదుట కస్తూరిబా చాలా సేపు వాదించింది.

ఆ ఇల్లాలు కార్చిన అశ్రువులు గాంధీ గుండెలలో ఇంకిపోయాయి. 1891-1901 మధ్యకాలంలో వచ్చిన కానుకలన్నీ అమ్మి ఆ సొమ్మంతా బ్యాంకులో జమకట్టాడు. ధర్మకర్తలు ఆ సొమ్ము మీద వచ్చే వడ్డీని ప్రజాహిత కార్యాలకు ఉపయోగించాలని దానపత్రం వ్రాశాడు.

ఇలా చేసినందుకు కస్తూరిబా భర్తను నిందించలేదు. గాంధీకి పశ్చాత్తాపము కలుగలేదు. కుటుంబ అభ్యుదయానికి వ్యతిరేకంగా అతను చేసిన పని మంచిదేనని నమ్మడానికి ఆమె చాలా ప్రయత్నించింది.

కొంతకాలం తరువాత ఈ పనిలో ఔచిత్యాన్ని గ్రహించింది. ప్రజాసేవ చేసే కుటుంబాలకు ప్రలోభం ఉండకూడదు. సేవలకు మెచ్చుకుని ప్రజలు కానుకలు సమర్పిస్తారు. అవి సొంతానికే ననుకోవడం స్వార్థపూరితం. వాటిని సమాజపరం చెయ్యాలి.

మారిషస్‌లో కొంత కాలం ఉండి అక్కడ భారతీయుల సమస్యలను తెలుసుకున్నాడు. గవర్నరుగా నున్న "చార్లెస్ బ్రాన్" గాంధీగార్కి ఒకరాత్రి విందు ఇచ్చాడు.

1901లో కలకత్తా కాంగ్రెస్ 'వాచా'గారి అధ్యక్షతన సమావేశమవుతుంది. ఆ కాంగ్రెస్ సమావేశానికి వెళ్ళాలని గాంధీ నిర్ణయించుకున్నాడు.

కాంగ్రెస్‌వారితో గాంధీకి మొదటి సమావేశం అదే. బొంబాయి నుండి సర్ ఫిరోజ్‌షాతో కలసి కలకత్తాకు రైలులో ప్రయాణించాడు. ఆయన వైభవంగా ఒక పెట్టె అంతా పరివారం కోసం తీసుకున్నాడు. అందులోనే గాంధీ కూడా ప్రయాణం చేయాలి. పెట్టెలోకి ఎక్కిన తరువాత ఫిరోజ్‌షా మెహతాగారి చుట్టూ పెద్దలు చాలా మంది ఉండటం గమనించాడు. గాంధీ దక్షిణాఫ్రికాలో భారతీయుల అనుభవాలను చెప్పాలని ప్రయత్నించాడు. మెహతాగారు అతని మాటలను ముందుకు సాగనివ్వలేదు. కలకత్తా కాంగ్రెస్ మహాసభలో ఈ బాధలు చెప్పడం వలన ఒక తీర్మానం చేయవచ్చు. దాని వలన ఫలితం శూన్యం.

అసలు మన దేశంలో మనకున్న హక్కులేమిటి?

మనదేశంలో మనమెలా జీవిస్తున్నాము?

మన దేశంలో మనకి సుఖం, స్వాతంత్ర్యం లేనప్పుడు ఇతర దేశాలలో అవన్నీ పొందగలుగుతామని నీవెలా అనుకుంటున్నావు? అని ముక్కుసూటిగా ప్రశ్నించాడు.

మెహతాగారి ప్రశ్నలు విని గాంధీ నివ్వెరపోయాడు.

అతని మనసులో మరో కర్తవ్యం కళ్ళు విప్పింది. బోగీలో ఉన్న చెమన్‌లాల్, దిన్‌షాలు కూడా ఫిరోజ్‌షా గారి మాటలతో ఏకీభవించారు. ఆయన బొంబాయికే మకుటం లేని మహారాజు. మీ తీర్మానం కాపీని ముందుగా నాకు చూపమని అడిగాడు. అందుకు గాంధీ అంగీకరించాడు.

కలకత్తా చేరిన తరువాత ఫిరోజ్‌షా గారిని కార్యకర్తలు వైభవంగా స్వాగతం పలికి తీసుకుపోయారు. ప్రతినిధులు ఉండే విభాగంలో గాంధీకి చోటు దొరికింది.

లోకమాన్య బాలగంగాధర తిలక్‌గారు అక్కడకు విచ్చేశారు. ఆయన ఎక్కడ ఉంటే అదే దర్బారు. ఆయన శయ్యమీద కూర్చున్న తీరు చిత్రంగా గీయాలనిపించింది.

గాంధీ ఆయన కోసం వచ్చే అభిమానులను చూచి నివ్వెరపోయాడు. 'అమృత బజార్' పత్రిక అధిపతి మోతీబాబు కూడా వచ్చాడు. కాంగ్రెస్ ప్రతినిధులలో అంటరాని తనం ఉండటం గమనించాడు గాంధీ.

పారిశుద్ధ్యం విషయలో లోపాన్ని గమనించి తనే చీపురు వెదికి తెచ్చుకుని మరుగుదొడ్లు శుభ్రపరిచాడు. అది తనకు గౌరవంగా భావించాడు.

భూపేంద్రనాథ్‌బోసు, ఘోషాల్‌గార్లు కాంగ్రెస్ కార్యాలయంలో కార్యదర్శులు, వారి వద్ద పనిచేస్తే అనుభవం వస్తుందని వెళ్ళాడు. గుమాస్తా ఉద్యోగానికి ఒప్పుకున్నాడు.

ఆ తరువాత గాంధీ గురించి తెలుసుకుని అంత చిన్నపని ఇచ్చినందుకు వారు పశ్చాత్తాపం చెందారు. కార్యాలయానికి వచ్చే గోఖలే, సురేంద్రనాథ్ బెనర్జీలాంటి కాకలు తీరిన యోధులతో పరిచయాలు ఏర్పడ్డాయి.

కాంగ్రెస్ మహాసభలు ప్రారంభమయినాయి. ఆ సభలో గాంధీకి తన స్థానం ఎక్కడో అర్థం కాలేదు. గోఖలేగారు గాంధీగారిని వేదిక మీదకు తీసుకు వెళ్ళారు.

సర్ ఫిరోజ్‌షాగారు వాగ్దానం చేసిన ప్రకారం, తీర్మానం వేదిక మీదకు వస్తుందా? రాదా? అని గాంధీ సంశయించాడు. అందరూ ఇంటికి పోవాలని తహతహలాడే సమయ మైనది. ఫిరోజ్‌షాగారు, గోఖలేగారు గాంధీ చదువ వలసిన తీర్మానం గురించి చర్చించుకుని గాంధీని చదవమన్నారు.

వణుకుతున్న కంఠస్వరంతో చదివాడు గాంధీ. గోఖలేగారు తక్షణమే తన మద్దతు తెలపడంతో కాంగ్రెస్ మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. వాచాగారు అదనంగా మరో అయిదు నిముషాలు మాట్లాడమని కోరాడు.

ఉపన్యాసం వేళకు గొంతు పట్టుకు పోయింది. ఆచారం ప్రకారం ఉపన్యాసం ముగియడానికి రెండు నిముషాలకు ముందే వాచాగారు గంట కొట్టారు. వెంటనే ఉపన్యాసం ఆపాడు గాంధీ.

మొత్తం మీద గాంధీ ప్రతిపాదనకు కాంగ్రెస్ మహాసభ అంగీకార ముద్ర పడింది. గాంధీ కలకత్తాలోనే ఉంటున్నాడని తెలుసుకున్న గోఖలేగారు అతని బిడియం పోగొట్టడానికి ప్రయత్నించారు.

లార్డ్ కర్జన్; లార్డ్ హార్డింగ్ దర్బారులు వారి ప్రవర్తన గాంధీకి వెగటు కలిగించాయి. డాక్టర్ ప్రఫుల్ల చంద్రరాయ్‌గారితో పరిచయం ఏర్పడింది. ఆయనకు వచ్చే ఎనిమిది వందల రూపాయల నెల జీతంలో నలభై రూపాయలుంచుకుని మిగిలినదంతా ప్రజాసేవకు ఇచ్చేవాడు.

ఆయన బ్రహ్మచారి, దేశహితాన్ని గురించి ఎల్లప్పుడూ మాట్లాడుతూ ఉండేవాడు. గోఖలేగారు సమయాన్ని వృధా చేయరు. మాటలలో ఆడంబరం, డాంబికం ఉండదు.

కోర్టుకు వెళ్ళేటప్పుడు ట్రామ్‌లో కాకుండా సొంత గుర్రపు బండి మీద వెళ్ళేవాడు. కౌన్సిల్ మీద వచ్చే సొమ్మును సొంతానికి ఉపయోగించుకునేవాడు కాదు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వ్యాయామం చెయ్యడానికి గాని, షికారు వెళ్లడానికి గాని ఆయనకు తీరిక ఉండేది కాదు.

కాళీచరణ బెనర్జీ కూడా కాంగ్రెస్‌లు చురుకుగా పని చేసే వాడు. గోఖలేగారి అనుమతి తీసుకుని కాళీబాబును కలుసుకునేందుకు అనుమతిని సంపాదించాడు గాంధీ.

ఇంటికి వెళ్ళినప్పుడు నిరాడంబరంగా, నిశ్శబ్దంగా ఉన్నది. ఆయన భార్య మృత్యు శయ్య మీద ఉన్నది. కాళికాదేవికి జంతుబలులు ఇచ్చే విషయం గురించివారు మాట్లాడుకున్నారు.

ఆలయంలోకి వెళ్ళి చూడాలని గాంధీకి అనిపించింది. బలి ఇచ్చేటప్పుడు అమ్మవారి ఆలయంలో జంతువుల దీనాలాపనలు వినిపించకుండా నౌబత్ ఖానాలు మ్రోగుతుంటాయి.

ఆలయమంతా రక్తపు మడుగులలో ఉంది. గొంతు చించుకు అరచినా ఈ దురాచారాన్ని ఆపడం సాధ్యం కాదని, అది తన శక్తికి మించిన పని అని గుర్తించాడు గాంధీ.

జంతు వధ మాన్పించాలంటే మరింత ఆత్మశుద్ధి, త్యాగం అవసరమని గాంధీ ఊహించాడు.

బ్రహ్మసమాజంతో పరిచయం ఏర్పడింది.

ప్రతాప్ చంద్ర ముజుందార్ చరిత్ర, కేశవచంద్రసేన్ చరిత్ర చదివాడు. పండిత శివనాథశాస్త్రిని, మహర్షి దేవేంద్రనాథ్ ఠాగూర్‌ను సందర్శించాడు.

బ్రహ్మ సమాజం ఉత్సవాలను సందర్శించాడు.

శ్రీ వివేకానంద స్వామివారిని దర్శించేందుకు ఎంతో దూరం నడచి బేలూరు మఠంకు వెళ్ళాడు. స్వామి జబ్బుపడి కలకత్తాలో ఉన్నారని తెలిసింది. సోదరి నివేదితను చూచాడు గాంధీ. ఆమెకు కొద్దిసేపు దుబాసీగా వ్యవహరించి భావాలు కలవకపోయినా దేశభక్తి కలుస్తుందని గమనించాడు.

ఒకనాడు కలకత్తాలో రెడ్‌క్రాస్ సొసైటీ చేసిన సేవలను గుర్తించి వివరించగా అది విని గోఖలేగారు చాలా సంతోషించాడు. ఆయన నీడలో ఉన్నకాలం గాంధీకి మంచి ఊతాన్ని ఇచ్చింది.

ఆ సమయంలోనే బ్రహ్మదేశం అనగా బర్మాను సందర్శించాడు. బంగారు పగోడాలను, పూంగీలను సందర్శించాడు. అక్కడ స్త్రీల స్వేచ్ఛని, ఉత్సాహాన్ని గమనించాడు. గర్భాలయంలో పరుగెడుతున్న ఎలుకలు మోర్వీలో దయానంద సరస్వతి అనుభవాలను గుర్తుకు తెచ్చాయి. ఆ తరువాత గోఖలే గారిని విడిచిపెట్టి వెళ్ళడం చాలా కష్టమనిపించింది. భారతదేశమంతా మూడవ తరగతి రైలులో ప్రయాణం చేసి ప్రజల కష్టాలతో సన్నిహిత సంబంధం ఏర్పాటు చేసుకోవాలనిపించింది.

గోఖలేగారితో ఈ విషయం చెబితే ఆయన నవ్వాడు.

గోఖలేగారి వద్ద సెలవు పుచ్చుకుని గాంధీ సమగ్ర భారతదేశంలో పర్యటించడానికి కుంభయాత్రకి బయలుదేరాడు. ముందుగా కాశీకి వెళ్ళి జబ్బుపడి మంచముపై ఉన్న అనిబిసెంట్‌ను సందర్శించాడు.

కాశీ, ఆగ్రా, జైపూర్, పాలన్‌పూరు చూచి రాజకోటకు చేరుకున్నాడు. ప్రతిచోటా పండాలు, సత్రాలు మాత్రమే ఆశ్రయం. రైలుబండ్లలో క్రిక్కిరిసి ఉంటారు జనసం. అయినా ఛార్జీలు ఎక్కువే అనిపించింది.

మూడవ తరగతి ప్రయాణీకులను తెల్లవారు, అధికారులు గొర్రెల్లా చూస్తున్నారు. విదేశాలలో మూడవ తరగతి మన దేశంలో మొదటి తరగతితో సమానం అని గ్రహించాడు.

బీడీల పొగ, తమలపాకుల ఉమ్ములు, పొగాకు నమిలిన పిచికారీలు, బిగ్గరగా మాట్లాడుకోవడం, పోట్లాడుకోవడం ఇవన్నీ ప్రత్యక్షంగా అనుభవించాడు.

ఈ మూడవ తరగతిలోనే పట్టుదలగా ప్రయాణించాడు గాంధీ. రైల్వే అధికారులకు వారి లోపాలను గుర్తు చేస్తూ అర్జీలు పంపాడు.

కాశీ ఆలయంలో మురికి, పండాల ధన పిశాచకత్వం చాలా అసహ్యం అనిపించాయి. పండాల దుష్ప్రవర్తన నైతిక నియమాలకు విరుద్ధమనిపించింది.

ఆ తరువాత కాశీ విశ్వనాథుని దర్శించాడు. భగవంతుడు ఆయన పేరు మీద జరిగే మోసాలను ఎలా భరిస్తున్నాడో అర్థం కాలేదు.

అనిబిసెంట్‌కు దర్శనమిచ్చినందుకు ధన్యవాదాలు తెలిపి తిరిగి వచ్చేశాడు.

ఆ తరువాత రాజకోటలో ప్రాక్టీసు ప్రయత్నాలు చేసి, ఆ తరువాత బొంబాయికి మకాము మార్చాడు, గిరిగాంలో ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. పిల్లవాడికి సన్నిపాత లక్షణాలు చూపించాయి.

మణిలాల్ అప్పుడు పది సంవత్సరాల వయసువాడు. కోడిగుడ్ల రసం, కోళ్ళరసం పడితే తప్ప బ్రతకడని డాక్టరు చెప్పాడు. దాన్ని తిరస్కరించి జలవైద్యం చేయించాడు గాంధీ.

పిల్లవాడు ప్రాణాలతో గట్టెక్కాడు. రాబడి బాగానే పెరిగింది. గోఖలేగారు సహాయ సహకారాలు అందిస్తూనే ఉన్నాడు.

దక్షిణాఫ్రికా నుండి రావలసిన సొమ్ము చేతికి అందింది. దైవం తప్ప మిగిలినదంతా అసత్యమేనని నమ్మి దక్షిణాఫ్రికా బయలుదేరాడు.

ట్రాన్స్‌వాల్‌లో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయి. ప్రిటోరియా, దర్బన్ సందర్శించాడు. పాత మిత్రులను కలిశాడు. దక్షిణాఫ్రికాకు వచ్చిన పనులు నెరవేరలేదు. అయినా ట్రాన్స్‌వాల్‌లో స్థిరపడాలని గాంధీ భావించాడు.

భార్యాబిడ్డలను గురించిన ఆలోచన కలిగి పదివేల రూపాయలకు భీమా చేయించాడు. భార్యాబిడ్డలను దక్షిణాఫ్రికా చేర్చుకోవాలని కూడా ప్రయత్నించాడు. ఈ ప్రయత్నాలు కొనసాగలేదు.

ప్రతిరోజు రెండు మూడు గీతా శ్లోకాలను కంఠస్థం చేసేవాడు. తాత్విక చింతన పెరిగింది. అన్నగారు కుటుంబం గురించి ఆలోచించమని ఉత్తరం వ్రాస్తే తన ధోరణిలో ఏదో సమాధానం వ్రాశాడు. ఆ తరువాత అతడు చనిపోవడం కూడా జరిగింది. ఆ కుటుంబాన్ని ఆదుకోవడం గాంధీకి సాధ్యపడలేదు. తాత్వికత ఇంకా పెరిగింది. క్రమంగా జబ్బు చేసినప్పుడు మందు పుచ్చుకోవాలనే ఆలోచన కూడా సన్నగిల్లింది. అనేకమార్లు సత్యాగ్రహాలు చేసి జైళ్ళలో మ్రగ్గాడు.

ఎన్నో అనుభవాలను సంపాదించుకుని 1915 జనవరి 9న ఇండియాకు చేరుకున్నాడు.

ఇరవై ఒక్క సంవత్సరాల దక్షిణాఫ్రికా జీవితంలో ఆయన సంపాదించినది ఇరవై వేల పుస్తకాల మాత్రమే.

# 6. ఉద్యమ కెరటాలు

1885వ సంవత్సరంలో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించింది. అది జాతీయ ఉద్యమాన్ని నడుపుతోంది.

స్వాతంత్ర్యం కావాలి! పరాయి పాలన అంతరించాలి.

కాని ఈ ఉద్యమాన్ని నడుపుతున్నవారు, మేధావులు, ధనవంతులు, సామాన్యులను ఈ ఉద్యమంలో భాగస్వాములుగా చేర్పించటానికి చాలా కృషి చేయాలి.

గాంధీ భారతదేశం తిరిగి వచ్చిన తరువాత ఈ కార్యక్రమాన్ని చేపట్టాడు. తిలక్ మహాశయుని ఆశ్రయంలో ఉన్నప్పుడే అతడు దేశమంతా కుంభయాత్రలు చేశాడు.

దక్షిణాఫ్రికాలో ఉద్యమాలు నడుపుతున్నా భారతదేశ పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూనే ఉన్నాడు. ఈ ప్రజల ఆలోచనలు అర్థం చేసుకున్నాడు.

భారతదేశం ఏడువందల సంవత్సరాలుగా ఇతరుల దాడులను ఎదుర్కొంటోంది. ఇప్పుడు బ్రిటిష్‌వారి వలస సామ్రాజ్యవాద విధానం నడుస్తోంది. స్వదేశంలోనే ప్రజలు బానిసల్లా బ్రతుకుతున్నారు. ప్లాసీ యుద్ధం జరిగినది 1757లో. అప్పటి నుంచి బ్రిటిష్‌వారికి భారతదేశం మీద గుత్తాధిపత్యం లభించి జులుం సాగిస్తున్నారు.

1770లో ఇంగ్లాండులో పారిశ్రామిక విప్లవం జరిగింది. అప్పటి నుంచి ఈ దేశం నుంచి సంపదలు దోచుకుపోయి వారి దేశంలో పరిశ్రమలు స్థాపించుకుంటున్నారు. భారతదేశంలో అవిద్య, పేదరికం, కరువు కాటకాలు తాండవమాడుతున్నాయి. దరిద్ర్య దేవత దేశం మీద నర్తిస్తోంది. వందల వేల సంఖ్యలో ఆకలి చావులు సంభవించుతున్నాయి. 1857లో తొలిసారి బ్రిటిష్ పాలకుల మీద తిరుగుబాటు జరిగింది.

ఈస్టిండియా పాలన బ్రిటిష్‌రాణి చేతుల్లోకి వెళ్ళింది. బ్రిటిష్ పాలనలో భారతదేశంలో 29సార్లు క్షామాలు ఏర్పడ్డాయి. అంటే ఈ దేశ ప్రజలు ఎంత దోచుకోబడ్డారో, ప్రస్తుతం ఎంత దీనులై జీవిస్తున్నారో గాంధీకి అర్థమయింది.

ప్రజల మధ్య పర్యటనలు చేసి సురేంద్రనాథ్ బెనర్జీలాంటి వారు చైతన్యం రగుల్చుతున్నారు. దయానంద సరస్వతి మూఢాచారాలతో మ్రగ్గిపోతున్న జాతిని కళ్ళు తెరిపించేందుకు ఆర్య సమాజ స్థాపన చేశాడు.

మండుతున్న కడుపు మంటలకు కారణం ఆకలి, ఆక్రోశం! రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, తిలక్‌లాంటివారు కాళీ, గణేష్ ఉత్సవాలకు క్రొత్త అర్థాలు చెప్పారు.

మాక్స్‌ముల్లర్ లాంటివారు భారతీయుల తాత్త్విక వైభవాన్ని చాటుతున్నారు.

లాలాలజపతిరాయ్, బిపిన్‌చంద్రపాల్, బాలగంగాధర్ తిలక్‌లు లాల్, బాల్ పాల్ అనే పేర్లతో ప్రజలలో ఆవేశం రగుల్చుతున్నారు.

స్వాతంత్ర్యం నా జన్మహక్కు అని సింహనాదం చేశాడు తిలక్! దేశం గర్జిస్తోంది.

ఇదంతా కాగితం పులిలాంటి బెదిరింపు. కాంగ్రెస్ పతనావస్థకు పరిగెడుతోంది అంటూ రాణికి వార్తలు పంపుతున్నారు లార్డ్ కర్జన్ లాంటివారు.

మండుతున్న మంటల్లోకి ఒంటరిగా వచ్చాడు గాంధీ. వందేమాతరం అంటూ మిత్రులు స్వాగతం పలికారు.

ఖుదీరంబోస్, మదన్‌లాల్ వంటి త్యాగధనులు అప్పటికే భరతమాత స్వేచ్ఛ కోరి ప్రాణాలను అర్పించేశారు.

ముస్లింలీగు వేరుగా పనిచేస్తోంది.

1916లో కాంగ్రెస్, ముస్లింలీగ్ ఒకే అభిప్రాయానికి వచ్చాయి. ఈ సంవత్సరమే అనిబిసెంట్ హోం రూలు ఉద్యమం ప్రారంభించింది.

తిలక్ జైలు నుండి విడుదల పొంది విశ్రాంతి తీసుకుంటున్నాడు. లాలాలజపతి రాయ్ దేశబహిష్కారం పొందాడు. అరవిందఘోష్ రాజకీయాలు విరమించి సన్యసించాడు. గాంధీ వచ్చే నాటికి నాయకత్వం స్తబ్ధుగా ఉంది. వచ్చీ రాగానే 1915లో సత్యాగ్రహం కోసం అహమ్మదాబాద్‌లో ఆశ్రమం స్థాపించాడు గాంధీ. 1916లో అస్పృశ్యులను చేర్చుకుంటున్నాడని ఆశ్రమంలో వారే కొందరు ఎదురు తిరిగారు. ఆర్థిక సహాయం నిలిపివేశారు.

1917 ఏప్రిల్‌లో చంపారణ్యంలో రైతుల నీలిమందు పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. రైతుల పరిస్థితి బాగు చేయలేకపోతే దేశం అభివృద్ధి చెందినట్లు కాదని గాంధీ అప్పుడే గ్రహించాడు.

గ్రామాలలో పారిశుద్ధ్యం పనులు, విద్యావ్యాప్తికి చాలా కృషి చేశాడు. గాంధీ నాయకత్వంలో నీలిమందు తయారీ ఉద్యమంలో రైతులే జయించారు.

రైతుల సమస్యలతోపాటు, కార్మిక పోరాటాల పట్ల కూడ గాంధీకి ప్రత్యేకమయిన శ్రద్ధ ఏర్పడింది. అహింసాయుతమయిన ఈ పోరాటాల తీరు అందరిని ఆకట్టుకుంటోంది. అంబాలాల్ సారాభాయ్ సోదరుల వంటివారు, మిల్లు యజమానులు కూడ అతని పట్ల ప్రశంసల వర్షం కురిపించారు.

కాని కార్మికులు శాంతి పోరాటాల ద్వారా హక్కుల సాధన అసాధ్యమని భావించారు. నిరుత్సాహపడ్డారు. ఉపవాసదీక్ష ప్రారంభించి యాజమాన్యాన్ని హడల గొట్టేశాడు గాంధీ. బోనస్  ప్రకటించారు.

ఇక కార్మికులు కూడ శాంతి విధానంతో హక్కుల పోరాటం సాధ్యమనే విషయం ఒప్పుకొనక తప్పలేదు.

ఈ విషయాలను పత్రికలు వేనోళ్ళ పొగిడి ప్రచారం చేశాయి. అన్ని వర్గాలకు గాంధీ ఆరాధ్యుడయినాడు. ఈ సమయంలో బోధాలో కాటకం ఏర్పడింది. శిస్తులు కట్టేందుకు రైతులు నిరాకరించారు. ప్రభుత్వం దమనకాండ సాగిస్తోంది.

గాంధీగారు సర్దార్ వల్లభాయ్ పటేల్‌తో కలిసి రైతుల మధ్యకు ఉరికాడు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహం మార్గాలలో వారికి మార్గదర్శకత్వం ఇచ్చాడు.

ఈ పోరాటంలో కూడ గాంధీదే విజయం, శిస్తులు రద్దు అయినాయి.

# 7. జలియన్‌వాలాబాగ్

గాంధీ భారతదేశం వచ్చిన తరువాత ప్రారంభ ఉద్యమాలు అన్నింటిలో విజయమే సాధించాడు.

నాయకులు, మేధావులు సంపన్నుల మధ్య ఆయన కథా నాయకుడల్లే పైకి వచ్చాడు. అంతేకాక ఇంతకు పూర్వపు నాయకులు సాధారణ ప్రజానీకంలో, గ్రామీణులు, అవిద్యావంతులలో ఎక్కువ ప్రచారం పొందలేదు. గాంధీ ఈ లోటు భర్తీ చేశాడు.

ఈ ఉద్యమ విజయాల వల్ల సాధారణ ప్రజానీకంలో అతని నాయకత్వం పట్ల అచంచల విశ్వాసం ఏర్పడింది. ఆయనకు "గాంధీజీ" అనే సంబోధన లభించింది.

హిందూ, ముస్లింలు భాయి భాయిగా మసలు కొనకపోతే స్వాతంత్ర్య పోరాటం తీవ్రతరం చేయటం కష్టమని ఆయన భావించాడు. కలకత్తా ముస్లింలీగ్ సమావేశంలో కూడా ఉపన్యసించాడు. కేవలం పోరాటాలే కాకుండా కొన్ని అంశాలలో ప్రభుత్వానికి సయోధ్య కల్పించాలని అతని ఆశయం. 1918లో ప్రజలను సైన్యంలో చేర్పించమని బ్రిటిషు ప్రభుత్వం గాంధీని కోరింది. అందుకోసం గాంధీ దేశపర్యటన చేశాడు. అనారోగ్యానికి మందులు నిరాకరించి సబర్మతీ ఆశ్రమం చేరుకొన్నాడు. ప్రకృతి వైద్యంతో పూర్తిగా కోలుకొనకముందే పత్రికలు రౌలత్ చట్టాన్ని గురించి వ్రాశాయి. హింసను అదుపు చేసే పేరుతో వలస సామ్రాజ్యవాదులు ఈ చట్టాన్ని రూపొందించారు. సరోజినీ నాయుడు, సర్దార్‌వల్లభాయి పటేల్, హార్నియన్‌లతో కలసి దేశవ్యాప్త హర్తాళ్‌కు పిలుపు ఇచ్చాడు గాంధీ. ఏప్రిల్ 6వ తేదీన ఈ పిలుపుకు ప్రతిస్పందించిన తీరుచూసి బ్రిటిషు ప్రభుత్వం గడగడలాడింది.

గాంధీకి ప్రజలలో ఎంత పలుకుబడి, ప్రభావము ఉన్నాయో తెలుసుకున్న భారతీయ నేతలు కూడా ముక్కు మీద వేలేసుకున్నారు. అతని నాయకత్వం ఉజ్వలమైనదని గుర్తించారు.

రౌలత్ చట్టం పేరుతో వచ్చిన నల్లచట్టాలు పౌరహక్కులను కాలరాస్తున్నాయి. విచారణ లేకుండా ఎవరినైనా నిర్బంధించవచ్చు. బలవంతంగా సైన్యంలోకి చేర్చుకోవచ్చు. అప్పుడే ఆహార పదార్థాల కొరత ఏర్పడింది. మరోవంక రోగాలు ప్రబలుతున్నాయి.

పరిస్థితి దుర్భరమైంది.

దేశభక్తులు కొందరు హింసామార్గము అవలంభించకుండా ఈ పరిస్థితులను జయించలేమని భావించారు. కత్తికి కత్తిసాటి. రక్తానికి రక్తం. ప్రతీకారం, హింసకు ప్రతిహింసే శరణ్యం అనుకొన్నారు. ఈ పరిస్థితుల్లోనే గద్దర్ పార్టీ ఏర్పడింది. బెంగాల్ పులులు విప్లవించాయి. హింస, ప్రతిహింసలు జరిగాయి. స్వదేశీయులు కలకత్తాలో బాంబులు తయారుచేశారు. అలీపూర్ కుట్రలో అనేకమంది మీద కేసులు పెట్టారు.

మూడువందల పది తిరుగుబాట్లు జరిగాయి. ప్రేలుడు పదార్థాల చట్టాలు చేశారు. క్రిమినల్‌లా సవరించారు. సావర్కార్, హరిదయాళ్, చటోపాధ్యాయ విదేశాలలో ప్రచారం చేస్తున్నారు.

ప్రభుత్వం, జస్టిస్ రౌలత్ నాయకత్వాన రాజద్రోహ నేరాల విచారణ కమిటీని నియమించింది. కరపత్రాలు, సాహిత్యం కూడా నేరమేనని ప్రకటించింది. 1919లో ఈ చట్టం ఆమోదాన్ని పొందినది.

పౌరహక్కులను మంటగలిపే ఈ నల్లచట్టాన్ని వ్యతిరేకిస్తూ యావద్భారత జాతి పిడికిళ్ళు బిగించింది. గాంధీ క్రూరమైన ఈ చట్టాన్ని నిరసిస్తూ ఉద్యమం చేపట్టాడు. ఆకలిచావులు లెక్కల్ని అధిగమించాయి. పంజాబులో ఈ ఉద్యమ ప్రభావం శృతి మించింది.

ఆ రాష్ట్రానికి అప్పటి గవర్నరు ఒడయర్.

అతనినే డయ్యరు సేనాని అని పిలిచేవారు. అతడు నిరంకుశతత్త్వం కలిగిన పాలకుడు. సామాన్యులను చెండుకు తినేవాడు. అంతేకాక మేధావులను, విద్యాధికులను చిత్రహింసలు పెట్టి పలురకాల అవమానాలకు గురి చేశాడు.

1918లో బొంబాయిలో కాంగ్రెస్ మహాసభలు జరిగాయి.

పంజాబు కార్యకర్తలు ఆ సభలో తీవ్రతరమయిన హెచ్చరికలు చేశారు. మేము అగ్నిపర్వతం మీద నివసిస్తున్నాం. అది ఏ క్షణంలో అయిన ప్రేలిపోవచ్చు అని తెలియజేశారు.

ఏప్రియల్ ఆరున జరిగిన హర్తాళ్‌ను కూడ ఒడయర్ క్రూరమయిన పద్ధతుల్లో ఎదుర్కొన్నాడు. ఉద్యమకారుల ఉత్సాహం నీరు కారిపోవటానికి ఎన్నో ఆజ్ఞలు జారీ చేశాడు.

విద్యావంతులు ప్రజలకు ఏమీ చెప్పకూడదు. సభలు జరుపకూడదు. సత్యపాల్‌బోసు మీద నిషేధం విధించాడు.

అప్పుడే గాంధీని అరెస్టు చేసి ఢిల్లీ నుంచి బొంబాయికి దారి మళ్ళించారు. తగిన శిక్షణ ఇవ్వకుండా కార్యకర్తలకు పిలుపు ఇచ్చినందుకు గాంధీ పశ్చాత్తాపపడి మూడు రోజుల నిరసన దీక్ష చేశాడు. హింసకు వ్యతిరేకంగా ఆత్మశుద్ధి పొందటానికి ప్రజలందరూ ఒకరోజు నిరాహార దీక్ష చెయ్యమన్నాడు.

సేనాని డయ్యరు పడగనీడలో ఉన్న పంజాబులో రెండుసార్లు హర్తాళ్ జరిగింది. గాంధీ అరెస్టు వార్తతో ప్రజా జీవితం స్తంభింపచేశారు. శాంతియుతంగా ఊరేగింపు జరుపుతున్న విద్యార్థులపై కాల్పులు జరిగాయి.

లాహోరు నగరంలో పదిహేనువేలమంది సమావేశం అయితే వారి మీద కాల్పులు జరిగాయి. బాద్షాషి మసీదులో ప్రార్థనలు చేస్తున్నవారి మీద కూడ తుపాకి గుండ్లు వర్షించాయి.

గోహత్య జరిగిన తరువాత గుజ్రన్‌వాలా అతలాకుతలమయింది. పంజాబు అంతా అట్టుడికి పోతూ ఉంది. ప్రజలు రెచ్చిపోయి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయసాగారు. ఉద్రిక్త హింసాపూరిత వాతావరణం ఏర్పడింది.

పంజాబు అంతా ఈ స్థితిలో ఉండగా ప్రధాన నగరమైన అమృతసర్‌లో డాక్టర్ సత్యపాల్, డాక్టర్ కిచ్‌లాలూ ఉద్యమాన్ని నడిపిస్తున్నారు. డయర్ సేనాని వారికి బహిష్కార శిక్ష విధించారు. నగరం ఉడికిపోయింది. గుమికూడిన ప్రజలపై సైనికుల చేత కాల్పులు జరిపించాడు. అమాయకులు నలుగురు మరణించారు. అనేకమంది గాయపడ్డారు.

ఈ వార్త నగరం అంతా దావానలంలా వ్యాపించింది. క్రైస్తవ మిషనరీలో డాక్టరమ్మగా పనిచేస్తున్న కుమారి షేర్‌ఉడ్‌ను అపస్మారం కలిగేలా జనం కొట్టారు.

ఈ పరిస్థితులలో ప్రభుత్వ ఆదేశాల మేరకు డయ్యర్ అమృతసర్ వచ్చాడు. మరునాడు ప్రజలను భయపెట్టేందుకు కరకు బూట్ల సైనికులతో కవాతులు జరిపించాడు. నిర్దోషులను

హింసించాడు. హెచ్చరికలు లేవు. విచక్షణ వివేచనా లేవు. నిషేధం విధించి ప్రజలకు తెలియజేయలేదు.

వైశాఖ మాసపు పర్వదినాన, పంజాబు పండగ చేసుకోవాలనుకుంది. అమృతసర్‌లో జరిగే ప్రార్థన, సమావేశాలు, ఉత్సవాలలో పాల్గొనేందుకు అమాయక స్త్రీ, పురుషులంతా కదలి వచ్చారు. బాలురు, వృద్ధులతో క్రిక్కిరిసి పోయింది.

జలియన్‌వాలాబాగ్‌లో సాయంత్రపు వేళ సమావేశము ప్రారంభమైనది. ఒకే ద్వారము కలిగిన ఎత్తైన గోడల మధ్య జనం చేరుతున్నారు. స్త్రీ–పురుషులు, బాలవృద్ధులు, నిరాయుధులు అమాయకంగా పాల్గొన్నారు.

జలియన్‌వాలాబాగ్‌లో సమావేశం జరుగుతుందని డయ్యర్ సేనానికి తెలిసి పోయింది. వెంటనే సాయుధదళాలను కదలించాడు. శాంతియుతంగా జరుగుతున్న సభలో ప్రవేశించాడు. సభికులను వెళ్ళిపొమ్మని సూచన కూడా ఇవ్వలేదు. ఇటువంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్నాడు. సమయం వచ్చింది.

ఆ కిరాతకుడు సైనికులకు కాల్పులు జరపమని ఆదేశాలను ఇచ్చాడు. సరిగ్గా పది నిముషాల సేపు తుపాకులు గర్జించాయి. తూటాలు వర్షం కురిశాయి. పదహారువందల యాభై రౌండ్లు తూటలు కాల్చారు.

చనిపోయిన వారి సంఖ్య వేయికి దాటింది. అసంఖ్యాక అమాయక ప్రజలు గాయపడి జలియన్‌వాలాబాగ్ రక్తపు మడుగుగా మారిపోయింది. ఎటు పరిగెత్తాలో ప్రాణాలు ఎలా రక్షించుకోవాలో తెలియక జనం ఘోషించారు. ప్రాణభయంతో ఆర్తనాదాలు చేశారు. అది మానవత్వం మట్టి కలిసిన రోజు.

గాయపడిన వారికి వైద్యం అందించాలనే కనీసం ఆలోచన లేకుండా అలాగే వదిలేశాడు. పీనుగుల ప్రోగుల మధ్య పిల్లలు నిరాశ్రయులై, అనాధలుగా నిలిచారు.

అతని కిరాతక ఘాతుకాలు అంతటితో నిలిచిపోలేదు. దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా ఈ వార్త పెద్ద కుదుపు. మానవత్వం మీద అవమానకరమైన మచ్చలాంటి డయర్ సేనాని నగరంలో తిరుగుబాటు చెలరేగకుండా క్రూరమైన మార్షల్‌లా విధించాడు. సైనికులు దమనకాండ సాగించడానికి ఆదేశాలిచ్చాడు. అడుగడుగునా అమానుషాలే జరిగాయి.

కాంగ్రెసు కార్యకర్తలను చిత్రహింసలు పెట్టాడు. ఆంగ్లేయ పతాకానికి సెల్యూట్ చేయని వారిని దారుణంగా హింసించారు. వీధులలో సైనికులు ప్రజల వెంటబడి కొరడాలతో కొట్టారు.

కుమారి షేర్‌వుడ్‌ని కొట్టిన బజారులో భారతీయులని శవాలులా దొర్లించి లాగించాడు. మార్షల్‌లా ప్రకారం ఈ విషయమై విచారణ జరిపించడానికి హంటర్ కమిటీ వేశారు. కమిటీ ముందు తన కిరాతక ఘాతుకాలను సగర్వంగా వల్లించాడు డయ్యర్ సేనాని.

అదుపు తప్పిన పంజాబును భయపెట్టి దారిలో నడిపించడానికి ఈ పని చేశానని బహిరంగంగా ప్రకటించాడు.

ప్రపంచ చరిత్రలో కనీవినీ ఎరుగని ఈ అమానుష దురంతాన్ని దహనకాండని సాగించినందుకు డయ్యర్ సేనాని రవ్వంత కూడా పశ్చాత్తాపాన్ని పొందలేదు.

ప్రభుత్వం అతనికి మద్దతుగా నిలిచింది. అతని తప్పేమీ లేదని ప్రకటించింది. ఉద్యోగానికి రాజీనామా చేయించింది. ఇది కూడా కేవలం ప్రజల భయాందోళనలు తొలగించడానికేనని వారు చెప్పారు.

డయ్యర్ సేనాని దురాగతాన్ని "హౌస్ ఆఫ్ లాడ్స్" వారు సమర్ధిస్తూ ఒక తీర్మానాన్ని చేశారు. ఆంగ్లేయులు అతనిని సన్మానించారు. పర్సు కూడా బహూకరించారు. ఈ సంఘటనకు ప్రతిస్పందించిన రవీంద్రనాథ్ ఠాకూర్ బ్రిటిష్ వారిచ్చిన 'సర్' బిరుదుని వదిలిపెట్టాడు.

ఈ సంఘటన జరిగేంతవరకు ఒక పౌరుడుగా ప్రభుత్వంతో కలసి పనిచేస్తున్న గాంధీ అది కూడా చేయరాదని తీర్మానించుకున్నాడు. 1919లో నవజీవన్, ఎంగ్ ఇండియా స్వాతంత్ర్యోద్యమ సందేశాలను అందించే పత్రికలుగా స్థాపించాడు.

ప్రజలకు మార్గదర్శకత్వం వహించి ముందుకు నడిపించే వ్యాసాలెన్నింటినో రచించాడు. జరుగుతున్న వాస్తవాలను కన్నులకు కట్టినట్లుగా అభివర్ణించి భారత ప్రజలను చైతన్యపరిచాడు.

ఈ సమయంలోనే గాంధీజీ మరోసారి దేశ పర్యటన చేశాడు. ఆలీ సోదరులు అతనికి మద్దతుగా నిలిచారు. హిందూ, ముస్లిం "భాయిా భాయిా' నినాదం దేశం నలుమూలలా చాటించాడు.

1920 అక్టోబర్ 17వ తేదీన హిందూ, ముస్లిము ఐక్యతాదినంగా ప్రకటించాడు. వారంతా కలసి పని చేయాలని ప్రబోధించాడు.

ముస్లిం మహిళలు గాంధీజీ సమక్షానికి వచ్చేందుకు బురఖాలను ధరించేవారు కాదు. బురఖా ధరించకుండా ముస్లిమ్ స్త్రీలు గాంధీతో మాట్లాడటానికి వారి కుటుంబాల నుండి అనుమతి లభించేది.

సత్యదీక్షాపరుడైన గాంధీ పవిత్రుడు అని అన్ని మతాలవారు నమ్మకాన్ని పెంచుకున్నారు.

ఆ సంవత్సరమే కలకత్తాలో హిందూ, ముస్లిమ్‌ల సమైక్యత కొరకు ఒక సమావేశం ఏర్పాటు చేశారు. దీని వల్ల వారి ఆలోచనల మధ్య అంతరాలు తగ్గి సోదరుల వలె కలిసి పోయారు.

గాంధీ ఖిలాఫత్ (సమైక్యత) ఉద్యమం నడిపేందుకు తిరుగు లేని నాయకుడుగా గుర్తింపును పొందాడు.

భారతదేశ ప్రజలందరూ కులమతాల అంతరాలను మరచి ఒక్కటిగా మనుగడ సాగించాలని అతడు కోరుకున్నాడు. అందుకోసమే గాంధీ తీవ్రంగా కృషి చేశాడు.

# 8. సహాయ నిరాకరణ

భారతదేశానికి గాంధీ నాయకత్వం ప్రభావాన్ని కలిగి ఉన్నదని ఆయన విధానాలు సఫలమవుతున్నాయని ప్రపంచమంతా గుర్తించింది. బిపిన్ చంద్రపాల్‌లాంటి విద్యాధికుల సామాన్యుల ముంగిటలో గాంధీజీ ఆరాధ్యుడు కావడమే ఇందకు కారణమని విశ్లేషించారు.

గాంధీ భారతదేశంలో అన్ని వర్గాలకు ఏకైక మార్గదర్శకుడుగా అవతరించాడు. బ్రిటిషు వాళ్ళు ఈ విషయాన్ని గుర్తించి కలవరపడ్డారు. దేశమంతా వారి అధీనంలోనే ఉంది. కానీ ప్రజలు మాత్రం మనసులో గాంధీని ఆరాధిస్తున్నారు. భారతీయులు మూఢులు, అజ్ఞానులు అని వలస సామ్రాజ్యవాదులకు ఒక అపోహ. భారతజాతి ప్రజల మేధాసంపత్తిని వారు అనుమానించారు. ప్రపంచాన్ని పాలించటం, అందుకోసం విద్రోహాలకు పూనుకోవటం చాలా గొప్ప సంగతి అని వారు అనుకున్నారు. వలస దేశాలలో వారి పరిపాలన శాశ్వతమనే వారు అనుకున్నారు. వేర్పాటు కలిగించి ప్రజలను పాలించటం సాధ్యమనే వారు అనుకున్నారు. విభజించి పాలించే విధానాన్ని హిందూ-ముస్లిముల సమైక్యతా సాధన దావరా తిరుగులేకుండా త్రిప్పికొట్టాడు గాంధీ. అంటరానితనం, హరిజనులను వేరుగా చూడటం, స్త్రీలకు సమాజంలో అన్ని రంగాలలో సమాన భాగస్వామ్యాన్ని ఇవ్వటం లాంటి ప్రయోగాల ద్వారా వేర్పాటువాదాన్ని ఎదిరించాడు.

'అమృత బజార్' పత్రికలో గోసంరక్షణ మీద వ్యాసాలు రచించాడు. ఆస్తిని కలిగి ఉండటం నేరమని, ఇతరులను దోచుకోవటమే అని సంపన్నులకు బోధించాడు. స్వార్థాన్ని జయించకపోతే స్వాతంత్ర్యాన్ని దక్కదని హెచ్చరించాడు. ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేయాలి. అందుకు పనికివచ్చే చట్టాలను నిర్మించాలి. కానీ, బ్రిటిష్ పాలకులు ఆయన ఊహలకు, ప్రజల కోర్కెలకు వ్యతిరేకమైన నిర్ణయాలను ప్రకటిస్తున్నారు. ప్రజల క్షేమం ముఖ్యం. ప్రజాహితానికి పనికిరాని చట్టం- చట్టమే కాదు. దాన్ని వ్యతిరేకిస్తే తప్పు లేదని ప్రజలకు హితవు చెప్పాడు.

దుశ్శాసన శాసనాలను చేస్తున్న బ్రిటిష్ వలస సామ్రాజ్యవాద గుత్తాధిపత్యాన్ని ధిక్కరించండి, బహిష్కరించండి. అందుకోసం అవసరమయితే ప్రభుత్వ ఉద్యోగాలను కూడ విడిచిపెట్టి రావలసినదిగా పిలుపునిచ్చాడు. ఆ చట్టాలను చేసిన చట్టసభలు ప్రజల దృష్టిలో పనికిమాలినవిగా నిరూపించాడు. విదేశాల నుండి వచ్చే ప్రతి వస్తువును బహిష్కరించమని చెప్పాడు. స్వదేశీ ఉద్యమానికి అంకురార్పణ జరిగింది.

ఖాదీ ఉద్యమం మొదలయింది. చరఖా చక్రాలు గిరగిర తిరుగుతున్నాయి. అవి తమ జీవిత చక్రాలను మార్చుతాయని ప్రజలు నమ్ముతున్నారు. స్వరాజ్య సాధనకు చరకాయే చిహ్నము. కొంతమంది భారతీయ మేధావులు మహమ్మద్ ఆలీ జిన్నా, శ్రీనివాస శాస్త్రిలాంటి వాళ్ళు చరఖా ఉద్యమం సరియైనది కాదని భావించారు. చట్టాలను వ్యతిరేకించటం సమస్యలతో కూడుకున్న పని అని ప్రకటించారు. గాంధీ ఈ చిక్కుముడిని తేలికగా విప్పేశాడు. ప్రజలు తమ సమస్యలను కోర్టుల ద్వారా కాకపోతే ప్రత్యేక బోర్డుల ద్వారా పరిష్కరించుకోవచ్చునని మార్గాంతరాన్ని సూచించాడు. సహాయ నిరాకరణ అంటే అరాచకం కాదని నిర్వచించాడు. తన పోరాటం ఆంగ్లేయుల చెడ్డ విధానాల మీదనే కానీ, ఆంగ్లేయుల మీద కాదని ప్రకటించాడు. ఉన్నతమైన లక్ష్యాలను సాధించటానికి మార్గాలు కూడ ఉన్నతంగా ఉండాలి. పట్టిన పట్టు విడిచిపెట్టటం గాంధీకి సమ్మతం కాదు. ఆయన వాదాన్ని మన్నించి 1920 డిశంబరులో నాగపూర్ కాంగ్రెసు సహాయ నిరాకరణ ఉద్యమాన్ని సమర్థించింది. సరిగ్గా అప్పుడే గాంధీయిజమ్, గాంధీయుగం ప్రారంభమైనాయి.

నాగపూర్ సభలో ఒక అద్భుతం జరిగింది. రవీంద్రనాథ్ ఠాగూర్ ఉపన్యసిస్తూ గాంధీని 'మహాత్మా' అని సంబోధించాడు. మోతీలాల్ నెహ్రూ, రాజేంద్రప్రసాద్, పటేల్, రాజగోపాలాచారి వంటి ప్రముఖులు జేజేలు పలికారు. భారతదేశం నలుమూలలా ఉన్న అటువంటి మహనీయులు ఎందరో గాంధీజీ ప్రభావానికి లోనై ఆయన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. 1921 ఏప్రిల్‌లో రైల్‌రోకో నిర్వహించాడు గాంధీ మహాత్ముడు. విదేశీవస్తువులు, విదేశీ విద్య, అస్పృశ్యత, అవిద్య, మతవేర్పాటు, మద్యపానం, అనైక్యత ఇవన్ని విడిచి పెడితే కాని స్వరాజ్యం దక్కదని ప్రజలకు చెప్పాడు.

లార్డ్ రీడింగ్ వైస్రాయ్‌గా వచ్చాడు. యువరాజు ఎడ్వర్డ్ భారతదేశం సందర్శించాడు. అతని ఎదుటే విదేశీవస్త్రాలను దగ్ధం చేయించాడు గాంధీ. ఈ సందర్భంలో జరిగిన హింసాకాండకు నిరసనగా ఉపవాస దీక్షకు కూర్చున్నాడు. యువరాజు పర్యటించేటప్పుడు వీథులు నిర్మానుష్యంగా ఉన్నాయి. సహాయ నిరాకరణ ఉద్యమానికి గుజరాత్‌లోని బోర్డోలి తాలూకాను కేంద్రంగా ప్రకటించాడు.

ఇక్కడే మొట్టమొదటిసారిగా రవి అస్తమించని ఆంగ్లేయ సామ్రాజ్య అధికారులతో కాంగ్రెస్ కార్యకర్తలు ముఖాముఖి పోరాడి గెల్చారు.

దుష్పరిణామాలు చాలా జరిగాయి. గాంధీ ప్రజలకు మరింత తర్ఫీదు నివ్వాలని సత్యాగ్రహాన్ని వాయిదా వేశాడు. 1924లో కౌహట్‌లో 155మంది హిందువులు చనిపోగా గాంధీజీ 21 రోజులు నిరాహార దీక్ష చేశాడు. గాంధీజీ వ్రాసిన వ్యాసాలకు సి.ఆర్.దాస్. లాంటి వారు హర్షం తెలియజేయగా, యంగ్ఇండియాను మూసివేసి గాంధీజీని మార్వాడా జైలులో పెట్టారు. ప్రభుత్వం 1927లో "రాయల్ కమీషన్" ఏర్పాటు చేసింది. దీనినే "సైమన్ కమీషన్" అంటారు. దీనిని వ్యతిరేకించి మోతీలాల్‌నెహ్రూ సొంత రాజ్యాంగాన్ని రూపొందించాడు. మహాత్ముని ప్రభావంతో "సైమన్ గోబాక్" అని నినాదాలు దేశమంతా మిన్నుముట్టాయి. అసెంబ్లీలో బాంబులు పడ్డాయి. 1929లో విదేశీ వస్త్ర దహనం, కలకత్తా లోని గాంధీ అరెస్టు, భగత్‌సింగ్-దత్తుల ఉగ్రవాద కలాపాలు జరిగాయి. ప్రభుత్వం అనివార్యమైన పరిస్థితులలో సేఫ్టీ బిల్లును రూపొందించింది. డిశంబర్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించమని కోరగా, గాంధీ మహాత్ముడు ఆ బాధ్యతను జవహర్ లాల్‌నెహ్రూకు అప్పగించాడు.

1930 జనవరి 26న భారతదేశం స్వతంత్ర దేశమని గాంధీజీ ప్రకటించాడు. నెహ్రూతో సంబంధాలు బాగా బలపడ్డాయి. ఆడంబరమైన వేషాలు మాన్పించి, గాంధీ టోపి, ఖాదీవస్త్రాలు ధరింపజేశాడు. జవహర్ లాల్ నెహ్రూ తన వారసుడని చెప్తూ ఉండేవాడు మహాత్ముడు.

నెహ్రూ గాంధీజీ గురించి ఇలా చెప్తూ ఉండేవారు.

"ఈ దేశం మహాత్మాగాంధీని నాయకునిగా ఎంచుకుంది. అనేక ఉద్యమాలలో ఆయన దగ్గర శిక్షణ పొందిన సైనికుడిగా నేను పనిచేశాను. అనేక ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిన వాడు మహాత్ముడే".

1931లో భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను ఉరితీయకుండా విడిచిపెట్టమని వైస్రాయ్‌కి చెప్పాడు మహాత్ముడు. లార్డ్ ఇర్విన్‌కు లేఖ కూడా వ్రాశాడు. 1932 జనవరిలో మళ్ళీ అరెస్టు అయ్యాడు. మొత్తం మీద గాంధీ, నెహ్రూలు దేశానికి ఆశాకిరణాలుగా నిలిచారు.

"ప్రేమ ద్వారా బాపూ మాటలు ప్రజల మనసుల్లోకి పరిమళంలా వ్యాపిస్తాయి. వారి హృదయాలను శాసిస్తాయి" అని చెప్పాడు. లూయీ ఫిషర్. 1930లో అహమ్మదాబాద్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. భారత సముద్ర జలాలలో తయారైన ఉప్పును భారత ప్రజలే సేకరించాలని, ఆ విధంగా శాసనోల్లంఘన చేయాలని పెద్దలు ఆ సమావేశంలో నిర్ణయించారు.

# 9. ఉప్పుసత్యాగ్రహం

మహాత్ముడు వైస్రాయ్‌కి లేఖ వ్రాశాడు. అది చదివి ఆంగ్లేయులు ఎగతాళి చేశారు. వారికి అర్థం కాని విషయం ఏమిటంటే ఉప్పును సేకరించడం ద్వారా భారత ప్రజలు స్వాతంత్ర్యాన్ని ఎలా పొందగలుగుతారు? మేధావి, మహానాయకుడు అని భావింపబడుతున్న మహాత్మాగాంధీ చాలా తెలివి తక్కువ ఆలోచన చేశాడని వారంతా చెప్పుకుని నవ్వుకున్నారు.

ఉప్పును సేకరించటం శాసనాలకు ఉల్లంఘన అని అది ఒక ఉద్యమమై రవి అస్తమించని తెల్లవాళ్ళ సామ్రాజ్యాన్ని కూకటి వ్రేళ్ళతో సహా పెకలిస్తుందని ఆ సమయంలో వారూ ఊహించలేకపోయారు.

ఈ విచిత్ర సత్యాగ్రహం ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో గమనించాలని ఆంగ్ల పత్రికలు ప్రతినిధులను పంపాయి.

గాంధీ జీవితం తెరచిన పుస్తకం, మా ఆశయాలు గొప్పవి. లక్ష్యాలు ఉన్నతమయినవి. ఆయుధం ధరించనివానికి ఎన్నడూ ఓటమి కలుగదు అని వారికి చెప్పాడు మహాత్ముడు. 12వ తేదీన సబర్మతీ ఆశ్రమము నుండి ఉదయం పూట దండి యాత్ర ప్రారంభమయినది.

ఈ బృందములో 79మంది త్యాగమూర్తులైన దేశభక్తులున్నారు. 61 నుండి 16 సం11 వయసు వారు ఉన్నారు.

సుప్రభాతాన బ్రాహ్మీమయ ముహూర్తంలో 4 గం11లకు మహాత్ముడు కళ్లు విప్పాడు. ఉప్పు మీద పన్ను తొలగిస్తే కాని మళ్ళీ సబర్మతి ఆశ్రమంలో అడుగు పెట్టనని సంకల్పం చేశాడు. దండి యాత్ర 24 రోజుల సాగింది. దారి పొడవున నేల ఈనినట్లు గాంధీ అభిమానులు తండోపతండాలై స్వాగత సుమాలను వెదజల్లారు. దేశవ్యాప్తంగా ఈ యాత్ర పెద్ద అలజడి రేపింది. సముద్రతీరాలలో కార్యకర్తలు కెరటాల్లా లేచారు.

సామూహిక అరెస్టులు జరిగాయి.

రాజగోపాలాచారి, మాలవ్య, కె.ఎమ్.మున్షీ, మహదేవదేశాయ్ మొ॥ వారంతా జైళ్ళలోకి వెళ్ళిపోయారు.

ఎన్నడూ ఎండ కన్నెరగని స్త్రీలు సహితం, సరోజినీ నాయుడు నాయకత్వంలో విప్లవించారు. లాఠీలకు శరీరాలను అప్పగించారు. సైమన్ కమీషన్ నివేదికను ఎన్నడూ లెక్కచేయలేదు.

మహాత్ముని అరెస్టు, విడుదల జరిగాయి.

వెంటనే వైస్రాయ్ ఇర్విన్‌తో నల్లచట్టాలను ఉపసంహరించుకోమని కోరుతూ చర్చలు జరిపాడు గాంధీజీ.

గాంధీ–ఇర్విన్‌లు చర్చలను కాంగ్రెస్ ఆమోదించింది. ఇర్విన్ స్థానంలో వెల్లింగ్‌టన్ వైస్రాయ్‌గా వచ్చాడు. 2వ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనటానికి గాంధీజీ భారత కాంగ్రెస్‌కు ప్రతినిధిగా లండన్ బయలుదేరాడు.

ఇంపీరియలిజమ్, కాపిటలిజమ్, కమ్యూనిజాలకు సాటిగా ధీటుగా గాంధీయిజాన్ని ప్రదర్శించే అవకాశమిది. ప్రతినిధులుగా వచ్చిన వారు అందరూ ఆడంబరంగా వచ్చేశారు. రాజకుటుంబాలవారు దేశాలకు, మతాలకు అధినేతలు, మహాసంపన్నులు, భూస్వాములు అందరూ ఆంగ్లేయుల చేతిలో కీలుబొమ్మలు, ఒక్క గాంధీయే నిరాడంబరమైన ప్రతినిధి. సమావేశంలో మతం పేరుతో వేర్పాటుతత్వాన్ని రెచ్చగొట్టాలని వారు ప్రయత్నించారు. భారతీయుల అనైక్యత ఆంగ్లేయ పాలనకు ఊపిరి. కమిటీని నియమిస్తానని ప్రధాని మెక్‌డొనాల్డ్ ప్రకటించిన తరువాత మాత్రమే గాంధీ తన పట్టు విడిచి పెట్టాడు. లాంక్‌షైర్ భారతీయ కార్మికులకు స్ఫూర్తినిచ్చిన తరువాత ఇంగ్లండ్‌లో ఆక్స్‌ఫర్డ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లలో ఉపన్యాసాలు ఇచ్చాడు. బెర్నార్డ్‌షి, చార్లీ చాప్లిన్‌లాంటి మహనీయులు వచ్చి గాంధీజీని సందర్శించారు. అతని వేషము, నడవడిక ఆ దేశానికి అచ్చెరువు కలిగించింది.

తిరిగి వచ్చిన గాంధీజీ మళ్ళీ సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించినాడు. ఈ ఉద్యమంలో పాల్గొన్నందుకు ఖాన్ అబ్దుల్‌గఫార్‌ఖాన్‌ను, పండిత జవహర్‌లాల్‌ను ప్రభుత్వం జైళ్ళలో కుక్కింది.

గాంధీని అరెస్టు చేసి భారత కాంగ్రెస్ మీద ఎన్నో ఆంక్షలు విధించింది. జైలులో కూడ సూత్రయజ్ఞం చేశాడు గాంధీ. జైలు గోడల మధ్యన ఆయనకు అనివార్యమైన

విశ్రాంతి సమయములో చదువుకునేందుకు, మిత్రులకు లేఖలు వ్రాసుకునేందుకు అవకాశం చిక్కుతుంది. ఈ సమయంలోనే అస్పృశ్యులకు వేరే నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని భారతీయులను మరో విధంగా విభజించి పాలించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్న సంగతిని గాంధీ పసిగట్టాడు. కమ్యూనల్ అవార్డుకు నిరసనగా నిరాహారదీక్ష చేయాలనుకుంటున్నట్లు జైలు నుండే ప్రకటించాడు. ప్రకటించిన విధంగా దీక్ష ప్రారంభించాడు. ఆయన దీక్షకు మద్దతుగా భారతావని అంతా ప్రజలు ఉపవాసం చేశారు. శాంతినికేతన్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆ రోజు నల్లవస్త్రాలు ధరించాడు. హిందూ దేశంలో అంటరాని వారు ఎవరూ లేరని ప్రకటించాడు.

అంటరానితనము అనేది హిందూ మతానికి మాయని మచ్చగా ఇక ఉండబోదని ప్రకటించాడు. ప్రొ॥ అంబేద్కర్ దోపిడీకి గురి అవుతున్న కులాలకు రెట్టింపు సీట్లు ఇవ్వాలని అడిగాడు. ప్రొవెన్షియల్ చట్ట సభలలో వారికి స్థానం ఇచ్చేందుకు అందరూ అంగీకరించారు. కొన్ని మినహాయింపులతో పూనాలో ఒడంబడిక కుదిరింది. జైలులో ఉన్న గాంధీజీ ఏడవ రోజున ఉపవాస దీక్ష విరమించాడు. బ్రిటిష్ ప్రభుత్వ ఆమోదం పొందిన పూనా ఒడంబడిక వల్ల వర్గాలు వర్ణాలుగా మారుతాయని ఆయన భయపడ్డాడు. 1933 సం॥లో హరిజనోద్ధరణ కోసం 'హరిజన్' పత్రిక స్థాపించాడు. 21 రోజులు నిరాహారదీక్ష పాటించి జైలు నుండి విడుదలైన తరువాత ఒక ప్రకటన చేశాడు. అనారోగ్య కారణాలు ఎలా ఉన్నా ఒక సం॥ కాలం హరిజనుల సేవకు అంకితమవుతానని సబర్మతి ఆశ్రమాన్ని హరిజన సేవక సంఘంకు బహుకరిస్తానన్నదే ఆ ప్రకటన సారాంశం. దీన జన ఉద్ధరణకు ఏకంగా 12,500 మైళ్ళు కాలి నడకన తిరిగి ప్రచారం చేశాడు మహాత్ముడు. ఉద్యమం నిలిపి వేయాలని బాంబు దాడులు కూడ జరిగాయి. కాంగ్రెస్ రాజకీయాలు భిన్న దృక్పథాలతో నడుస్తున్నాయి. పార్టీ నుండి వైదొలగి మూడేళ్ళపాటు సేవాధర్మానికి అంకితమవుతానని ప్రకటించాడు. ఆ తరువాత సత్యాన్వేషణ మానవసేవలో దర్శించాలని ప్రయత్నించాడు. పలు పత్రికలలో వ్యాసాలు వ్రాయడం మొదలుపెట్టాడు. రచన చేసేటప్పుడు ఎంత నిగ్రహాన్ని, సంయమనాన్ని పాటించాలో పాఠకులకు తెలియదు అంటుండేవాడు. గుజరాతీ భాషలో ఆత్మకథను ప్రచురించాడు. భారతీయుల జీవితాలలో ఇంగ్లీషు భాషకు స్థానం లేదని తను ప్రకటించనని ఎవరైన రచన చేసేటప్పుడు వీలైనంత క్లుప్తంగా, వాస్తవానికి దగ్గరగా అతిశయోక్తులు లేకుండా-స్వయంగా చేసిన, స్వయంగా చూసిన అంశాలను మాత్రమే గాలి వార్తలు కలుపకుండా నైతిక విలువలు పడిపోకుండా వ్రాయాలి అని రచయితలకు సలహా ఇచ్చాడు. ప్రజలలో కర్తవ్యదీక్ష కలిగించటానికి పత్రికలు శక్తివంతమైన సాధనాలని చెప్పాడు. బాలగంగాధర్ తిలక్ చనిపోయిన సమయంలో ఆయన రచించిన

వ్యాసం అద్భుతమైనది. "హరిజన్" పత్రికను అనేక భాషలలో ప్రచురించటానికి ఏర్పాట్లు చేశాడు. గ్రామీణ పునర్నిర్మాణానికి, కుటీర పరిశ్రమలు, నివాసాలలో పరిశుభ్రత, ఆహారపు అలవాట్లు, అక్షరాస్యతలు మాత్రమే కాకుండా స్త్రీలకు విద్య చెప్పించాలని ప్రబోధించాడు. అంటరానితనం నేరమే కాక మహాపాపమని చెప్పాడు. దేవాలయాలలోకి హరిజనులు ప్రవేశిస్తే తప్పులేదు అన్నాడు. గ్రామీణులకు పోషక ఆహార విలువలు చెప్పటమే కాక, ప్రాథమిక వైద్యం నేర్పించాలని సలహా ఇచ్చాడు. 1936లో "హరిజన్"పత్రిక నిలిచిపోయింది.

మహాత్ముని పత్రికారంగ ప్రవేశం ఆ రంగానికి గొప్ప ఊతాన్ని ఇచ్చింది. మహాత్ముని రచనలు ప్రపంచ పీఠాన్ని అధిరోహించదగినవిగా ఉన్నాయని మేధావులు మెచ్చుకున్నారు.

ఏ రంగంలో పనిచేస్తున్నా దాని మీద మనస్సు పూర్తిగా లగ్నం చేయాలని చెప్పి ఒప్పించాడు గాంధీజి. "ఉద్యమ చరిత్ర – హిందూ దేశ స్వరాజ్యం", "అన్ టూ దిస్ లాస్ట్" రచనలు బహుళంగా ప్రపంచ ప్రజల ఆదరణ పొందాయి. హేతుబద్ధంగా అభ్యుదయంగా, ప్రగతిశీలంగా తన ఆలోచనలు పరుగులు ఎత్తించాడు మహాత్ముడు.

స్త్రీల పట్ల, వారి అభ్యుదయం పట్ల గాంధీగారికి మంచి మంచి ఆలోచనలు ఉండేవి.

స్త్రీలు అనారోగ్యంతో, నిరక్షరాస్యతతో, అజ్ఞానంతో, పరాధీనులై పడి ఉండరాదని ఆయన అభిప్రాయము. పురుషుడు విద్య నేర్చుకుంటే అది అతనికే పరిమితం. మహిళలు విద్యావంతులు అయితే కుటుంబమంతా విద్యాగంధంతో పరిమళిస్తుందని గాంధీ చెపాపడు. భారతీయులకు తరతరాలకు ఉపకరించే భావాలను కొన్నింటిని వెలువరించాడు. సమాజంలోనే కాకుండా కుటుంబంలో కూడ మహిళలు గౌరవాన్ని పొందాలి. వీరికి చాలా విషయాలలో స్వయం నిర్ణయాధికారం ఉండాలి. స్వేచ్ఛగా ఆలోచించే అవకాశం కల్పించబడాలి.

ప్రపంచంలో ఎవరైన ఇందుకు అభ్యంతరం చెబితే తిరస్కరించండి, వ్యతిరేకించండి. స్వేచ్ఛ కోసం పోరాడండి అని స్త్రీలకు పిలుపునిచ్చాడు గాంధీజీ. అమూల్యమైన ఆయన సలహాలను మహిళలు పూర్తిగా పాటించలేకపోయారు.

గత్యంతరం లేక విడాకులు పొందినా, కట్నం తీసుకునే వారిని పెళ్ళి చేసుకున్నా స్త్రీలు అవమానింపబడరాదని ఆయన భావించాడు. స్వాతంత్ర్య పోరాటంలో పురుషుల కన్నా మహనీయమై పాత్రను పోషించమని వారికి సందేశమిచ్చాడు.

పిల్లలు జాతి సంపద కనుక స్త్రీల కర్తవ్యం మహత్తరమైనది. పత్రికల ద్వారా ఇంకెన్నో భావాలను ఆయన వెలిబుచ్చాడు. చెప్పడం కన్నా చేయడమే మిన్న అని గాంధీజీ భావం. అందువల్లనే కొందరు మహిళలు, విదేశీ మహిళలు గాంధీ మహాత్మునిలో మేము మాతృమూర్తిని దర్శిస్తున్నామని చెప్పేవారు. అయితే గాంధీజీ కలలు కన్న భారత మహిళ ఇంకా పుట్టలేదు. పరిశ్రమలలో మహిళలకు స్థానం ఇవ్వాలని ఆయన వాదం. 1936లో ఫైజ్‌పూర్‌లో పరిశ్రమల మీద అతి వ్యామోహాన్ని నిరసిస్తూ, గ్రామీణ జీవనోపాధులను సమర్థిస్తూ ఆయన ఉపన్యసించాడు. కార్మికులను మద్యపానానికి బానిసలు కావద్దని హెచ్చరించాడు. వారికి వైద్య సౌకర్యాలు కల్పించలేని ప్రభుత్వాన్ని దుయ్యబట్టాడు.

మద్యరహిత సమాజాన్ని కలలు కన్నాడు గాంధీజీ.

# 10. క్విట్ ఇండియా

1937వ సం॥ క్రొత్త రాజ్యాంగాన్ని అనుసరించి భారతీయులకు అధికారాలు ఇవ్వకుండా బాధ్యతలు అంటగట్టారని నెహ్రూ విమర్శించాడు. ఆ సంవత్సరం ఎన్నికలలో చాలా రాష్ట్రాలలో కాంగ్రెస్ గెలిచింది. వార్ధాలో జాకీర్ హుస్సేన్ అధ్యక్షతన విద్యావిధానానికి రూపకల్పన జరిగింది. విద్య అంటే కేవలం వ్రాయటం, చదవటం కాదు. వృత్తి విద్యలు దేశప్రగతికి అత్యవసరం. కాంగ్రెస్ మంత్రులు ఆస్తులు సంపాదించకుండా నిరాడంబరంగా జీవించాలని సలహా ఇచ్చాడు. ఈ సం॥లో జిన్నా మాటలలో జాతీయతా భావాన్ని ప్రకటించడంలో కొన్ని మార్పులు కొట్టవచ్చినట్లు కన్పించాయి. ఈ మార్పులు హిందూ ముస్లిం ప్రాదేశికతల మధ్య తెర దింపాలన్న అర్థాన్ని ధ్వనించాయి. పాకిస్తాన్ ఆలోచన అంతరంగాలలో అంకురించింది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఇండియా పేరును ఉపయోగించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజీనామా చేశాయి. ఈ అవకాశం తీసుకుని కాంగ్రెస్ ప్రభుత్వాలు ముస్లింలకు చేసిన మేలేమిటి? అని ప్రశ్నించాడు జిన్నా. ఈ విషయమై న్యాయ విచారణ జరిపిద్దామని రాజేంద్రప్రసాద్ ప్రతిపాదన చేస్తే –ఫెడరల్ కోర్టు జడ్జీలతో కాకుండా రాయల్ కమీషన్‌తో విచారణ జరిపించాలని మంకు పట్టు పట్టాడు.

ఈ వేర్పాటు ఆలోచనా ధోరణి ద్విజాతి సిద్ధాంతానికి దారి తీసింది. మతం ప్రాతిపదికగా ముస్లింలీగ్ దాన్ని ధ్రువపరిచింది. ఎఐసిసి నాజీలకు వ్యతిరేకంగా తీర్మానం చేసింది. రాజకీయాలకు దూరంగా ఉంటానని ఆశ్రమంలో గడుపుతున్న గాంధీ మనసు వేరు పరిణామాలకు గాయపడింది. పరిస్థితులు చేయి దాటి పోకముందు గాంధీని తిరిగి రాజకీయ రంగ ప్రవేశం చేయమని నాయకులు కోరారు. వినోబాభావే పవనార్ ఆశ్రమంలో వ్యక్తిగత సత్యాగ్రహం ప్రారంభించాడు. 25వేల మంది శిక్షలు అనుభవించారు. చర్చిల్ భారత స్వాతంత్ర్యోద్యమానికి వ్యతిరేకి. క్రిప్స్ రాయబారం వచ్చింది. చర్చిల్ రాయబారుల ద్వారా వేర్పాటువాదులను సమర్థించే సందేశాలను పంపించాడు. కాంగ్రెస్ వ్యతిరేకించింది. పోరాటాన్ని ఉధృతం చేయక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. 1942 ఆగస్టు 7వ తేదీని క్విట్ ఇండియా అనే నినాదాన్ని ఇచ్చాడు గాంధీజీ. మహాత్మునితో పాటు జవహర్‌లాల్

నెహ్రూ, మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ తదితర నాయకులను జైళ్ళలో పెట్టింది ప్రభుత్వం. క్విట్ ఇండియా ఉద్యమం భారతదేశంలో చాలా పెద్ద స్థాయిలో విధ్వంసకాండను, అల్లకల్లోలాన్ని సృష్టించింది. ఆగాఖాన్ పాలెస్ జైలులో ఉన్న గాంధీజీ హింసాకాండను నిరసించాడు. 21 రోజుల నిరాహారదీక్షను చేపట్టాడు. గాంధీజీ కార్యదర్శియైన మహదేవ దేశాయ్ జైలులోనే మరణించాడు. అతనిపట్ల కస్తూరిబా పుత్రవాత్సల్యాన్ని ప్రదర్శించేది. మహదేవ్ మరణంతో ఆమె బాగా కృంగిపోయింది. కస్తూరిబా మహాత్ముని సాహచర్యంలో పొందిన అనుభవాలన్ని ఆత్మపరమైనవి. త్యాగాలు చేయడం ఆమెకు జీవితమంతా అలవాటు. మహాత్ముని మనసు, ఆయనకున్న సమయం సమస్తం దేశానికే అర్పితం. పరాశక్తుడైన భర్త ఇష్టాలకు అనుగుణంగా మనోభావాలను మలచుకుంది. మహాత్ముడు తన సర్వస్వాన్ని దేశానికే ఇచ్చివేశాడు. ఆమెకిచ్చేందుకు ఆయన దగ్గర ఉంచుకున్నది ఏమీ లేదు. వారి దాంపత్యం అనేక దశాబ్దాల పాటు త్యాగాలమయంగా నడిచింది. చివరకు 1944 ఫిబ్రవరి 22వ తేదీన జైలు గోడల మధ్య జీవితపు చెఱసాల నుంచి ఆ తల్లి ఆత్మ విముక్తిని సాధించింది. 62 సంవత్సరాల ఆ దంపతుల అనుబంధం ఆ వేళకు ఆసాంతమయింది.

కస్తూరిబా మరి ఇక లేదన్న వార్తను గాంధీ విని నిర్వికారుడై నిలిచాడు. ఆ తరువాత ఆయన మనసులో ఏమి తుఫానులు చెలరేగాయో ఎవరికీ తెలియదు. మహాత్ముని కనురెప్పల చాటున ఏ మహాసముద్రాలు ఘూర్ణిల్లాయో ఎవరూ ఎరుగరు.

శరీర ఆరోగ్యం మాత్రం శిథిలమయింది.

యావత్ భారతం వెన్నంటి ఉన్నా, మహాత్ముడు మనసులో ఒంటరితనాన్ని అనుభవించాడు. జైలు నుండి విడుదలయ్యాడు. పరిస్థితులు చక్కదిద్దేందుకు ఉత్తరం వ్రాశాడు. మత కల్లోలాల విషయంలో మహమ్మద్ అలీ జిన్నాతో చర్చలు జరిపాడు. రాజగోపాలాచారి చొరవ కారణంగా జరిగిన ఈ చర్చలు జిన్నా మనోభావాల కారణంగా విఫలమైనాయి. భారత స్వాతంత్ర్యం తరువాత మత విషయాలు మాట్లాడేందుకు జిన్నా ఒప్పుకోలేదు. మూర్ఖంగా పట్టుబట్టాడు. ఈ విభేదాలు ఆ తరువాత జరిగిన సిమ్లా సమావేశంలో 1945లో మరింత పెద్దవయ్యాయి.

జపాను యుద్ధంలో లొంగిపోయింది.

బ్రిటన్‌లో లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది.

నిషేధం విధించిన కారణంగా గాంధీ తప్ప మిగిలిన నాయకులందరూ జైళ్ళలో మ్రగ్గిపోతున్నారు.

# 11. 1947 ఆగస్టు 15

ముస్లిం లీగ్ నాయకుడు మహమ్మద్ ఆలీ జిన్నా రెచ్చగొట్టే ధోరణి తగ్గించుకోలేదు. బెంగాల్, పంజాబ్‌లలో హిందూ, ముస్లిం కొట్లాటలు జరిగాయి. అవినీతి బాగా పెరిగింది. దేశమంతా మంటలు చిమ్ముతున్నాయి. 1946లో సైన్యం తిరుగుబాటు బావుటా లేచింది. పోలీసువారు కూడ నిరంతర నిరవధిక హింసాకాండను సాగించలేక విసిగిపోయి ఉన్నారు.

ఈ పరిస్థితులన్నింటిని సానుకూలపరచుకోవటానికి ప్రధాని అట్లీ సంభాషణలు జరపాలని నిర్ణయించాడు. కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడదగు బృందాలను పంపించాడు. వీరు పలు తావుల చర్చలు జరిపి ఒక మార్గాంతరాన్ని సూచించారు. రాజ్యాంగ రచనకు ఒక సంఘాన్ని నియమించాలి. కేంద్ర ప్రభుత్వంతో పాటు ప్రావెన్స్‌లు కూడా అధికారాలను పంచుకుంటాయి. ముస్లింలీగ్ ఈ ప్రతిపాదన వ్యతిరేకించింది. వారి మీద తిరుగుబాటు సూచన ఇచ్చింది.

పాకిస్తాన్ ఏర్పాటు కోసం ప్రత్యక్ష చర్యలు అనివార్యం, మేము వెనుకడుగు వేయాలని అనుకోవటం లేదు అని ప్రకటించింది. జిన్నా వారికి మరింత ఊతాన్ని అందించాడు.

అధికారం కోసం రాజకీయాలు నడుపవద్దని అందరినీ కోరాడు. ముస్లిం హక్కుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అర్థించాడు. స్వాతంత్ర్యం వేగంగా సాధించాలని కాంగ్రెస్‌వారు, పాకిస్తాన్ ఏర్పాటును సాధించాలని ముస్లింలీగ్ వారు మహాత్ముని ఉపదేశాన్ని పెడచెవిన పెట్టారు. మహాత్ముని మనసు కలతపడింది. మతం కారణంగా మనుగడలు వేరైతే మళ్ళా కలిసి జీవించే అవకాశం ఇక ఎన్నటికీ రాదని ఆయనకు తెలుసు. ప్రభుత్వం ఏర్పాటు చేయమని ఆంగ్లేయులు నెహ్రూను కోరారు. ఈ వార్త అందుకుని జిన్నా ఆలోచించాడు. మా మంత్రులు ఎవరూ లేరు అని ప్రకటించాడు. కాంగ్రెస్ కుట్ర చేస్తోంది. బ్రిటిష్ వారితో చేతులు కలిపి మైనారిటీలను అణచివేస్తోంది అంటూ శాశ్వత వేర్పాటు

ధోరణిని ప్రదర్శించాడు. భారత జాతీయ కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల మధ్య శాశ్వతమైన తెర దింపేశాడు. ముస్లింలీగ్ ప్రత్యక్ష చర్యలను ప్రకటించింది.

కలకత్తా మారణకాండలు దేశాన్ని కుదిపేశాయి.

మతరాక్షసి వికృతంగా కోరలు విప్పి కరాళనృత్యం చేసింది. 500మందికి పైగా చనిపోయారు. 1500 మంది క్షతగాత్రులయ్యారు.

చర్యలు – ప్రతిచర్యలు ఉగ్రరూపం దాల్చాయి.

గాంధీ మహాత్ముడు ఈ దుర్గతి తలచుకుని కృంగిపోయాడు. మహిళలకు అవమానాలు జరగడం, ఆయన హృదయాన్ని తీవ్రంగా గాయపరచింది. అనారోగ్యాన్ని, మిత్రుల అడ్డుకోలును లెక్క చేయకుండా నౌకాళికి పయనమయినాడు.

అప్పటి ఎఐసిసి అధ్యక్షుడు కృపలానీ.

జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గ నాయకుడు.

కలకత్తాలో గాంధీ మహాత్ముడు భయంకరమైన పరిస్థితులు గమనించాడు. మిత్రులే శత్రువులు అయిపోయారు. ప్యారేలాల్, సుశీలానయ్యర్, సుచేతాకృపలానీ, నిర్మల్‌కుమార్ బోస్‌లతో కలిసి అనారోగ్యంతోనే రోజూ 20గం॥ చొప్పున సేవా కార్యక్రమాలు చేశాడు. నేను అహింసనే నమ్ముకున్నాను. నా అహింసా సిద్ధాంతం ఇప్పుడు అగ్నిలో కాలుతోంది. ఇది ఆభరణంగా మారుతుందనే నా నమ్మకం. నా అంతరాత్మ ప్రబోధమే నాకు గురువు అని ప్రకటించాడు. అబలల ఆక్రందనలు మతాలను శపిస్తాయని అభివర్ణించాడు. గ్రామాలలో భయాన్ని తొలగించి శాంతి స్థాపించడానికి దివ్యమైన కృషి చేశాడు. అక్కడ నుండి బీహార్ బయలుదేరాడు. అధిక సంఖ్యాకులు మనసును నిర్మలం చేసుకోవాలని అక్కడ ఒక సందేశమిచ్చాడు.

దేశమంతా అంతర్యుద్ధ వాతావరణం నెలకొంది.

1948 జూన్ నాటికి స్వాతంత్ర్యం ప్రకటిస్తానని అట్లీ వాగ్దానం చేశాడు. లార్డ్ మౌంట్‌బాటన్ వైస్రాయ్ పదవిని పొందాడు. ఒక వంక దేశవిభజన జరగకపోతే మరింత దుష్పరిణామాలు ఎదురౌతాయని జిన్నా బెదిరిస్తున్నాడు.

మరోవంక అహింసాయుతంగా స్వాతంత్ర్య పోరాటమంతా నడిపిన మహాత్ముడు ఫలితాన్ని అందుకునే సమయంలో సోదర కలహాలు రావటం గురించి చింతాక్రాంతుడయ్యాడు.

ప్రేమ, శాంతి, స్నేహం, క్షమ, సౌభ్రాతృత్వం మొదలైన నైతిక సూత్రాలు మంట కలిసిపోతున్నాయని ఒంటరిగా కుమిలిపోయాడు. హిందూ–ముస్లిం భాయీ భాయీ అనుకునే మంచి రోజులు. అహింసా యుత జీవనం– ఈ ప్రజలు మళ్ళీ ఎన్నాళ్ళకు పొందగలుగుతారో అని వ్యాకులత చెందాడు. ఖిలాఫత్ ఆలోచనలు మట్టి కలిశాయి. మౌలానా ఆజాద్, జాకీర్ హుస్సేన్, ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ మహాత్ముని వెనుక నిలిచారు. కల్లోలిత ప్రాంతాలలో అంగరక్షకులు లేకుండా ప్రయాణం చేశాడు. హిందూ మతస్థులు, ముస్లిం బాలబాలికలను దత్తత స్వీకరించమని చెప్పాడు.

మతద్వేషం బ్రతికినంత కాలం మానవతా సిద్ధాంతాలు మరణించక తప్పదు.

చీకటి తుఫాను రాత్రిలో ఎవరూ దీపం వెలిగించకపోతే నీ హృదయాన్ని జ్యోతిలా వెలిగించు. దానిని ఒంటరిగానే కాలిపోనివ్వు అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాన్ని మహాత్ముడు మననం చేసుకుంటూ ఉండేవాడు.

నెహ్రూ ప్రభుత్వానికి బదులు జిన్నా ప్రభుత్వానికి ఏర్పాటు చేయమని మౌంట్ బాటన్‌ను కోరాడు మహాత్ముడు. జిన్నా, మౌంట్‌బాటన్‌లు కలసి భారత్–పాకిస్తాన్‌ల ప్రాదేశిక వేర్పాటుకు రంగాన్ని సిద్ధపరిచారు. 1947 జులై 18వ తేదీన బ్రిటిష్ రాణి భారతదేశం స్వతంత్రం కావడానికి ఆమోదం తెలియజేసింది. ఆగస్టులో గాంధీ నౌకాళిలో ఉన్నాడు. ఇంకా శాంతియాత్రలు చేస్తున్నాడు. ఈ శాంతి సాధనలో ప్రాణాలైనా అర్పిస్తానంటున్నాడు. ఆగస్టు 14 అర్థరాత్రి హిందూ ముస్లింలు కలసి ఆయన ముందు స్వాతంత్ర్యపు వేడుకలు జరుపుకుంటున్నారు. ఖిలాఫత్ ఉద్యమము, ఆనాటి మధుర జ్ఞాపకలు ఆయన మనసును తట్టిలేపాయి.

నెహ్రూ పండితుడు ఎర్ర కోట బురుజుల మీద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశాడు. భారతీయులు సగర్వంగా తలయెత్తి ఆ మధుర దృశ్యాన్ని తనివితీరా చూచారు.

అక్కడకు దూరంగా ఎక్కడో ఒక మారుమూల గ్రామంలో "హిందూ–ముస్లిం భాయీ భాయీ", "స్వతంత్ర భారత్ జిందాబాద్" అన్న నినాదాల మధ్య మహాత్ముడు భారత్, పాకిస్తాన్‌ల జెండాలు రెండూ ఎగురవేశాడు. ఇది అధికారం, అది మానవతామార్గం.

ఈ మహనీయత అంతా మహాత్మునికే దక్కుతుందని నెహ్రూ ప్రకటించాడు. కానీ కొద్దిరోజులకే ముస్లింలీగ్ వారు మహాత్ముని మీద దాడిచేశారు. దాడి చేసిన వారి మనసులు

నిర్మలం కావాలనే కోరికతో మహాత్ముడు మళ్ళీ నిరసన దీక్ష పాటించాడు. ఇది ఆత్మ పరీక్ష అంటాడు. ఆ తరువాత ముస్లింలు స్వచ్ఛంగా వచ్చి ఆయనకు ఆయుధాలను అప్పగించి, తమ తప్పులు ఒప్పుకున్నారు. ప్యారేలాల్ గాంధీజీ కార్యదర్శిగా పనిచేస్తూ ఎన్నో అద్భుతాలను చూచాడు.

కానీ ఈ దృశ్యం చూసి అతను కూడ చలించిపోయాడు. అతని ప్రకటనను ప్రపంచం మహదాశ్చర్యంతో ఆలకించింది.

సైనిక బలగాలు సైతం సాధించలేని ఈ మహత్కార్యాన్ని ఒక బక్కపల్చని మనిషి సాధించాడు. కానీ మత పోరాటానికి ఇది ముగింపు కాదు.

# 12. ఆత్మ బలిదానం

స్వాతంత్ర్యం వచ్చినందుకు సంతసించాలా? మతసామరస్యం పోగొట్టు కున్నందుకు బాధపడాలా? అర్థం కాని అయోమయంలో పడ్డారు ప్రజలు. పంజాబ్‌లో మత కలహాలు పెచ్చు మీరాయని వార్తలు వస్తున్నాయి. మానవులు దానవులుగా మారుతున్నారు. నగరాలు శరణార్థులతో నిండిపోతున్నాయి. మతకల్లోలాల కారణంగా దేశంలో 5 లక్షలమంది చనిపోయారు. 12 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.

ఈ వార్త గాంధీ హృదయాన్ని ఛిన్నాభిన్నం చేసింది. వెంటనే ఆయన ఢిల్లీ చేరుకున్నాడు. నెహ్రూ పండితుడు తగు చర్యలు తీసుకుంటున్నాడు. కానీ పరిస్థితులు అదుపులోకి రాలేదు. పోలీసుల ద్వారా శాంతి స్థాపన చేయడం గాంధీకి సమ్మతం కాదు. శాంతి కాదు. శాంతి అనేది స్వచ్ఛందంగా హృదయాన్ని తెరచుకుని రావాలి. హిందూ-ముస్లిముల పరస్పర ప్రేమ, అవగాహన, పరస్పర ఆశ్రయం, ఇవన్నీ మనఃపూర్వకంగా జరగాలి. పోలీసులు, సైనికులు నెలకొల్పే శాంతి ఇచ్ఛాపూర్వకమైనది కాదు. ప్రజల మనసులలో శాశ్వతమైన మార్పు రావాలి.

నగరంలో ఎక్కడ చూచినా శరణార్థుల శిబిరాలే కన్పిస్తున్నాయి. ధూర్తుల దురాగతాలకు బలి అయిన అన్నార్తుల ఆక్రందనలు ఢిల్లీని ముంచెత్తుతున్నాయి. కుటుంబాలను కోల్పోయినవారు, ఆస్తులు పోగొట్టుకున్నవారు, అంగవైకల్యం పొందినవారు, అభాగ్యులు, అనాథలు, కొనప్రాణంతో ఉన్నవాళ్ళు, వీరందరిని చూసి మహాత్ముని హృదయం శోకాకులం అయింది. వీరికి నిష్కృతి ఎప్పుడు? దూర ప్రాంతాల నుండి పారిపోయి వచ్చినవారు తమ వారిని కలుసుకునే అవకాశం ఉందా? లేదా? భారత్ పాకిస్తాన్ రెండు ముక్కలు. రెండు వేరు వేరు దేశాలు. నివాసాలు, ఆస్తులు కోల్పోయి చాలామంది దిక్కుమాలిన స్థితిలో ప్రవాహంగా వచ్చి పడుతూనే ఉన్నారు.

ఇంక ఇప్పుడు కూడ గాంధీ మహాత్ముడు శాంతి వచనాలే వల్లిస్తాడేమో అని కొందరు రుస రుస లాడుతున్నారు. ప్రతీకారంతో, కసితో హిందువుల మనసులు కూడా మరుగుతున్నాయి. ఢిల్లీ ప్రజల్ని కలసి ఓదార్చి పరిస్థితి చక్కదిద్దేందుకు నిర్విరామంగా శ్రమ చేస్తున్నాడు. ఆత్మను పరిశుద్ధం చేయటం ద్వారా మనసుల్ని అదుపులో ఉంచుకోవాలని సందేశాలను పంపుతున్నారు. భారత రాజధాని నగరం ఢిల్లీ. ఈ కాందిశీకుల వల్ల పరిస్థితి చేయి జారిపోతుంది. రాజధాని అదుపు తప్పితే దేశం అల్లకల్లోలం అవుతుంది అని శాంతి బోధలు చేస్తున్నాడు. అలా చేయడం కొందరకు నచ్చలేదు. ముఖం మీదే తిరస్కార భావాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ తిరస్కార భావాన్ని చూచి గాంధీ నిరుత్సాహపడలేదు. మూడు రోజులు ఉపవాసదీక్షను ప్రారంభించాడు. నీ మనస్సాక్షిని మేల్కొల్పడమే నా లక్ష్యం. ఆత్మపరిశీలన, ఆత్మశుద్ధి చేసుకోమని కోరాడు.

పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియని అవాంతర పరిస్థితి ఏర్పడింది. అప్పటికే దాడులు, ప్రతిదాడులు అనేకం జరిగాయి. కాబట్టి మనుషులందరూ ప్రతీకారవాంఛతో మ్రగ్గుతున్నారు.

ప్రజల ఆలోచనలు క్రోధాగ్నిజ్వాలలతో కనలుతున్నాయి.

భారత ప్రభుత్వం పాకిస్తాన్‌కు చెల్లించాల్సిన 55 కోట్ల రూపాయల మొత్తాన్ని వెంటనే చెల్లించింది. ఈ నష్టానికి కారణం గాంధీ మహాత్ముడే అని చాలా మంది దురభిమానులు వేలెత్తి చూపటం ప్రారంభించారు. ఈ తొందరపాటుకు పరిహారం చెల్లించాలని కూడా హెచ్చరించారు. గాంధీ మహాత్ముడు ఏ పరిస్థితిలోనూ తన పట్టుదల విడిచి పెట్టేందుకు అంగీకరించలేదు.

ఉపవాసదీక్ష ప్రారంభించాడు. భారత ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ కూడ ఆయనకు తోడుగా ఒక రోజు ఉపవాసదీక్ష చేశాడు. పార్టీలన్నీ సమావేశమయినాయి. అందరూ ప్రతిజ్ఞలు చేశారు.

ఇక ముందు ఎలాంటి విధ్వంసకాండలు జరిపించడం కాని, జరిపించేవారికి మద్దతు ఇవ్వటం కాని జరుగదని హామీ ఇచ్చారు. ఈ వాగ్దానం ఇచ్చాక మహాత్ముడు 18వ తేదీన దీక్ష విరమించాడు. ఆశించిన విధంగానే భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. కాని అనుకున్న విధంగా రాలేదు. పరిస్థితులు ఆశించిన విధంగా లేవు. స్వాతంత్ర్యం క్రొత్త ఊపిరి అవుతుందని అనుకుంటే మత కల్లోలాలవల్ల అది కొలిమి మంటలా తయారయింది.

స్వాతంత్ర్య ఫలాలు మారుమూల కుగ్రామంలో నివసించే బడుగు జీవులకు కూడా అందాలని అతడు ఆశించాడు.

అసలుకే మోసం వచ్చింది. మనసు వికలం అయింది.

18-20 తేదీల మధ్య ఆత్మావలోకనం చేసుకున్నాడు. ఒక తప్పిదం జరిగినప్పుడు అది ఇతరుల వల్ల జరిగినా ఆత్మశుద్ధి కొరకు తనను తాను ఆత్మ ప్రక్షాళన చేసుకోవటం ఆయనకు ప్రథమం నుంచి వచ్చిన అలవాటు. ఆ ప్రకారమే చేశాడు.

ఒకవేళ ఈ జరుగుతున్న ఉపద్రవానికి తనే కారణం అయితే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. అందుకోసం మహత్ముడు ఆత్మపరిశోధన చేసుకొనడం ప్రారంభించాడు.

ఎప్పటివో జ్ఞాపకాలన్నీ మనసులోంచి పైకి తేలి వచ్చాయి. మొత్తం జీవితంలో జరిగిన ఘోర తప్పిదాలు ఏమైనా ఉన్నాయా? అని పరిశీలించుకోవటం కర్తవ్యమని పించింది. ఆ దృశ్యాలన్నీ కనుల ముందు కదిలాయి.

అంత పిన్నవయస్కుడై ఉండగా శ్రవణ కుమారుడు కథలో ప్రబోధించిన పితృభక్తి హృదయంలో ముద్రపడింది. తండ్రి కరంచంద్ గాంధీ- తల్లి పుతలీబాయి వారి పట్ల తాను ఏ విధమయిన పొరపాటు చేయలేదనిపించింది.

ఆ తరువాత ముఖ్యమని ఘట్టం హరిశ్చంద్ర కథ. అసత్యం పలుకరాదన్న దీక్షని జీవితమంతా దీక్షగా పాటించాడు. అందువల్ల సత్యదీక్షా పరుడయ్యాడు. అది అతని నైతిక జీవిత చరిత్రని శాసించింది.

మొహమాటస్తుడు మౌనిగా మారాడు.

ఎన్నో జీవిత సుఖాలను త్యాగం చేశాడు.

రాజకీయాలలో చురుగ్గా పాల్గొంటున్న సమయంలోనే మహాత్ముడైనాడు. ఆశ్రమం స్థాపించాడు. ఇది ఎవరికి అర్థం కాని ఒక వింత. అందరూ ప్రశ్నించేవారు.

ప్రజా సేవారంగంలో ఉన్నవారు సహజంగా నగరాలలో అందరికి అందుబాటులో ఉండాలని కోరుకుంటారు. ప్రతి విషయాన్ని విలక్షణంగా ఆలోచించడమే గాంధీ విధానం. అసలు రాజకీయవాదులకు ఆశ్రమాలెందుకు? ఈ సమస్య ఆ రోజుల్లో చాలా మందిని ఆలోచింపజేసింది. గ్రామాలు అభివృద్ధి చెందితే కాని దేశం అభివృద్ధి చెందినట్లు కాదని గాంధీ భావించాడు. గ్రామ సీమలు భారతదేశపు సంస్కృతికి మాత్రమే కాదు. ఉత్పత్తికి, ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటివి. మనుషులకు జీవనాధారమైన పాడి, పంట ఈ రెండూ గ్రామాల నుంచే రావాలి. అందువల్ల గ్రామోద్ధరణ అనేది జాతిని బలోపేతం చేయటానికి చాలా అవసరమని భావించాడు గాంధీజీ. నాయకులు అందరూ పట్టణాలలోనే ఉండి జాతికి సేవ చేయాలని ఆలోచిస్తూ ఉంటే తాను మాత్రం గ్రామాలకు సేవ చేయాలి,

ఆధునిక విజ్ఞానం వారికి తెలియజేయాలని నిశ్చయించాడు. వార్ధా, సైగాన్‌లలో నెలకొల్పిన ఆశ్రమాలే ఇందుకు తార్కాణం. సైగాన్ అనేది కుగ్రామం. 500 జనాభా కూడా లేని చిన్న గ్రామం. ప్రజాసేవ అనేది ఢిల్లీ నుండి మాత్రమే కాదు, ఇక్కడ నుండి కూడా చేయవచ్చని నిశ్చయించాడు.

సైగాన్‌లో గాంధీ ఆశ్రమం నెలకొల్పుతున్నాడని ప్రకటన రాగానే దేశమంతా ఈ వార్త పాకిపోయింది. గాంధీ ఎప్పుడూ ఇలాంటి ఇబ్బందికరమైన పనులే చేస్తుంటాడని కొంతమంది అన్నారు. ఒకరి కోసం తన సిద్ధాంతాలను మార్చుకోవటం గాంధీకి అలవాటు లేదు. మన పాతకాలపు సత్యాలను శాస్త్రీయ పద్ధతులను మిళితం చేసినపుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వారికి బదులు చెప్పాడు.

ఆశ్రమం అనేది ఒకరు నిర్మించుకునేది కాదు. కొంతమంది కలసి ఏర్పాటు చేసుకునేది.

వారిలో త్యాగపూరితమైన సేవాభావం ఉండాలే కాని, అభిప్రాయభేదాలు ఉండకూడదు.

సైగాన్ గ్రామమంతా బురదమయం. ఎటు చూచినా పదిమైళ్ళకు పైగా నడిస్తే గాని మంచిదారి అనేది కనిపించదు. దేశ విదేశాల వారు నిత్యం సంప్రదింపులకు ఎలా వెడతారని కొంతమంది పెదవి విరిచారు. ఆ కుగ్రామంలో ఒక్క విద్యావంతుడు లేడు. పాఠశాల కూడా లేదు. నాగరికత అనేది మచ్చుకైనా కనిపించదు. పారిశుద్ధ్యం సంగతి సరేసరి – చిన్న చిన్న వీధులు మురికితో నిండి ఉనానయి. చీకటిపడితే పలకరించే దిక్కు కాని, ఆదరించే అవకాశం కాని లేదు.

మరికొంత మందిని కలుపుకుని గాంధీ అక్కడే ఆశ్రమం నిర్మించాడు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆదర్శవంతమైన జీవితం ఎలా ఉండాలో చూపించటమే గాంధీ ఆశయం. కొద్ది రోజులలోనే ఆశ్రమ వాసుల సహజీవనంతో ఆ ఒక్క గ్రామమే కాక, చుట్టు ప్రక్కల గ్రామాలు అన్నీ చైతన్యవంతము అయినాయి. నియమాలు, కట్టుబాట్లు, నిరాడంబర జీవితం, మానవసేవ ఇవన్నీ ఆశ్రమవాసులు ప్రజలకు నూరిపోశారు. గాంధీ ఆదర్శానికి శిష్యులు తయారైపోయారు. స్వచ్ఛందంగా విద్య, విజ్ఞానం, జీవిత విధానం పరిశుభ్రత నేర్పటం మొదలుపెట్టారు. ముఖ్యంగా కుటుంబంలో తల్లుల పాత్రను వారు బోధించారు. గ్రామ గ్రామాన వస్తున్న మార్పును గమనించి ప్రభుత్వం కూడ గడగడలాడింది. పారిశుద్ధ్యం ప్రాధాన్యతను తెలియజేయటానికి సంఘ సేవకుడుగా గాంధీ స్వయంగా చీపురు పట్టేవాడు. ఈ గ్రామాభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్న సైగాన్

గ్రామం వెలుగులోకి వచ్చేసింది. ఉత్తరం ముక్క ఎరుగని ఆ గ్రామానికి ప్రపంచం నలుమూలల నుండి వందల సంఖ్యలో తంతి వార్తలు, వేల సంఖ్యలో ఉత్తరాలు రావడం మొదలెట్టాయి. ఈ అభ్యుదయాన్ని చూచి కన్ను కుట్టిన ప్రభుత్వం అక్కడి తంతి కార్యాలయాన్ని మూసివేయించింది. చీకటిలో ఉన్న ఆ పల్లె వీధులు ఇప్పుడు కాంతులతో శోభిల్లుతున్నాయి. మంచినీటి సౌకర్యం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొన్న సైగాన్ గ్రామం రక్షిత మంచినీటి పథకం ద్వారా యావద్భారత దేశానికి ఆదర్శప్రాయమై నిలిచింది. గాంధీజీకి ఆశ్రమ జీవితమంటే చాలా ఇష్టం. సైగాన్ గ్రామంలోని ఆశ్రమం ప్రతి గ్రామంలోను ఎంతో కొంత మార్పు తీసుకుని రావటం గాంధీజీ గమనించాడు. ఇంక అక్కడ పని తీరినట్లుగా బయలుదేరి మరొకచోట ఆశ్రమం కోసం వెతికాడు. ఇంక అక్కడ పని తీరినట్లుగా బయలుదేరి మరొకచోట ఆశ్రమం కోసం వెతికాడు. మహనీయులు ఎక్కడ ఉంటే అది పుణ్యక్షేత్రమవుతుంది. ఇప్పుడు ఆ పుణ్యక్షేత్రం పేరు వార్ధా.

సబర్మతీ నదీ తీరాన తన కార్యక్రమాలను ఇక్కడ నుండి ప్రారంభించాడు.

అది ఆశ్రమం మాత్రమే కాదు. జాతి నిర్మాణ కార్యక్రమాలను ఆచరణాత్మకంగా రూపొందించే కర్మాగారం.

దివ్యజీవనం, విదేశీ వ్యవహారాలు వార్ధాలో సమన్వయం పొంది నడుస్తుంటాయి. ప్రార్థనలు, పూజలు చేసేవారే పెద్ద పెద్ద రాజకీయ జీవిత పరిష్కారం కూడా చేస్తారు. ఈ విధంగా రాజకీయాలను ముడిపెట్టాడు మహాత్ముడు. దాని వల్ల ఆయన బ్రతికి ఉన్నంతకాలం రాజకీయాలు పవిత్ర భావాలతో నిండి ఉన్నాయి. ఆశ్రమవాసులు ఖర్చులు సంపాదించుకొనటానికి ఖద్దరు తయారు చేస్తారు. సోమరితనం అరిష్టమని ప్రజలలో ప్రచారం చేస్తారు. సోమరితనాన్ని విడిచిపెట్టి మనుషులందరూ శ్రమించాలి. ఆశ్రమంలో కొంతభాగాన్ని దేశాభ్యుదయానికి అంకితం చేయాలి. మారుమూల కుగ్రామంలో వ్యక్తిగతమైన సేవలు చేస్తూ ఉంటే కాలం వృధా అవుతుందే కానీ దేశ సమస్యలను పరిష్కరించే అవకాశం ఎట్లా వస్తుందని కొందరు గాంధీ మీద రుసరుసలాడేవారు.

గాంధీజీ సైగాన్, సబర్మతి ఆశ్రమాలలో సూత్ర యజ్ఞం చేస్తే యావద్భారతం ప్రతి ఇంటా రాట్నం చక్రాలు తిరిగాయి. ఆ కారణగా ఇంగ్లాండ్‌లో గొప్ప గొప్ప బట్టల మిల్లులు మూత పడ్డాయి.

ఈ పరిణామాన్ని గమనించిన తరువాత గాంధీ మహాత్ముడు ఆత్మ శక్తితో రాజకీయ పరిష్కారాలను కూడా సాధిస్తున్నాడని విమర్శకులు కూడా ఒప్పుకున్నారు.

గాంధీ మహాత్ముడు స్థాపించిన ఆశ్రమాలు దేశ చరిత్రను మార్చటంలో అద్భుతంగా ఉపకరించాయి. పూర్వకాలంలో ఇలాంటివే ఋషుల ఆశ్రమాలు కూడా ఉండేవి. వాటిలో లాగే ఇక్కడ కూడా పవిత్రంగా క్రమశిక్షణాయుతంగా మనుషులు జీవించేవారు. ఈ విషయాలు పత్రికలు ద్వారా బాగా ప్రచారం చేశారు. దేశం నలుమూలలకు ఈ పవిత్ర చింతన, క్రమశిక్షణ ప్రచారం అవుతూ ఉండేది.

ఆయన లండన్ వెళ్ళినప్పుడు ఇలాంటిదే మరో అద్భుతం కూడా జరిగింది. రౌండ్ టేబుల్ సమావేశానికి భారత జాతీయ కాంగ్రెస్ ప్రతినిధిగా హాజరయ్యాడు గాంధీజీ. వాస్తవానికి బ్రిటిషు ప్రభుత్వం ఇచ్చిన ఈ పిలుపు గాంధీ చేసిన సత్యాగ్రహానికి ఫలితమే. ప్రథమము నుండి బ్రిటిషు పాలకులు భారతదేశం పట్ల విభజించి-పాలించు అనే సిద్ధాంతాన్నే అమలుపరిచారు. కాంగ్రెసులో అతివాద-మితవాద వర్గాలను గుర్తించనట్లు నటించి రెండు వర్గాల వారు సమావేశానికి రావాలని ఆహ్వానం పంపారు. గాంధీజీతో పాటు మదనమోహన మాలవ్య కూడా వెళ్ళాడు. అవి ఎముకలు కొరికే చలి రోజులు. భారతదేశ ప్రతినిధి అంటే భారతీయుల పేదరికానికి కూడా ప్రతినిధిని అని అర్థం చెప్పాడు గాంధీజీ. ఒక కొల్లాయి కట్టి మరో కొల్లాయిని భుజం మీద వేసుకుని ఆయన రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరయ్యాడు. అక్కడ ఉన్న డాంబిక వాదులందరూ గాంధీజీ వేషధారణను ఎగతాళి పట్టించారు. గాంధీజీ తాను మాట్లాడేందుకు కాకుండా తదిరులు మాట్లాడే దాని పట్ల ఎక్కువ శ్రద్ధ చూపించాడు. సమావేశంలో అర్థ నగ్న రూపం అని బ్రిటిష్‌వారు అవహేళనగా మాట్లాడారు. మీ పాలనలో భారతీయులు ఎంత పేదరికాన్ని అనుభవిస్తున్నారో చెప్పటమే నా లక్ష్యమని బదులు చెప్పాడు. ఆయన నిరాడంబరతనే కాకుండా ఎక్కువసేపు మౌనంగా ఉండటాన్ని ఆయన వెంట వెళ్ళిన భారతీయులు కూడా కొందరు విమర్శించారు. కానీ గాంధీ నోటి వెంట వచ్చిన ప్రతిపాదన లన్నీ రౌండ్ టేబుల్ సమావేశం సగర్వంగా స్వీకరించింది. ఎదుటి వారిని ఒప్పించేలా పరిమితంగా మాట్లాడటంలో ఉన్న మహనీయత అందరికీ అర్థమయింది.

ఇది ఆయన ప్రభావాన్ని నిరూపించిన వ్యక్తిగత ధోరణి. ఆత్మశక్తిని నిరూపించే మరో సంఘటన కూడా జరిగింది. గాంధీజీ లండన్‌లో చలిని తట్టుకొనటానికి ఏ విధమైన ప్రత్యేకమైన ఏర్పాట్లను చేసుకొనలేదు. అదనంగా వస్త్రాలను ధరించలేదు. మిగిలిన భారతీయ ప్రతినిధులు ఆంగ్లేయుల వలెనే చలి నుండి రక్షణ పొందటానికి ఉన్ని వస్త్రాలను దొంతరలుగా చుట్టుకున్నారు.

ఆశ్రమవాసంలో అలవాటును అనుసరించి గాంధీజీ తెల్లవారుఝామున 4 గం॥లకు నిద్ర లేచేవాడు. థేమ్స్ నదిలో ఆ వేళప్పుడు దిగటమనేది ఆంగ్లేయులకు ఊహించరాని

విషయం. కొల్లాయితో వెళ్ళి గాంధీజీ స్నానం చేసేవాడు. చలి నుంచి రక్షణకు అదనపు వస్త్రాలు, ఉపయోగించకుండానే వీధి వెంట నడచి వచ్చేవాడు. ఆంగ్లేయులు ఎవరైనా ఆ వేళప్పుడు, బయటకు రావలసి వస్తే బూట్లు, తోలు మేజోళ్ళు, దొంతరలుగా ఉన్ని వస్త్రాలు, కళ్ళు మాత్రం కన్పించేలా ప్రత్యేకమైన టోపీలు ధరించి కూడా నడచి వెళ్ళటం సాధ్యపడక గాంధీ ప్రక్క నుండి పరుగెత్తుకు పోతుండేవారు.

గదులలో దూరిన తరువాత కరెంటు కుంపట్ల సహాయంతో చలి కాచుకునేవారు. అల్ప వస్త్రధారణతో ఆ సమయంలో థేమ్స్ నదీ స్నానానికి 4 మైళ్ళు నడచి వెళ్ళటమంటే అది ఆత్మశక్తి కాక మరేమవుతుంది. సత్యము, అహింస, ఋజువర్తనము వీటి వల్ల మనిషిలో ఆత్మశక్తులు మేల్కొంటాయని గాంధీజీ ఆ విధంగా నిరూపించాడు. అందువల్లనే ఆంగ్లేయులకు అనుకూల ధోరణిలో ఉండి స్వాతంత్ర్యం దయాభిక్షంగా పొందాలన్న వారిని ఖండించి ఋజుమార్గంలో ఆత్మన్యూనతా భావం లేకుండా స్వాతంత్ర్యం సంపాదించ గలిగాడు.

లండన్‌లో కొందరు గాంధీజీ గురించి తెలిసినవారు ఆయనను ప్రధానమంత్రితో కలపాలని ప్రయత్నాలు ప్రారంభించారు. భారతీయులకు ఈ వార్త చాలా ఉత్సాహాన్ని ఇచ్చింది. తన వాదాన్ని ఎవరి ముందైనా చెప్పి గాంధీజీ ఒప్పించగలడు. ఈ విషయం తెలిసిన కొందరు ప్రధానమంత్రి దగ్గరకు ఆయనను తీసికొని వెళ్ళడాన్ని వ్యతిరేకించారు.

అలా చేస్తే ప్రధానమంత్రిని భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చేలా ఒప్పించగలుగు తాడని వారి భయం.

అయితే మహాత్ముడు కూడా ప్రధానమంత్రిని చూచేందుకు ఉత్సాహాన్ని ప్రదర్శించలేదు.

చక్రవర్తి గాంధీజీకి విందు చేయడం ద్వారా ఒక సంచలనం సృష్టించాలని తలపోశాడు. భారతదేశం ప్రతినిధులైన అతివాద, మితవాద కాంగ్రెస్ ప్రతినిధులందరూ విందుకు రావాలని ఆహ్వానం పంపారు. అందరికి ఈ ఆహ్వానం సంతోషాన్ని కలిగించింది.

గాంధీ మాత్రం ఈ విషయమై ప్రధానమంత్రికి లేఖ వ్రాశాడు. మీ దేశంలో చక్రవర్తిని కలుసుకోడానికి ఎన్నో నిబంధనలు ఉన్నాయి. మా వేషభాషలను కూడా మీరే నిర్ణయిస్తారు. అంతేకాక భారతీయ ప్రతినిధులు విందు వినోదాలకు రాలేదు. మాది నలుబది కోట్ల జనాభా గల నిరుపేద దేశం. వారందరి ప్రతినిధిగా నేను విలాసవంతమైన విందులకు హాజరు కాలేను. నేను ధరించిన వేషమును నా దేశములో నిరుపేద ప్రజలు ధరిస్తున్నారు. ఈ షరతులకు అంగీకారమైతే నేను రాగలను.

ఈ విచిత్ర నాయకుని పట్టుదలకు చక్రవర్తితో పాటు ప్రధానమంత్రి కూడా తలవంచక తప్పలేదు. వారు ఈ షరతులకు ఒప్పుకున్న తరువాత గాంధీ చక్రవర్తి ప్రక్కన కూర్చొని విందులో పాల్గొన్నాడు.

ఆ విధంగా గాంధీజీ ఆత్మశక్తి ప్రపంచంలో ఏకైక రాజ్యాధికారుల అహంకారాన్ని ఎదిరించి నిలిచి జయించింది. ఈ ఆత్మశక్తి వల్లనే మహిళల జాగృతిని సాధించాలని ఆయన సంకల్పించాడు. వారిని అబలలు అంటున్నందుకు ఎంతగానో నొచ్చుకునేవాడు. చిన్నతనంలో బాల్య వివాహపు ప్రభావంలో పెళ్ళంటే ఏమిటో తెలియని వయసులో కస్తూరిబా మీద పెత్తనం చెలాయించాడు. దానిని ఆమె సహించిన తీరు మహిళల పట్ల ఎంతో అవగాహనను ఇచ్చింది.

అయిష్టాన్ని ప్రదర్శించేందుకు అన్నం ముట్టకుండా ఉండేది. దానినే నిరసన వ్రతంగా మలిచాడు.

ఎంతో దుస్థితిలో ఉన్నవారు ప్రదర్శించే సహనం, భవిష్యత్తు మీద ఆశ, కుటుంబ కర్తవ్యాల పట్ల నిబద్ధత ఆయనకు ఎంతో జ్ఞానాన్ని కలిగించాయి. ధైర్యం, హేతుబద్ధత, శాస్త్రవిజ్ఞానం, బాధ్యతలు, అధికారాలు మగవారితో పాటు స్త్రీలు కూడ సమంగా కలిగి ఉండాలని కోరాడు. ఒక దేశ సంస్కరణ ఉద్యమం అనేది ప్రతి ఇంటి నుండి ప్రారంభం కావాలని గాంధీజీ ఉద్బోధించాడు. స్వదేశంలో ఉన్నా, విదేశంలో ఉన్నా ప్రజల సమస్యల పట్ల, వాటి పరిష్కారం పట్ల ఎంతో ఆసక్తి ప్రదర్శించాడు. శారదా చట్టం వచ్చినప్పుడు దానిని సమర్థించాడు.త్యాగానికి,అహింసకు ప్రతిరూపాలైన మహిళలు పాల్గొంటే స్వాతంత్ర్యం అనుకున్న దానికన్నా ముందుగానే వస్తుందని నమ్మేవాడు.

ఆయన శిక్షణలో సరోజినీదేవి, విజయలక్ష్మి పండిట్, సుచేతా కృపలానీ లాంటి ఎందరో మహిళలు జాతీయస్థాయిలో ఉత్తమ రాజకీయవేత్తలుగా రూపొందారు.

స్త్రీలు పురుషుల ఆత్మలోసగభాగం. ఆత్మ విమర్శ చేసుకున్న తరువాత తిరిగి శరణార్థుల సేవలో మునిగిపోయాడు. భగవద్గీత మహాత్మునికి ప్రామాణికం. అందులో చెప్పిన విధంగానే పుట్టిన ప్రతి ఒక్కరికి గిట్టుట తప్పదు. జీవితానికి వలెనే సేవకు, ధర్మానికి, ఆత్మత్యాగానికి, నిరంతర అన్వేషణకు కూడా ఒక ముగింపు ఉంది. జీవులు మలిన వస్త్రాలను విడిచి నూతన వస్త్రాలను ధరించినట్లు శరీరాన్ని పరిత్యజించాల్సిన సమయం ఒకటి ఉన్నది.

మరణమనేది రహస్యంగా మనిషి మీద ఆవరించుకునే చల్లని, నల్లని మేఘం.

అది 1948 జనరి 20 తేదీ.

గాంధీజీ ప్రార్థనా సమావేశానికి వెళుతూ ఉండగా బాంబు ప్రేలుడు జరిగింది. ఈ సందర్భంగా ఒక పంజాబ్ శరణార్థిని అరెస్టు చేశారు. అతనిని విడిచి పెట్టమని కోరాడు గాంధీజీ. తాను దేశానికి నష్టం చేశాడనే భావం కొందరు యువకుల్లో ఎంత గాఢంగా నాటుకుపోయిందో గుర్తించాడు.

యువకులకు వాస్తవాలను తెలియనివ్వాలి. వారిని ఆవేశంలో పెడదోవ పట్టనివ్వకూడదు అని ఆయన వ్యాఖ్యానించాడు. మరణం పొంచి ఉన్నదని మిత్రులు హెచ్చరించారు. అంగరక్షకులను నియమించడానికి ఆయన ససేమిరా ఒప్పుకొనలేదు. దేవుడు ప్రసాదించిన జీవితం దేవుడే తిరిగి తీసుకోవాలని కోరినప్పుడు అడ్డుకునే అధికారం మనిషికి లేదని వివరించాడు.

విరిగిన మనసులు అతకాలి. హిందూ ముస్లిములు భారతదేశంలో కలసి మెలసి జీవించాలి. తాను పాకిస్తాన్ పర్యటనకు వెళ్ళాలని కూడ ఆలోచించాడు. ముస్లిం యువకులకు హిందువుల పట్ల ఎంత ద్వేషభావం ఉన్నా గాంధీ పట్ల సౌజన్యంగా ఉండేవారు. వారు ఆయనను 27వ తేదీన దర్గాషరీఫ్‌కు తీసుకొని పోయి ప్రార్థనలు చేయించారు. 1948 జనవరి 30వ తేదీ విషాదకరమైన దుర్దినం.

గాంధీ మహాత్ముడు కాంగ్రెస్ భవితవ్యాన్ని గురించి తీవ్రంగా ఆలోచించాడు.

కాంగ్రెసు ఉన్నంత కాలం ముస్లింలీగ్ వారు వేర్పాటు ధోరణులను రెచ్చగొడుతూనే ఉంటారని భావించాడు. దర్గాషరీఫ్‌కు తాను వెళ్ళినపుడు ఏ విధంగా అయితే హిందువులు, ముస్లింలు కలసి పండుగ జరుపుకున్నారో అలాగే శాశ్వతంగా కలసికట్టుగా ఉండాలని ఆయనకు అనిపించింది. త్యాగాలు చేయడం భారత జాతీయ కాంగ్రెస్‌కు క్రొత్త విషయమేమీ కాదు.

మత కలహాలు చెలరేగినపుడు కారకులు సుదూర ప్రాంతాలలో ఉన్నవారు ఎవరైనప్పటికీ, గాంధీ మహాత్ముడు తాను ఆత్మ ప్రక్షాళన కోసం నిరసన వ్రతాన్ని పాటించే అలవాటు ఒకటున్నది. ఈ సారి ఆ పని భారత జాతీయ కాంగ్రెసు పార్టీ చేత చేయించాలని ఆయన భావించాడు.

అందుకే కెటలిస్టులాగా అది తన అవతారాన్ని ఉపసంహరించుకోమని కోరుతూ ఒక డ్రాఫ్టును టైపు చేయించాడు. ఇది లౌకిక దృష్టిలో పెద్ద కుదుపు అయింది.

వాస్తవానికి ఆయన ఆ మాటను ఇంతకు మునుపు కొంత మందితో అని ఉన్నాడు. విన్నవారు నివ్వెరపోయారు. ఎవ్వరూ ఊహించలేని ఊహించరాని ప్రతిపాదన.

వందల సంవత్సరాలు పరాయి పాలకుల కోరల మధ్య చిక్కిన భారతావని వలస సామ్రాజ్యవాదుల రాక్షస క్రీడలో ఈ దేశ ప్రజలు మ్రగ్గిపోయారు. ఎన్ని విషాదకర ఘట్టాలు జరిగాయో, భారతీయుల జీవితాలు అణచివేయబడి ఎంత కల్లోలితమయ్యాయో?

ఎన్ని వందల సమస్యలు?

ఎన్ని వేల తిరుగుబాట్లు?

ఎన్ని లక్షల ప్రాణాల బలిదానం?

గతించిన చరిత్రకు గుర్తింపు లేకపోయినా, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి, ఓడించి స్వతంత్ర ఫలాన్ని సంపాదించిన భారత జాతీయ కాంగ్రెస్ ఇక ఉండరాదా? ఏమి ఆలోచన ఇది.

గాంధీ మహాత్మునికి మతిపోయిందని దుడుకు వర్గాలు కొన్ని కేకలు పెట్టి అల్లరి చేశాయి. ఈ జాతి జనుల అభ్యుదయానికి తలమానికమై నిలిచిన భారత జాతీయ కాంగ్రెసు రద్దు కావాలని పిన్నలు, పెద్దలు అందరూ భావించారు. ఇంతకాలం కాంగ్రెసుతో కలిసి నడుస్తున్న, నడిపిస్తున్న ఒక త్యాగభావం ఈ గాంధీయిజమ్. కానీ ఆ సంస్థలో ఇప్పటికీ అతివాదుల, మితవాదుల అభిప్రాయ భేదాలు పొడసూపాయి. ఇప్పుడు గాంధీయిజమ్ అనేది మరొకటి రూపు దాల్చితే అంతా అయోమయం అయిపోతుందని అందరూ అనుకున్నారు. ఎన్నో త్యాగాల ఫలితంగా సంపాదించుకున్న స్వాతంత్ర్య ఫలాన్ని అనుభవించకుడా ఆ పార్టీని రద్దు చేయడం ఎవరికీ ఇష్టమనిపించలేదు.

రావణ వధ తరువాత ఏ రాముడైన అవతారం చాలించక తప్పదు. కురుక్షేత్ర సంగ్రామం తరువాత ఏ కృష్ణుడైన బోయవాడి బాణానికి బలి కావం అనివార్యం. సేవ చేసినవారు శిలువ నెక్కడం చారిత్రక సత్యం. కాని కాంగ్రెసు సంస్థ ఏ మహాత్ముని మాటల కోసమైనా తనను తాను శిలువ వేసుకొనడానికి సిద్ధంగా లేదు.

1948 జనవరి 30వ తేదీన మొట్టమొదటిసారిగా మహాత్ముని ప్రతిపాదన ఏకగ్రీంగా తిరస్కార భావానికి గురి అయింది. ఇంక ఆ సాయంత్రం జరుగనున్నది ఏమో కానీ మహాత్ముని మాట ఆ పూటే చచ్చిపోయింది.

ఇక్కడ ఒక్కసారి యువభారతి కోణం నుంచి ఈ విషాద కథని మనం చెప్పుకోవాలి.

రాష్ట్రీయ నాయకత్వంలో గ్వాలియర్‌లో ఒక యువతరంగం ఉరికి వచ్చింది. ఆరుగురు యువకులు ఆవేశంతో ఊగిపోతూ ఆ సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెసు సంస్థ విప్లవ వీరులుగా గుర్తించిన హిందూ యువకులు వారు.

గాంధీ మహాత్ముని విధానాలను విమర్శలకు గురి చేయాలని ఉవ్విళ్ళూరిన ఆలోచనాపరులు వారు.

పాకిస్తాన్‌కు 55 కోట్ల రూపాయల మొత్తం అప్పగించి ఈ దేశానికి దరిద్రాన్ని తోడుగా మిగిల్చినవాడు గాంధీయే అని వారి నమ్మకం. అనేకసార్లు తన విధానాల ద్వారా ఆత్మక్షాళన, ఆత్మత్యాగం పేర్లతో భారతీయుల ఆవేశాన్ని చప్పగా చల్లార్చినవాడు మహాత్ముడే అని వారికి నమ్మకం. ఇంకా ఆ వడలిన బడుగు శరీరం సజీవంగా ఉంటే ఎన్ని సమస్యలు తెచ్చిపెడుతుందోనని వారి బాధ.

సమావేశంలో మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీని చంపివేయాలని వారు ఏకగ్రీవంగా తీర్మానించారు.

ఆరుగురి పేర్లు వ్రాసి చీట్లు వేశారు.

ఎవరి పేరైతే వస్తుందో వారే ఢిల్లీ వెళ్ళి ఈ హత్య స్వహస్తాలతో చేసి రావాలి.

జరిగిన ఒప్పందం ప్రకారం "వినాయక నాథూరామ్ గాడ్సే"కి ఈ బాధ్యత అప్పగించబడింది. అతడు ఎల్ఎల్‌బి పట్టభద్రుడు.

నిర్ణయమైన వెంటనే విమానం మీద ప్రయాణించి ఢిల్లీ చేరుకున్నాడు. ఢిల్లీ మహానగరంలో మతకలహాల మంటలు, కాందిశీకుల చిచ్చు... కల్లోలితంగా ఉంది రాజధాని.

ఎవరు ఎవరో గుర్తించగల అవకాశం ఎవరికీ లేదు. అంతా అయోమయంగా కనిపిస్తోంది. సేవాధర్మం కలవారు సేవలు చేస్తున్నారు. రోగాలకు భయపడ్డవారు ఇళ్ళల్లో దాక్కున్నారు. దమనకాండలకు దడుచుకున్నవారు నగరాన్నే విడిచి వెళ్ళిపోయారు. పాతవారు, క్రొత్తవారు, కాందిశీకులు కలగాపులగం అయిపోయారు.

ఎవరిని మిత్రులనుకోవాలి. ఎవరిని శత్రువులనుకోవాలి? నాథూరామ్ గాడ్సే ఈ అయోమయ అవస్థను చక్కగా ఉపయోగించుకోవాలనుకున్నాడు. ముందుగా బిర్లా మందిరము, ప్రార్థనా సమావేశ స్థలము చక్కగా పరిశీలించాడు. చేయదలచిన ఘాతుకానికి చక్కని పథకము రూపొందించాడు.

మహాత్మాగాంధీ జీవితమంతా సమయాన్ని పాటించినవాడు. వేళ తప్పక ఆయన ప్రార్థనా మందిరానికి వచ్చాడు. వేదిక మీదకు వెళ్ళి కూర్చుని ముందుగా కొద్ది మాటలు చెప్పి ఉపక్రమించాడు. ముందు వరుసలో కూర్చుని యున్న నాథూరామ్‌గాడ్సే ప్రశాంతంగా లేచి నిలబడి మహాత్ముని సన్నిధికి వెళ్ళాడు. వంగి ఆయన పాదాలకు నమస్కరించాడు.

లేచి నిలబడుతూనే వస్త్రాలలో దాచిన పిస్తోలును తీసి గుండెలకు గురి పెట్టి గుండును వదలిపెట్టాడు. ఆ శబ్దానికి ప్రార్థనా సమావేశమందిరం అవాక్కు పడిపోయింది.

హే రామ్! అని పవిత్ర నామం స్మరిస్తూ మహాత్ముని మంగళమూర్తి ప్రక్కకు వాలిపోయింది. ఆయన అశువులు విశ్వాంతరాళానికి వెళ్ళిపోయాయి.

ఆత్మనాదంతో వినిపించిన ఆ విశ్వవిపంచి మూగపోయింది. పవిత్రతను పరిపూర్ణతను, పరాకాష్ట వ్యక్తిత్వాన్ని, ప్రపంచ హితాన్ని జీవితమంతా విశ్వసించిన శ్వాస ఆసాంతమై ఆగిపోయింది. ప్రార్థనా సమావేశ మందిరంలో హాహాకారాలు చెలరేగాయి. భారత ప్రజ ఆ దివ్యపురుషుని తిరోగమనానికి తీరని వ్యథతో కుమిలిపోయింది. ప్రపచం కన్నీరు కార్చింది.

ఒక మానవమాత్రుడిగా భావించుకొన్నది దూరం అయినట్లుగా భావిస్తున్నాడు. గాంధీ మరణవార్త చేరిన ప్రతిచోట, అక్కడ జన జీవితం స్తంభించిపోయింది. ఇంకా ఒక చీకటి తెర, నుంచి అవమానం జరిగింది. ఐక్యరాజ్యసమితికి ఈ వార్త చేరగానే, అక్కడ నిర్ఘాంతపోయిన నిశ్శబ్దం ఏర్పడింది. మానవులు అందరు వారు కోరుకొన్నది ఏదో పోయినట్లుగా భావించి దుఃఖించారు.

భారతదేశంలో పండితనెహ్రూ రేడియోలో "మన జీవితాల నుంచి కాంతి వెళ్ళి పోయింది లేదు నేను సరిగా చెప్పలేదు. ఎందుకంటే ఈ దేశాన్ని తన వెలుగుతో నింపిన జ్యోతి సాధారణ జ్యోతి కాదు... వేల కొలది సంవత్సరాల తరువాత కూడా ఆ జ్యోతి (వెలుగు) ఈ దేశంలో కనిపిస్తూనే ఉంటుంది. ప్రపంచం దానిని చూస్తూ ఉంటుంది... ఎందుకంటే ఆ జ్యోతి (కాంతి) జీవించి ఉన్న సత్యానికి ప్రతినిధి" అని చెప్పాడు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ "తాను ఒక కలం నుంచి మేలుకొన్నానని, తన కండ్లు రక్తసిక్త ఎరుపుతో ఉన్నాయని చూచాన"ని అంతేగాక ఆయన "తన చేతులే గాక, వాటితో పాటు దేశంలోని అందరి చేతులు గాంధీ రక్తంతో వర్ణరంజితం అయి ఉన్నాయి" అని అన్నాడు. కొన్ని రోజుల తరువాత, గాంధీ అనుయాయులందరికీ గాంధీ యొక్క ఆశ్రమంలో ఉద్దేశించి మాట్లాడుతూ డా॥ రాజేంద్రప్రసాద్ "ఉదయమే కోడి మూడుసార్లు కూసినా, మనం ఆయనను మోసగించాం" అని అన్నాడు.

ఈనాడు గాంధీ లేడు కానీ ఆయన తానే భవిష్యత్తులోనికి చూసి "నేను మరణించి పూడ్చి పెట్టబడినప్పుడు, నేను నా సమాధి నుంచి మాట్లాడగలను" అని అన్నాడు. గాంధీ పార్థివశరీరం అగ్నికి ఆహుతి చేయబడింది. కానీ ఆయన మనకు ఇచ్చిన సందేశం మాత్రం కాదు. ఆ సందేశం మానవజాతికి ఇచ్చిన ఆశా సందేశంగా శాశ్వతంగా నిలిచి ఉంటుంది.

జాతిపిత

# మహాత్మాగాంధీ



'రక్తమాంసాలు గల ఇలాంటి వ్యక్తి భూమి మీద నడిచాడని ముందు తరాలవారు నమ్మలేరు..."

- ఆల్బర్ట్ ఐన్ స్టీన్


విక్టరీ పబ్లిషర్స్

# 30-17-3ఎ, వారణాసి వారి వీధి, సీతారాంపురం,
విజయవాడ - 520 002. ఫోన్ : 0866-2444156